

ఆణిముత్యాలు
1998
కస్తూరి బెహన్

# ఆణిముత్యాలు
# 1998



## కస్తూరి బెహెన్

వ్యక్తిగత వినియోగం కొరకు మాత్రమే

సిస్టర్ కస్తూరీగారి తెలుగు పుస్తకాల కొరకు

కె. రామదాస్ - **9440652774**

కె. సుదర్శన్ - **9247805058** లేదా

**9063177540**

సంప్రదించగలరు.

# ఆణిముత్యాలు

# 1998

## కస్తూరి బెహెన్

# ఆణిముత్యాలు - 1998

పలు ప్రదేశాల నుండి అభ్యాసులు సోదరి కస్తూరిజీని లక్నోలో దర్శించినపుడు సహజమార్గ విధానపు వైశిష్ట్యాన్ని వివరణాత్మకంగా ఇస్తూ బాబూజీ గురించి చెప్పిన ఎన్నెన్నో విషయాలను ఈ చిన్ని పుస్తకంలో పొందుపరచాము.

1998వ సంవత్సరం నవంబర్ 14, 15, 16 తేదీలలో లక్నోలో బాబూజీవారి జన్మ శతాబ్ది ఉత్సవాలు జరుపుకున్న సందర్భంలో సెయింట్ కస్తూరిజీ ఇచ్చిన సందేశాలు, ప్రసంగధారలు ఇందులో సమకూర్చడం జరిగింది.

తెలుగు తర్జుమాలోగాని, అవగాహన లోపంతో గాని వచ్చిన తప్పులకు మన్నించ ప్రార్థన.

బాబూజీ వారి ఆశీస్సులనర్థిస్తూ

**- మీ సోదర అభ్యాసులు**

17-01-1999

**బాబూజీ బిడ్డల సమర్పణ ఇది**

# ఆణిముత్యాలు - 1998

**బాబూజీ జన్మదినోత్సవ సందర్భంగా సోదరి కస్తూరిగారిచే రచింపబడి, ఆలాపన చేయబడిన గీతంలోని సారాంశాన్ని ఇలా కస్తూరిజీ వివరించారు.**

శ్రీ లాలాజీ మహరాజ్ అభ్యర్థనను ఆలకించి భూమా తన శక్తితో సహా బాబూజీ వారిని అవతరింపజేసింది. అట్టి బాబూజీని దర్శింపజేసేందుకు భూమా తన సింహద్వారాన్ని తెరచి ఉంచింది. దివ్య దర్శనం పొందగలిగిన వారే ఆ దివ్యరూపాన్ని అంటే ఆ దివ్య బాల రూపాన్ని చూడగలరు. (అని దాని అంతర్భావం)

అనగా మనం దివ్యజ్యోతిని (భౌతిక రూపాన్ని) మాత్రమే దర్శించగలంగాని అసలైన ఆ దివ్యరూప దర్శనం సంభవం కాదు. ఆపై మనం చూడగలిగింది బాబూజీ యొక్క భౌతిక రూపాన్ని మాత్రమే. అందుకనే బాబూజీ అప్పుడప్పుడు అభ్యాసీలతో -మీరు నన్ను చూడడానికి వచ్చారు కాని నన్ను చూడలేకపోయారు అని అంటూ ఉండేవారు. అనగా భౌతిక శరీరాన్ని చూడగలుగుతున్నారేకాని వారి దివ్యత్వాన్ని (దివ్యత్వాన్ని - అనగా భగవత్ తత్వాన్ని అంటే భగవత్ తత్వరూపాన్ని) గ్రహించి, కనలేకపోతున్నారన్న భావం అన్నమాట. దివ్య ప్రకాశం మనలో ఉంటేనే మనం ఆ దివ్యత్వ రూపాన్ని చూడగలం. ఆధ్యాత్మికంగా అత్యున్నత దశకు చేరుకున్న అభ్యాసీలు మాత్రమే అలా చూడగలగడం సాధ్యమవుతుంది.

ఒకానొక సందర్భంలో ఒక అభ్యాసి "జీవితంలో కష్టమైనది ఏమిటి?" అని బాబూజీని ప్రశ్నించగా 'వారు' ఇలా చెప్పారు:

"మనం ఉండరానిచోట ఉండి ఉండడమే అతి కష్టమైన విషయం" అని. అనగా 'భూమా' ను వదలి ఈ జన్మల పరంపరలో విషయలోలురమై ఇక్కడ జీవించడమే కష్టమైనది – అని దాని భావం.

తనను సందర్శించవచ్చిన అభ్యాసీసోదరులను ఉద్దేశించి సహజమార్గ వైశిష్ట్యము గురించి బాబూజీ మహరాజ్ యొక్క వాక్కులూ 'వారి'తో ఉన్న సన్నివేశ సందర్భాలలో బాబూజీ వివరించిన ఆధ్యాత్మిక తత్వమూ – ఒకటేమిటి అన్నిటా, అంతటా, బాబూజీని దర్శించి, నిఖిలలోకానికి 'వారి'ని దర్శింపజేసే సోదరి కస్తూరిజీ వాక్కులు, వివరణలూ చదువుకుందాం. అంటే హృదయంతో విందాం.

వైరాగ్యం – రినన్సియేషన్ గురించి సోదరి ఇలా అన్నారు. పవిత్రమైన వైరాగ్యంలో సెల్ఫ్ అనగా స్వ ఉండదు. సెల్ఫ్ లెస్ అన్న దానిలో సెల్ఫ్ కొంత ఉంటుంది. కాని 'స్వ' అంటే 'తన అనేది' పూర్తిగా లేని భావనయే – పరిపూర్ణ పవిత్ర వైరాగ్యం అవుతుంది. దాని స్వచ్ఛమైన భావనలో అపవిత్రత ఉండనేరదు. అనగా తాను అనే భావం కలుగకుండా పూర్తిగా ఈశ్వర భావం కలిగి ఉండడమే స్వచ్ఛమైన వైరాగ్య స్థితి అవుతుంది."

అలాగే పవిత్ర ప్రేమను గురించి చెబుతూ – దానిలో స్వార్థం ఉండదు. అనగా 'స్వ' కు అనగా 'తన'కు స్థానం లేదు. ఇందులో అభ్యాసీ శ్రీ బాబూజీని ప్రేమించడం ఒకటి. శ్రీ బాబూజీ అభ్యాసీని ప్రేమించడం మరొకటి. ఇందులో బాబూజీ మనల్ని ప్రేమించడం – అనగా బాబూజీ నుండి లభించే ప్రేమ; ఇది పవిత్రమైనది. ఎందుకంటే, **వారు** స్వార్థం లేకుండా ఇతరులకు అంటే అభ్యాసీలకు పంచేదేకాని **వారు** పొందేది ఏదీ లేదు. ఇటువంటి నిస్వార్థమైన పవిత్ర ప్రేమయే బాబూజీ నుండి లభ్యమవుతుంది.

అలాగే పూర్ణ వైరాగ్య స్థితిని పునః వ్యక్తీకరిస్తూ – ఒక దశలోని తన స్థితిని (కండిషన్‌ను) వర్ణించడంలో అభ్యాసికి ఇంకా కొంత 'తన' అనే భావన ఉంది. కనుక అది పూర్ణ వైరాగ్య స్థితి కాదనీ, ఆ దశలోని స్థితి యొక్క స్థితిని (కండిషన్ ఆఫ్ ది కండిషన్) తెలియజేయటమే పూర్ణ వైరాగ్య స్థితి అని అభివర్ణించారు.

ప్రేమ గురించి మరొకసారి వివరణ ఇస్తూ మనం ధ్యానంలో (కూర్చుని) ఉండకపోయినా బాబూజీ నుంచి ట్రాన్స్‌మిషన్ – ప్రాణాహుతి పొందుతూ ఉన్న అనుభూతి కలగటమే మనకు బాబూజీ నుండి ప్రేమ లభిస్తున్నట్లుగా భావించవచ్చు. దానికదే తార్కాణం.

వైరాగ్య పవిత్ర స్థితిలో – పవిత్రత, అపవిత్రత ఉండవు. 'స్వ' లేక నేను, తన అనే భావమూ ఉండదు. 'నేను' కరిగిపోతుంది.

సందర్భవశాత్తు బాబూజీని ఒక అభ్యాసి "జీవితంలో ముఖ్యమైనది ఏమిటి?" అని అడిగినప్పుడు బాబూజీ "జీవితం

ముఖ్యమైనది కాదు. జీవితంలో నీవు ముఖ్యమైన వాడవు" అన్నారు.

అంటే జీవితంలో నిన్ను నీవు తెలుసుకో – అని. మరో విషయం వినండి. 'నేను' అనే స్థానంలో "నీవు – మీరు" అన్నది ఉపయోగించండి. అలా ఎందుకంటే నేను, నా అన్నదానిలో సెల్ఫ్ – స్వార్థం ఉంది. "మీరు" అన్న దానిలో బాబూజీని సంబోధించినట్లవుతుంది. అనగా అంతా బాబూజీకే సమర్పించితే మనం చేసేదంతా వారే చేస్తున్నట్లు అవుతుంది. అనగా 'స్వ' నా అనేది కరిగి "నీవు, మీరు" అనే దానిలో కలిసి బాబూజీ పరం అవుతుంది. అనగా పరమాత్మార్పణం అవుతుంది – అని భావన.

ఈశ్వరసహాయ్‌గారు బాబూజీని ఓసారి "బాబూజీ నా కండిషన్ ఏమిటి?" అని అడిగారు. దానికి **వారు** "నీవు సెమీ అభ్యాసీవి. అంటే సగం అభ్యాసీవి. కానీ పూర్ణ అభ్యాసీవిగా అవుతావు అనుకుంటున్నాను" అన్నారు.

సెమీ – సగం అభ్యాసీ అనగా మెడిటేషన్‌లో (ధ్యానంలో) ఆనందం కలుగుతున్నట్లు అనుభూతి చెందుతూ ఉంటాడు. పూర్ణ అభ్యాసి, సంపూర్ణ అభ్యాసీ అటువంటి ఆనందాన్ని లక్ష్య పెట్టకుండా ధ్యానంలో నిమగ్నుడై ఇంకా పురోగమిస్తాడు.

**నది – సాగరం, అభ్యాసి – బాబూజీ:**

నది తన దారినే ప్రవహిస్తూ సాగరంలో సంగమిస్తుంది. నది యొక్క ధ్యేయం దారి చేసుకుంటూ సాగరంలో లీనం కావడమే. సాగరం తన మర్యాదను ఉల్లంఘించకుండా నదిని ఆహ్వానిస్తుందే కాని దానివైపు ప్రయాణించదు. బాబూజీ ఒక

దివ్య సాగరం వంటివారు. అందుచేత అభ్యాసీ నదివలె సహజమార్గంలో పయనించి బాబూజీలో విలీనం కావలసి ఉంటుంది. సాగరంవలెనే తపనతో తనను చేరాలనుకునే సాధకులను ప్రేమతో ఆహ్వానిస్తారు బాబూజీ. కనుక మన 'విధి', బాబూజీ యొక్క దివ్య ప్రేమసాగరంలోకి సహజమార్గం ద్వారా చేరి లయం కావడమే. దైవం తనను చేరడానికి మనకు మార్గం ఏర్పాటుచేసి ఉండలేదు కాని, బాబూజీ మనకు దివ్యపదం – పరమపదం చేరడానికి సహజమార్గం చూపించారు.

**మాస్టర్ హృదయంలోనా? వెలుపలా?**

"మాస్టర్ మన హృదయంలోనే ఉండటానికి, మాస్టర్ వెలుపల నుండి ట్రాన్స్‌మిషన్ ఇవ్వడానికి భేదం ఏమిటి?" అన్న ప్రశ్నకు జవాబుగా సోదరి ఇలా చెప్పారు.

మాస్టర్ మన హృదయంలో లేరు. మన హృదయంలో ఉన్నది దివ్యజ్యోతి – దివ్యశక్తి (డివైన్ లైట్ – డివైన్ పవర్) 'వారు' మన ఎదురుగా ఉన్నారని, ట్రాన్స్‌మిషన్ (ప్రాణాహుతి) **వారి** నుంచి మనకు లభిస్తున్నదని అనుకుంటూ ధ్యానం చేస్తూ ఉంటే 'వారి' గ్రేస్ – 'వారి' కృప మన శరీరమంతటా కణకణమూ వ్యాపించి, అంతటా 'వారే' వ్యాపించి ఉన్నట్లుగానూ, అణువణువునా బాబూజీ ప్రాణాహుతి శక్తి వ్యాపిస్తూన్నట్లుగాను ఉంటుంది. ఆ స్థితిలో అప్రయత్నంగానే దానంతటదే – బాబూజీ మనలో వ్యాపించి (ఆక్రమించి) ఉన్నట్లుగానే అనుభూతి పొందుతాం. 'వారి' లోనే మునిగిపోయినట్లూ ఉంటుంది. ఇది సహజ సిద్ధంగా జరిగేదే. ఇక ఇప్పుడు 'వారు' ఇచ్చే స్థితుల ఆనందం అనుభూతమవుతుంది.

**ఆనందానుభూతి:**

"ధ్యానంలో ఆనందానుభూతి అంటే ఏమిటి? ఎలా ఉంటుంది? అన్న ప్రశ్నకు సోదరి ఇలా జవాబిచ్చారు.

బాబూజీ ఏమన్నారంటే – పిల్లవానికి ఆటబొమ్మలిస్తే వాటితో ఆనందిస్తాడు. అలానే నీలో అనుభూతి కలిగినప్పుడు, ఆనందం కలిగినప్పుడు దానిలోనే మునిగి ఉండు, అనేవారు. కనుక దానిని బాబూజీయే ఇచ్చినట్లుగా అనుకుని ఆనందించాలి. ఈ విధంగా ఆనందం పొందడం ఒక ఎత్తయితే ఆ ఆనందంలో మునిగి ఉండడమనేది నూరుపాళ్ళ ఎత్తుగా భావించాలి. బాబూజీ అనేవారు – ఒక్కొక్క ఉన్నత స్థితిని పొందాలంటే ఒక్కో జీవితం, ఒక్కో జన్మ చాలదు అని. కానీ సహజమార్గం ద్వారా సుళువుగా అతి తక్కువ సమయంలో బాబూజీ ప్రేమతో మనకు ప్రసాదిస్తున్న ఈ స్థితులలో మునిగిపోయి 'వారి'కే మనం అర్పితమవ్వాలి.

బాబూజీ అభ్యాసీలతో అనేవారు: మీరు నన్ను చూస్తున్నారుకాని నా నుంచి ఏమీ పొందలేకపోతున్నారు, అని. అనగా వారిచ్చే దానిని గ్రహించడానికి ఎలర్ట్‌గా – సావధానంగా, మెళకువతనంతో ఉండడం కూడా ఎంతో అవుసరం. వారిచ్చే దానిని గ్రహించగలగడమే కాకుండా ఇంకా ఉన్నత స్థితులకు చేరుకోవాలనే తపన (క్రేవింగ్), వారిని వేడుకోలు చేసుకోవడం చాలా అవుసరం. ఉన్నత స్థితి యొక్క ఫీలింగ్ – అనుభూతిలో మునిగి ఉంటే దాని వ్యాప్తి జరుగుతుంది.

వైరాగ్యం అంటే మనం ఉన్న స్థితిలో 'స్వ' – 'తమ' అనే స్మృతి లేకపోవడం. డిటాచ్‌మెంట్ – అనసుబంధం అనే భావం

కలిగితే ఎక్కడో ఎటాచ్‌మెంట్ (అనుబంధం) ఉన్నట్లే ఉంటుంది. అందుకని ఆ ఎటాచ్‌మెంట్ – డిటాచ్‌మెంట్‌లు రెంటికీ అతీతంగా ఉండి ఉన్న స్థితిలో లీనం కావడమే.

లయం కావడం, లీనం చేసుకోవడం రెండూ వేర్వేరు స్థితులు. కాని ఇంగ్లీషులో రెండింటికీ కలిపి మెర్జ్ అనే పదం మాత్రమే ఉంది. లయం అనగా నది వెళ్ళి సముద్రంలో కలిసిపోవడం. లీనం చేసుకోవడం అంటే సముద్రం వెళ్ళి నదిని తనలో చేర్చుకుని కలుపుకోవడం. ఆంగ్లంలో ఈ తారతమ్యాన్ని తెలిపే పదాలు లేక రెంటికీ ఆ మెర్జ్ అన్న పదం మాత్రమే ప్రయోగించవలసి వస్తోంది.

అభ్యాసీలు ధ్యానంలో – ఆలోచనలు వస్తున్నాయనీ మరేమోమో సాకులతో డైవర్ట్ అవుతారు. ఒకే ఆలోచన – దైవం గురించిన ఆలోచనతోనే ఉండాలి. (పునః పునః) ధ్యానంలోకి మరలాలి.

లాలాజీ అన్నారు: ప్రతి మనిషిని ముందుగా స్వచ్ఛమైన మనిషిగా తయారు చేయాలి. అంటే అతడి అవలక్షణాలను తొలగించాలి. అపుడే అభ్యాసీగా తయారుచేయాలి, అని.

"బాబూజీ ఫోటో మీద ధ్యానం చేయవచ్చునా?" అని ఒకరు ప్రశ్నించారు. దానికి సోదరి జవాబు–

ఫోటో అనేది వయసునుబట్టి రకరకాలుగా మారుతూ ఉంటుంది. చిన్న నాటి ఫోటోకు, పెద్దయ్యాక ఫోటోకు, ఇంకా ఆ తర్వాత కూడా ఎన్నో మార్పులు ఉంటాయి. పెద్దయ్యాక, చిన్ననాటి ఫోటో అంత అందంగా కనిపించక పోవచ్చు. మనకైనా

చిన్నప్పటి ఫోటో అంతగా నచ్చకపోవచ్చు. అందుచేత పరివర్తనం చెందే ఫోటోకంటే ఆ ఫోటోలో ఉన్న బాబూజీ యొక్క దివ్యత్వం అనగా శాశ్వతమైన ఆ దివ్యశక్తిమీదనే ధ్యానం చేయాలి.

**సాక్షాత్కారం - రియలైజేషన్:**

రియలైజేషన్ - సాక్షాత్కారం అంటే ఏమిటి? - అని ఒకరు అడిగిన ప్రశ్నకు సోదరి కస్తూరి జవాబు ఇలా ఇచ్చారు: ఎవరి సాక్షాత్కారం! అది ఒక దివ్య శక్తి తేజస్సు. దివ్య తేజస్‌శక్తి. ప్రధాన శక్తి కేంద్రం. దానిని చూసి అందరికీ ఆనందం కలుగుతుంది. మనం ధ్యానంలో కూర్చుంటే అది సాక్షాత్కారమవుతుందా అంటే అది భౌతికమైనది కాదు. అంతరంగంలోనిది. ఒక దివ్యత్వపు శక్తిని, ఉనికిని గుర్తించడమే సాక్షాత్కారం. దానిని గుర్తించడానికి ముందుగా అభ్యాసీ తనలోని దివ్యత్వాన్ని ముందు గుర్తించాలి. ఆ తరువాత డివైన్ పర్సనాలిటీ యొక్క - దివ్య వ్యక్తిత్వపు దివ్యత్వాన్ని తిలకించాలి. బాబూజీ చెప్పినట్లుగా ఇది ఆత్మ సాక్షాత్కారం ద్వారా దివ్య సాక్షాత్కారమును (ఫ్రమ్ సెల్ఫ్ రియలైజేషన్ టు రియలైజేషన్ ఆఫ్ డివినిటి) పొందడం అవుతుంది.

ఆత్మ సాక్షాత్కారం - సెల్ఫ్ రియలైజేషన్ అనగా మనం ఎక్కడి నుండి, ఏ స్థితిలో ఉండి భగవంతునిచే పంపించబడ్డామో అక్కడికి ఆ స్థితికి మళ్ళీ చేరగలగడం అన్నదే. దీనినే “స్టేట్ ఆఫ్ ఫర్‌గెట్‌ఫుల్‌నెస్” అనగా తనను ‘తాను’గా ఎరిగి ఉండని దశ. ఇంకా చెప్పాలంటే దివ్యత్వం నుంచి తాను వేరు కాలేదనే భావపూరితమైన దశ. (దివ్యత్వం నుంచి వేరేగా తాననేది ఏదీ

ఉండని స్థితి) ఇదే మానవోత్పత్తిలో తొలిదశ. కనుక మనం ధ్యానంలో సాధన ద్వారా ఆ దశకు చేరుకున్న తరువాత, సాధనలో పురోగమించిన తర్వాత దివ్య సాక్షాత్కారం లభిస్తుంది. ఇందుకు తపన అవుసరం. ఇటువంటి తపన ద్వారానే లాలాజీ బాబూజీని భూమా నుండి అవతరింపజేశారు.

**కండిషన్ ఆఫ్ ది కండిషన్:**

స్థితి యొక్క స్థితి – కండిషన్ ఆఫ్ ది కండిషన్ గురించి వివరిస్తూ సోదరి ఇలా అన్నారు:

మనం ధ్యానం చేస్తూండగా ప్రోగ్రెస్‌లో కలిగే స్థితులు ఒక దశలో అంతమవుతాయి. అప్పటివరకూ కొన్ని స్థితులు మారుతూ, అక్కడి వాతావారణమూ మారుతూ ఉంటుంది. ఆ దివ్య వాతావరణంలో మన స్థితి మారదు గాని అక్కడి వాతావరణం మారుతూ ఉంటుంది. ఆపై అలా మారుతూ ఉన్న స్థితులు, వాతావరణం నిలిచిపోయి ఒక నిశ్చితమైన స్థితి కలుగుతుంది. స్పిరిట్యుయాలిటీ ముగింపు దశలో ఈ స్థితి కలుగుతుంది. ఇప్పడు మార్పులేని వాతావరణం నెలకొని ఉంటుంది. దీనికి ఉదాహరణగా చెప్పాలంటే మనం దారిలో ప్రయాణిస్తూ అనేక దృశ్యాలు చూస్తూ పలు మార్గాలగుండా ప్రయాణించి ఇంటికి చేరతాము. అక్కడ మనం మన ఇంటిలోని గదులు, వస్తువులూ, పరిసరాలు నిలకడగా చూస్తాము. అంటే గమనంలోని మార్పులు ముగింపుకు వచ్చి నిలకడ స్థితికి వస్తాము. దీనినే బాబూజీ ఛేంజ్ లెస్ కండిషన్ – మార్పులేని, మార్పు

ఉండని స్థితి అన్నారు. దీని తర్వాతే స్థితి యొక్క స్థితి – కండిషన్ ఆఫ్ ది కండిషన్ కలుగుతుంది అనీ అన్నారు.

షాజహాన్‌పూర్ ఆశ్రమానికి తరచుగా వస్తూ ఉండే ఒక అభ్యాసీ సోదరి దుఃఖిస్తూండడం బాబూజీ గమనించారు. ఇతర అభ్యాసులు కూడా గమనించి, బాబూజీపట్ల ఆమెకు అత్యంత ప్రేమ ఉండడంవలన అలా దుఃఖం కలుగుతోందనుకున్నారు. బాబూజీ ఆమెను కారణం ఏమిటని ప్రశ్నించారు. వారిపై తనకున్న అపారమైన ప్రేమ, అని ఆమె చెప్పింది. అపుడు బాబూజీ "నాతో అభ్యాసులకు ఆంతరిక సత్సంగం ఉండాలి. బాహ్య రూపంతో కాదు. అంతరంగంలో దివ్యత్వపు తపన ఉండాలి" అన్నారు. అందుకని మన అంతరంగం దివ్యత్వంతోటి కలయికకే తపన చెందాలి. బాబూజీ అందుకనే డివైన్ పర్సనాలిటీ అని ప్రయోగించకుండా డివైన్ అనగా దివ్యత్వం అని మాత్రమే ప్రయోగించేవారు. అందుచేత మనం మన హృదయంలోని దివ్యత్వాన్నే ప్రేమిస్తూ దానినే సదా స్మరించాలి.

బాబూజీ అంటూండేవారు – అభ్యాసులు ధ్యానంలో కూర్చుని నన్ను ఆహ్వానిస్తారు. కాని నేను వారికి చేరవయ్యేంతలోనే తమ ఆలోచనల్లోకి జారిపోయి వాటిలో నిమగ్నమైపోతారు, అని.

**ఏది ఉత్తమం:**

బాబూజీ ఎప్పుడూ మనతోనే ఉన్నారనే ఆలోచన ఉత్తమమైనదా లేక ధ్యానంలో కూర్చుని బాబూజీ మనలోనే ఉన్నారన్న ఆలోచన కలిగి ఉండడం ఉత్తమమా – ఏది ఉత్తమం, అని ఒక అభ్యాసి అడగ్గా సోదరి ఇచ్చిన జవాబు:

బాబూజీ ఎప్పుడూ మనతోనే ఉన్నారనే ఆలోచనతో మనం ఉండడం – ఒక రకం. మనం ధ్యానంలో కూర్చుని బాబూజీ మనతోనే ఉన్నారనే ఆలోచన కలిగి ఉండడం – మరో పద్ధతి. కాని ఈ రెండింటిలోనూ బాబూజీ ఎల్లప్పుడూ మనతోనే ఉన్నారనే భావమే ఉత్తమోత్తమైనది.

సెల్ఫ్ రియలైజేషన్ – ఆత్మసాక్షాత్కారం అంటే ఏమిటని మరో అభ్యాసి అడగగా సోదరి ఇలా చెప్పారు:

అభ్యాసి తాను జీవించి ఉండి కూడా (తాను అనే స్పృహ లేకుండా ఉండడం) తన స్పృహ లేకపోవటం, తాను ఎక్కడి నుంచి వచ్చానన్నది కూడా తెలిసి ఉండకపోవటం వంటి స్థితినే స్టేట్ ఆఫ్ ఫర్‌గెట్‌ఫుల్‌నెస్ అనగా మరపు స్థితి అంటారు. ఈ స్థితి నుంచే మానవుని అవతారిక జరిగింది. బాహ్యంలో తనను ఎవరైనా పిలిచినా దివ్యం నుంచి ఏదో పిలుపు అందుతున్నట్లు గానే ఉంటుంది. అభ్యాసీ ధ్యానం ద్వారా మళ్ళీ ఆ స్థితికి చేరుకోవటమే ఆత్మసాక్షాత్కారం – సెల్ఫ్ రియలైజేషన్ అవుతుంది. బాబూజీ కృపవల్లనే అభ్యాసి ఆ స్థితిని చేరగలడు గాని స్వప్రయత్నంతో దాన్ని అందుకోలేడు. ఈ ఫర్‌గెట్‌ఫుల్ స్టేట్ అనగా మరపు స్థితి – అంటే సాక్షాత్కార స్థితి నుంచే స్పిరిట్యుయాలిటీ అనగా ఆధ్యాత్మికత ప్రారంభమవుతుందని, బాబూజీ చెప్పారు. అందుకు ఉదాహరణగా – అర్జునునికి కూడా తన సంగతి తనకు తెలియదు, అన్నారు బాబూజీ. అలాగే చాలామంది అభ్యాసులు ఉన్నత దశలకు చేరుకున్నా తామున్న స్థితిని గుర్తించి అందులో ఎబ్జార్బ్ – లీనం కాలేకపోతున్నారనీ,

తమ అంతరంగంలో మునిగి ఉండి తాము అధిగమిస్తున్న స్థితులలో లీనమై ఉండాలన్నారు. అంతేగాని బాబూజీ భౌతిక రూపాన్ని స్మరించడం కాదు. ధ్యానంలో మనం పొందిన అనుభూతులు ఎప్పుడు గుర్తువచ్చినా వాటిలో పూర్తిగా తన్మయం కావాలని బాబూజీ చెప్పేవారు.

**డివైన్ హార్ట్ మీదనే ధ్యానం:**

ఒక అభ్యాసీ "నేను హృదయం మీద ధ్యానం చేస్తున్నాను. హృదయంలో దివ్యజ్యోతి ఉందనే భావం కూడ కలిగి ఉన్నాను. కాని నాకు గుండె చప్పుడు వినిపిస్తుంది. ప్రాణాహుతి రావడంలేదు. మరి నేను దేనిమీద ధ్యానం చేయాలి? – అనే ప్రశ్నకు బదులుగా సోదరి చెప్పిన జవాబు:

హృదయం – గుండె భౌతికమైనది. దాని వెనుక అంతరంగం (ఇన్నర్) లో డివైన్ లైట్ – దివ్యజ్యోతి, దివ్యత్వం ఉన్నాయి. అందుచేత గుండె శబ్దం మీద కాకుండా డివైన్ హార్ట్ మీద ధ్యానం చేయాలి. దివ్యజ్యోతి బిందువు మీద కూడా కాదు. ఈశ్వరుడు విరాట్ స్వరూపుడు కేవలం బిందు మాత్రుడే కాదు. అందుచేతనే మనకు లోపల బయట కూడా విరాట్ హృదయమే దర్శనం ఇస్తుంది. విరాట్ యొక్క విశ్వవ్యాప్తి కనిపిస్తుంది. డివైన్ హార్ట్ మీద ధ్యానం చేస్తూ ఉంటే అహం క్రమంగా తొలగిపోతుంది.

సహజమార్గ విధానంలో కేవలం ఒకే రకం ధ్యానం చెప్పబడింది. అభ్యాసి కేవలం ధ్యానంలో ఉండడమే అది. అభ్యాసీ పాత్ర ఏమీ ఉండదు. దివ్యంతో సంబంధం ఏర్పడుతుంది. మనలో ఉన్న దివ్యత్వంతో మనకు సంబంధం ఎలా

ఏర్పడుతుందంటే ప్రథమంగా మనం ఆ ఆలోచనను కలిగి ఉండడంవల్లనే. ఆ సంబంధం ఏర్పడిన తర్వాత మనం ఎక్కడికి వెళ్ళినా, ఏ ఆలోచన చేసినా ఆ విరాట్ ఆలోచనే ఉంటుంది. అప్పుడు మనకు ధ్యానావస్థిత మనస్సు ఏర్పడుతుంది. ధ్యానంలో ఒదిగిపోయిన మనః స్థితి కలుగుతుంది. ఇందులో మనసుకు శరీరానికి తావుండదు. మనస్సు మాత్రమే దివ్యంతో యోగం చెంది ఉంటుంది. మరే ఇతర యోగమూ ఉండదు. బాబూజీ మహరాజ్‌తో మనకు కనెక్షన్ అనగా – సంబంధం ఏర్పడగానే మిగతా ఆలోచనలన్నీ తొలగిపోతాయి. **వారి** నుండి ప్రాణాహుతి ధారనే మనం పొందుతాం.

ఒకసారి ఒక అభ్యాసీ బాబూజీని ఈశ్వరుడు మనలోనే ఉన్నాడు, బయట లేడా అని అడిగాడు. బాబూజీ అన్నారు కదా – మన మనసు విప్పి చూస్తే అంతటా ఆయన ఉనికియే కనిపిస్తుంది. ఆయన మన వెంటే ఉన్నాడనే భావన ఉంటే సర్వత్రా ఆయనే కనిపిస్తాడు.

చాలామంది ధ్యానంలో ఆలోచనలు వస్తున్నాయని ఫిర్యాదు చేస్తారు. అవి ఎందుకు వస్తున్నాయి అంటే అవి మనలో ఉండబట్టేకదా! కాని మనం ధ్యానంలో నిగ్రహంగా ఉంటే ఆలోచనలు వాటంతట అవి పారిపోతాయి. మీరు ధ్యానం నుండి ప్రక్కకి తొలగిపోవాలనుకున్నా – డిస్టర్బ్ కావాలనుకున్నా డిస్టర్బ్‌కారు. ఆలోచనలు ఎందుకు వస్తున్నాయంటే మనం వాటిలో మునిగి ఉన్నాం కనుక. మన దృష్టి అంతా భౌతిక ప్రపంచం

మీద ఆవరించి ఉంది. ఆలోచనలను వెంటబెట్టుకుని మనం ధ్యానం చేయాలనుకుంటున్నాం. అందుకే అవి మనల్ని భగ్నపరుస్తున్నాయి.

ఇవి నవరాత్రుల ఉత్సవాల రోజులు. దుర్గా విగ్రహాలు అనేకానేకంగా ప్రతిష్ఠించబడతాయి. పర్వదినాలు పూర్తికాగానే వాటిని నిమజ్జనం చేసి నష్టపరుస్తాము. ఇవన్నీ మన మనస్సులో ఉద్భవం చెందుతున్నవే - మనస్సులో సృష్టించుకొన్నవే.

తిరుపతిలో మందిరం ఎలా నిర్మాణమైందో చూడండి. అక్కడ ఒక సాధువు తపస్సు చేస్తూండేవాడు. ఆ తపస్సు ఫలితంగా అక్కడికి వెళ్ళిన వారికల్లా ప్రశాంతత అనుభూతమయ్యేది. ఆ వెళ్ళిన వారి మనసులో ఊహించుకుని వెళ్ళిన కామితాలు - కోర్కెలు నెరవేరసాగాయి. క్రమంగా ప్రజల మనసులో అక్కడొక మందిరం నిర్మాణం చేయాలనే తలంపు కలిగింది. ఆ నిర్మాణం ఎంత పెద్దదిగా తయారైందో - అక్కడి శక్తి అంతా అలా సన్నగిల్లి పోయింది. కేవలం నిర్మాణమే మిగిలిపోయింది. అందుకనే బాబూజీ అంటూ ఉండేవారు, "నేను అభ్యాసీల ఇల్లిల్లూ ఆశ్రమం కావాలనుకుంటున్నాను. అందుచేతనే ఆశ్రమం ప్రత్యేకంగా నిర్మించాలనుకోవడం లేదు. ఇంటింటా శాంతి, ఆనందం నెలకొంటాయి అప్పుడే" అని.

ఒక సాధువు ధ్యానం చేస్తున్నాడనుకోండి. అతను మన మనసులో చోటు చేసుకుంటాడు. మనం అతనిపై లగ్నమవుతాం. మనం ధ్యానంలో కూర్చుంటాము. ఒకానొక రోజున అతడే మన

ఆలంబనగా మారి ఇంటింటా అతని ఆశ్రమమే అవుతుంది తప్పకుండా.

బాబూజీ ఎంతో బాగా చెపుతుండేవారు. ఈ జీవితం ఏమిటి? ప్రతి వస్తువు మీదా మనకు ఆకర్షణ కలుగుతుంది. వాతావరణం – అనగా పరిసరాలు మనల్ని ప్రభావితం చేస్తాయి. సుఖదుఃఖాల అనుభవం కలిగిస్తాయి. కానీ వీటన్నిటినీ తొలగించు కొనిపోతే ఆనందమే ఆనందం.

భారతదేశం ముసల్మానులకు, ఆంగ్లేయులకు బానిసత్వం చేసింది. అలాగే ఎవరైనా సాధువు సమక్షంలోకి వెళ్ళినప్పుడు కూడా బానిస భావంతోనే మ్రొక్కడానికి వెళ్తారేకాని భక్తి భావంతోకాదు. కాసులు చెల్లిస్తే తృప్తి కలుగుతుందని అలా చేస్తారు. అతడు అలాగే ధనార్జనకు అలవాటుపడతాడు. కాని శ్రద్ధాభావంతో అంటే భక్తిభావంతో వెళ్ళరు. భక్తి కలిగీ ఉండరు. కాని భక్తి భావానికి ఉన్న విలువ అతీతమైనది. నేను బాబూజీ ఆశ్రమానికి నాల్గణాలు ఇచ్చాను. అప్పుడు బాబూజీ అన్నారు, “ఈ నాల్గణాలు నా చేతిని స్పర్శించవు. కాని నీవిచ్చిన వాటితో ఆశ్రమం నిర్మాణమవుతుంది. ఎందుకంటే వాటి వెనుక ఉన్న భక్తిభావం చాలా విలువైనది. కనుక సమర్పించే వారి గుణం గొప్పది. సమర్పించిన వస్తువుకంటే అందులోని ప్రేమనే భగవంతుడు స్వీకరిస్తాడు. కాని ఆయనకు ఏమి లోటు ఉంది కనుక! ఆయన అందర్నీ ప్రేమిస్తాడు. కాని మనం ఆయన్ని ప్రేమించడం మరచిపోయాం.

రియాలిటీ అంటే అసలైన 'సత్యం' ఒకటి ఉన్నది. దానిని మనం నిర్లక్ష్యం చేస్తున్నాము. రామాయణం, భగవద్గీత చదువుతున్నాం. వాటిని మననం చేసుకుంటున్నాము. భగవద్గీతలో కృష్ణుడు వివరించాడు. బాబూజీ చెప్పారు –"నేను ధ్యానంలో స్థితప్రజ్ఞత స్థితిని కలిగిస్తాను. ఆధ్యాత్మికతా బీజం నేను మొదటి సిట్టింగ్ యొక్క ట్రాన్స్‌మిషన్‌లోనే ఇస్తాను" అని. కనుక మనం మనలోనే ఉన్న దైవం (దివ్యకాంతి)ని గుర్తించలేక అనగా రియాలిటీని గుర్తించలేక ఎక్కడో వెదకటానికి ప్రయత్నిస్తున్నాము. మనలో ఏ కండిషన్ కలుగుతుందో దానిలోనే లగ్నమై ఉండటమే స్థితప్రజ్ఞ స్థితి అవుతుంది. అపుడు ఆ కండిషన్ యొక్క ఆనందాన్ని అనుభవిస్తాము. బాబూజీ అందుకే చెప్పారు ఏ కండిషన్‌లో ఏ అనుభూతి కలుగుతుందో దినమంతా దాని స్మరణలోనే ఉండమన్నారు. ధ్యానంలోనే మనసు నిమగ్నం చేయలేనపుడు మనమింక ధ్యానం చేస్తున్నది ఎందుకు? మన ధ్యానం అంతా ఆలోచనల మీద ఆధారపడి ఉంటోంది. అలోచనలు వస్తే ధ్యానం జరగదు. అందుకని వాటితో ముడిపడవద్దు. బాబూజీ అందుకే చెప్పారు "నేను బీజం వేశాను" అని. బీజం వేశానంటే డివైన్ (దైవం) అక్కడే ఉంది. దైవం ఉంది అంటే కాంతి అక్కడ ఉంది. పవిత్రత ఉంది. అందుకని మనం, మనలోనే ఉన్న వాటిమీద మాత్రమే మన ఆలోచనలను కేంద్రీకరించాలి. అవి మనలోనే ఉన్నాయి అని మనమే అనుకోవాలి. దానితోపాటు బాబూజీ మహరాజ్ మనకు ఇచ్చారు, 'వారి' ట్రాన్స్‌మిషన్ మనకు ప్రసారమవుతోంది. హృదయం వారికే

అర్పించాం అనుకుంటూ ఉండాలి. బాబూజీ చెప్పారు తాను వారం రోజుల్లోనే స్థితప్రజ్ఞ స్థితిని సాధించానని. కాని మనం బాబూజీ మహరాజ్ ఇచ్చిన ఆ స్థిరత్వాన్ని నిలబెట్టుకోకపోతే ఎలా! దైవంపట్ల అనగా బాబూజీ ప్రేమతో మనకు దివ్యధార లభిస్తుంది. ధ్యానం వేరు, ఆలోచనలు వేరు. ధ్యానంలోనే లగ్నం కావటం అంటే మనలో ఉన్న దివ్యత్వం, దివ్యకాంతి మీదనే దృష్టి ఉంచి కలిగిన స్థితులలో ఎంత ఎక్కువసేపు ధ్యానంలో కూర్చుండగలిగితే అంత మంచిది. ఆలోచనలను నిర్లక్ష్యం చేయమని బాబూజీ పదే పదే చెప్పారు. ఆలోచనలు వస్తే ధ్యానం జరగలేదని, అవి రాకుంటే ధ్యానం బాగా జరిగిందనుకోవటం కరెక్టు కాదు. మనకు ధ్యానంలో బాబూజీ కనిపించి దివ్యధార వస్తున్నట్లయితే మనకు ధ్యానం బాగా జరిగినట్లు అనుకోవాలి.

బాబూజీ పాండవుల ఉదాహరణ చెప్పారు. పాండవులు శ్రీకృష్ణుని భక్తులు మాత్రమే కాదు. ఒక విధంగా చెప్పాలంటే కృష్ణుడే పాండవుల భక్తుడు. అర్జునుడు భక్తుడు కాదు. అనగా అంతకుమించి శ్రీకృష్ణుని శక్తిమీద అతను ఆధారభూతుడయ్యాడు. భక్తి అనగానే స్వరూపం వస్తుంది. స్వరూపం కంటే శక్తి గొప్పది. అందుచేత అర్జునుడు యుద్ధంలో జయించినా, ద్రౌపది మాన సంరక్షణ పొందినా, వారు ఆరాధించి, ఆధారపడి పొందినదంతా కృష్ణశక్తివల్లనే. అంతేకాని కృష్ణుని మానవరూపం మీదగాదు. అలాగే మనం ధ్యానం చేయటానికి ఉపక్రమించగానే బాబూజీ రూప దర్శనం కలిగి వెంటనే వారి శక్తి ప్రవాహం వస్తుంది. అందుకనే బాబూజీ చెప్పారు, ప్రతిరూపంలోను దైవం ఉన్నాడని.

దివ్యత్వం, దివ్య ప్రకాశం ఉందనుకుంటే మనలో ప్రకాశం వస్తుందని, అది అణువణువునా వ్యాపిస్తుందని అనుభూతి చెందుతాము. దైవం అనగానే ఆ ప్రకాశం వ్యాపిస్తుంది. ఆ ప్రకాశం అణువణువునా సర్వత్రా వ్యాపించి ఉంటుంది. అందుకని మనం ధ్యానంలో స్థిరత్వం సాధించటానికే ప్రయత్నించాలి. బాబూజీని ఒకరు అడిగారు, "మీకు లాలాజీ సాహెబ్ ఎప్పుడైనా జ్ఞాపకం వస్తారా" అని. బాబూజీ దానికి సమాధానంగా, "వారు ఎప్పుడూ ఉన్నారు, జ్ఞాపకం రావటం ఏమిటి? నీ భావంలో అది వారి స్వరూపం. స్వరూపం ముఖ్యం కాదు" అన్నారు. మీకు మీ స్వరూపం ఉంది. కాని అద్దంలో చూసుకున్నపుడే మీకు అది కనిపిస్తుంది. అప్పటిదాకా దాని ధ్యాస ఉండదు. ధ్యానం మీద అభ్యాసం చేయాలి. నేను మీలాగే అభ్యాసం చేశాను.

బాబూజీ ప్రిసెప్టర్స్ (ప్రశిక్షకులు)కు శిక్షణ ఇచ్చే సందర్భంలో చెప్పేవారు, "మీరు అభ్యాసులకు అది ఇచ్చాను, ఇదిచ్చాను అనుకుంటారు. అది నిజం కాదు. మీరు ఇచ్చామనుకునేది అంతా దైవం (డివైన్) నుంచి వస్తున్నదే. అది లేకుండా మీరేమీ ఇవ్వలేరు" అని.

ఒకసారి వరదాచారిగారు నన్ను అడిగారు, "మీరు చిత్రపటం (Photo) నుంచి ఎప్పుడైనా ట్రాన్స్‌మిషన్ ఇచ్చారా?" అని. అందుకు నేను ఇచ్చానన్నాను. "అప్పుడు మీకు ఏమి అనిపించింది" అని అడిగారు వరదాచారిగారు. నేను అపుడు అన్నాను, రేఖయే మీకు 'చిత్రం' అనిపించవచ్చు. దానికి వారు

విస్తుపోయారు. వారి దృష్టిలో చిత్రం అనగా రూపం, రంగులు ఇత్యాదులు. కాని బాబూజీ మహరాజ్ ఏది వ్రాసినా అర్థయుక్తంగా వ్రాశారు. చిత్రపటం 'వెదికితే' కనిపించేది కాదు. అది "డెవలప్" కావాలి (ఎదగాలి). హఠయోగం జటిలమైనది కనుకనే బాబూజీ దానిని సరళమైన విధానంగా సహజమార్గం ప్రవేశపెట్టారు. హఠయోగం అనేది బలీయంగా మళ్ళీ మళ్ళీ గుర్తు చేసుకునేది. హఠం అంటే పట్టుదల, స్వభావసిద్ధం కాదు. కాని సహజమార్గం సరళమైనది. రాజయోగం అనగా మనకు రాజువంటి దైవంతోనే అనుసంధానం కావించునది. సహజమార్గం ఒక సహజధార. దాని నుంచి మనకు శక్తి లభిస్తుంది. దానినిబట్టి మనం (రియలైజేషన్) సాక్షాత్కారం పొందుతాం. ఇదీ విధానం.

బాబూజీ చెప్పారు మనం అందరం హిందువులమేనని. ఎందుకంటే హిందువులో, క్రిస్టియన్‌లో, ముసల్మానులో, మరే మతం అయినా సరే అందరిలోనూ దైవం ఉన్నాడు. మసీదులో ప్రార్థన చేస్తారు. మందిరంలో విగ్రహారాధన చేస్తారు. చర్చిలో క్రొవ్వొత్తి దీపం వెలిగించి చేస్తారు. అందరిలోనూ దైవం ఉన్నాడని హిందువులం చెబుతున్నాం కనుక, దైవం ఉన్న అన్ని జాతులు, మతాలవారు హిందువులే అన్నారు. దేశం, ప్రాంతం, మతం, కులం, పెద్ద, చిన్న, ధనిక, బీద అనే వేరు భావం లేకుండా అందరూ బాబూజీవద్ద ఏక భావంతోనే మెలిగేవారు. వివక్షత లేకుండా అందరికీ సమానంగా శక్తి ప్రసారం చేస్తారు. అభ్యాసులు కొంతమంది, సీనియర్, జూనీయర్ అని భావిస్తారు. దానికి కూడా వారు అవకాశం ఇచ్చేవారు కాదు. సిన్సియర్ అభ్యాసి

(క్రమబద్ధమైన అభ్యాసీ) అంటే ఎవరు? ఎవరైతే వారితో ఎడతెగని సంబంధం కలిగి ఉంటారో వారు క్రమబద్ధులు. సీనియర్ అభ్యాసీ అంటే, ఎవరిని చూస్తే వారిలో మీకు బాబూజీ ఉన్నట్లనిపిస్తుందో వారు. సహజమార్గంలో కొందరు ముందు ప్రయాణిస్తే మరికొందరు వెనుక ఉంటారు. అంతే కాని సీనియర్, జూనియర్ అనుదానికి ప్రాముఖ్యత లేదు.

సాధారణంగా ఒక సందేహం వస్తుంది. ఒకసారి హృదయంలో దివ్యత్వం మీద, ఒకసారి దివ్యకాంతి మీద, మరోసారి బాబూజీ మీద మనసు నిలపాలంటారు, వీటిలో దేని మీద ధ్యానం ఉంచాలి అని. దీనికి సమాధానం ఆత్మ సాక్షాత్కారం (పరిష్కారం) ఏమంటే, వీటిలో దేని మీద ధ్యానం ఉంచినా ఆత్మ సాక్షాత్కారం అనే గమ్యాన్ని సాధించటానికే.

**ప్రశ్న: క్లీనింగ్ యొక్క అవుసరం ఏమిటి?**

**జవాబు:** మనస్సును ప్రక్షాళనం చేసుకొనకపోతే అది ధ్యానం మీద లగ్నం కాదు. క్లీనింగ్ వలన సంస్కారాలన్నీ బాబూజీ కృపతో తొలగిపోయి హృదయం, మనస్సు నిర్మలమవుతాయి. ఇంటిని శుభ్రపరచటానికి చీపురు ఎలా అవుసరమో మన హృదయాన్ని నిర్మాలిన్యం చేసుకోవాలంటే క్లీనింగ్ అవుసరం. దీనికి గాను బాబూజీని స్మరించి, వారి శక్తి ఆ మాలిన్యాలన్నిటినీ తొలగిస్తోంది అనుకుంటూ ఉంటే, నిర్మలీకరణ జరిగి పవిత్రత చేకూరుతుంది. సహజమార్గంలోని నియమాలు అన్నీ పవిత్రత చేకూర్చుకొని దైవాన్ని నిరంతరం స్మరించటానికే. అలాంటి స్మరణ ఒకవేళ దినచర్యలో లోపించితే, నీ దినచర్య అంతా 'వారి' కొరకే చేసినట్లు

నీ క్లీనింగ్ సమయంలో స్మరించుకుంటే పవిత్రత చేకూరుతుంది. మనస్సుకు అంతరంగంలోని దివ్యత్వంతో సంబంధం ఏర్పడితే ఇంక క్లీనింగ్‌తో గాని, ధ్యానంతో గాని అవుసరం ఉండదు. ఉదాహరణ చెప్పాలంటే, చిన్నపిల్లల పుస్తకాలలో ప్రార్థన ఉంటుంది. పెద్ద తరగతుల పుస్తకాలలో అది ఉండదు. అలాగే అభ్యాసీలకు ప్రాధమిక దశలో ప్రార్థన, ధ్యానం, క్లీనింగ్ అన్నీ అవుసరమవుతాయి. హృదయం దివ్యత్వంతో అనుసంధానం అయ్యాక వాటి అవుసరం ఉండదు.

**ప్రశ్న: క్లీనింగ్ అంటే శారీరక రుగ్మతలు కూడా తొలగిపోతాయా?**

**జవాబు:** క్లీనింగ్ అనునది భౌతికంగా కాదు. అనగా శరీరానికి సంబంధించినది కాదు. ఆంతరికమైనది. నీవు బాగానే ఉన్నావు. నీకు ఎందుకీ అనుమానం. ఈ క్లీనింగ్ అంటే శరీరానికి స్నానం చేయటం వంటిది కాదు. రోగాలను దూరం చేసేదికాదు. అలాగైతే డాక్టర్లంతా ఆర్జన లేక అలమటించవలసిందే. కాని ఒక విధంగా శారీరక అస్వస్థత ఉన్నవారు, బాబూజీకి ప్రార్థనలో తమ బాధ చెప్పుకుని దాన్ని పరిహరించమని కోరుకుంటే 'వారు' తమ అనుగ్రహంతో నివారణ చేయవచ్చు. బాబూజీ మన రక్షకుడు అన్నారు గదాయని ఒక అభ్యాసీ, గస్తీదారుడు రాత్రిళ్ళు బాబూజీని, రక్షణ భారం మీదే అని ప్రార్థన చేసి నిద్రించేవాడట. ఇటువంటిది విపరీతార్థంగా అనిపిస్తుంది. ఇంకా విపరీతార్థానికి సంబంధించిన సంఘటన ఏమంటే ఒక అభ్యాసీ తాళం చెవులు, టార్చిలైటు అన్నీ బల్లమీద పెట్టి, వాటితోపాటు ఒక ఉత్తరం కూడా పెట్టేవాడట. అందులో దొంగతనానికి ఎవరైనా వస్తే నీకు

కావలసినవి తీసుకుపో కాని తనకు నిద్రాభంగం కలిగించవద్దని వ్రాశాడట. రాత్రిళ్ళు బాబూజీని పహరాదారుడుగా భావించే వారికంటే ఇతను కొంత మేలు. సహజమార్గ విధానాన్ని సరిగా అర్థం చేసుకోని వారి విషయంలో, దాని అసలు ధ్యేయాన్ని గ్రహించని వారి విషయంలో ఇలా జరగుతూ ఉంటుంది.

**ప్రశ్న: ఒక డివైన్ పర్సనాలిటీని, దివ్య వ్యక్తిని గుర్తించాలంటే ఎలా?**

**జవాబు:** మనం ఎవరిముందైతే కూర్చొని ధ్యానం చేస్తున్నప్పుడు మన అస్తిత్వాన్ని మరచిపోతూ ఉండటం ప్రారంభమవుతుందో అటువంటి వ్యక్తిని దివ్యవ్యక్తిగా తలంచవచ్చు. బాబూజీని డివైన్ పర్సనాలిటీ అంటున్నాము కాని ఆ పదం వారి ఔన్నత్యానికి ఇంకా సరియైనది కాదనే నా భావన. 'వారి' సామర్థ్యానికి అది చాలా తేలికైన పదం.

ఒక సందర్భంలో బాబూజీవద్ద అభ్యాసులు సమావేశమై ఉన్నారు. కుమారస్వామిగారు, మాస్టర్ ఈశ్వర్‌సహాయ్‌గారు, మరికొందరు అభ్యాసులు ఉండగా బాబూజీ కుమారస్వామిగారిని (ఆధ్యాత్మికంగా) పొగడుతున్నారు. అది విన్న అభ్యాసీ ఒకరు తాను ఐదువేల రూపాయలు ఇస్తూ స్వీకరించమన్నాడు. బాబూజీ ఈశ్వరసహాయ్‌గారిని ఉద్దేశించి దానిని తీసుకోమన్నారు. బాబూజీ తనను ప్రస్తావించకుండా ఇంకా కుమారస్వామినే పొగడటం చూసి ఈశ్వరసహాయ్‌గారితో, తాను ఐదువేల రూపాయలు ఇచ్చినా తన గురించి బాబూజీ ఏమీ చెప్పటం లేదని ఫిర్యాదు చేశాడు. అది విన్న బాబూజీ అతనితో, "కుమారస్వామిగారు

జీరో (0), నీవు (5 + 000) ఐదు ప్లస్ మూడు సున్నాలు. అనగా కుమారస్వామిగారిలో 'ఐ' నెస్ అనగా సెల్ఫ్ జీరో అనగా పూజ్యం. కాని నీలో 'ఐ' నెస్ ప్రక్కన అనగా జీరోకు ప్రక్కన 5 ఉంది. అంటే సెల్ఫ్ ఎక్కువగా ఉంది, ఆధ్యాత్మికత కంటె 'అహం' ఎక్కువ ఉంది" అన్నారు. ఇవి చాలా స్వల్ప విషయాలే అయినా, సహజమార్గంలో మన జీవన విధానాన్ని, ఆలోచనలను సరిదిద్దుకోవటానికి ఉపయోగిస్తాయని చెప్తున్నాను.

**ప్రశ్న: ఏవైనా ప్రత్యేక సందర్భాలలో బాబూజీకి ప్రసాదం నివేదించాలంటే ఏమి చేయాలి?**

**జవాబు:** అటువంటి సందర్భాలలో ప్రసాదంగా నివేదించదలచిన పదార్థాలను ఒకచోట ఉంచి, ప్రార్థన చేస్తూ, దివ్యశక్తి దానిలో సమకూరాలని కోరుకోవాలి. అప్పుడు దానిలోని ప్రతి అణువు ఆధ్యాత్మిక శక్తితో నిండి ఆరగించిన వారికి ఆధ్యాత్మిక లబ్ధి చేకూరాలని వాంఛించాలి.

**ప్రశ్న: ప్రసాదమునకు, భోగ్‌కు భేదం ఏమిటి?**

**జవాబు:** భోగ్ అనగా వినమ్రతతో ఆహార పదార్థాలను దేవతా విగ్రహాలకు నివేదించటం. ప్రసాదం అనగా దివ్యత్వాన్ని ప్రార్థన ద్వారా ఆ పదార్థాలలో సమకూర్చటం.

**ప్రశ్న: ప్రిసెప్టర్‌కు, అభ్యాసీకి గల సంబంధం ఏమిటి?**

**జవాబు:** మామూలుగా ప్రిసెప్టర్‌కు, అభ్యాసీకి మధ్య ఉంటున్నది సోదర భావమే. ధ్యానంలో కూర్చున్నపుడు అభ్యాసీ స్వంత సోదరుడుగాని, సోదరిగాని, మరే ఇతర బంధువుగాని అవవచ్చు. ఏ బాంధవ్యమూ లేనివారుగాని అవవచ్చు. ప్రిసెప్టర్‌తో భౌతిక

బాంధవ్యానికి తావుండదు. అది కేవలం ఆధ్యాత్మికమే. ప్రిసెప్టర్ ద్వారా వచ్చే ట్రాన్స్‌మిషన్ అంతా బాబూజీ నుంచి వచ్చేదే కాని ప్రిసెప్టర్‌ది కాదు. బాబూజీ ఇచ్చే దానినే ప్రిసెప్టర్ అభ్యాసీలకు ప్రసారం చేస్తాడు. ఒకవేళ అభ్యాసీకి ధ్యానంలో ఇబ్బంది కలిగితే దానిని బాబూజీకి నివేదించి పరిస్థితి మెరుగుపడటానికి సహాయపడతాడు. పుస్తకంలోని విషయాలు విధ్యార్థికి అవగాహన కానపుడు టీచర్ విశదీకరించినట్లుగా.

ప్రిసెప్టర్లు రెండు రకాలుగా ఉంటారు. ఒకరు బాబూజీ ఇచ్చే ప్రాణాహుతిని అభ్యాసికి జారీ చేస్తూ అభ్యాసీ యొక్క ప్రోగ్రెస్ గురించి ఆలోచిస్తూ ఉంటాడు. ధ్యానంలో తన వ్యక్తిత్వాన్ని మర్చిపోతాడు. బాబూజీయే అంతా ఇస్తున్నట్లు భావిస్తాడు. మరొకరు తన వ్యక్తిత్వాన్ని మర్చిపోకుండా తానే ఇస్తున్నాననే 'అహం' భావంతో ఉంటాడు. సరైన ప్రిసెప్టర్ అభ్యాసీ సాధనలోని ప్రోగ్రెస్‌ను ఆటంకపరచే ఆలోచనలను తొలగించి సానుకూలం చేస్తాడు.

బాబూజీ ప్రాణాహుతికి పవర్‌స్టేషన్ (పవర్ హౌస్) అయి ఉండగా ప్రిసెప్టర్ ఒక సబ్‌స్టేషన్ వంటివాడు. పవర్‌స్టేషన్ నుంచి వచ్చే ప్రాణాహుతినే అతడు పంపిణీ చేస్తాడు. కొంతమంది ప్రిసెప్టర్సు తమకు బాబూజీ ఏర్పాటు చేసిన నిబంధలను పాటించటం లేదు. వారి పనిలో శ్రద్ధ, ఉత్సాహమూ కొరవడి ఉంటున్నాయి. ఇది బాబూజీకి బాధాకరమైనది. ప్రిసెప్టర్ అభ్యాసులందరినీ తన స్వంత సోదర సోదరీమణుల్లాగా

అందరితోనూ భ్రాతృ భావాన్ని అలవరచుకోవాలి. ప్రిసెప్టర్ అయినా, వాలంటీర్ అయినా తమ విధి నిర్వహణలో బాబూజీ యొక్క నిరంతర స్మరణ కలిగి పనిచేస్తే, వారు చేసే పనిలో సత్ఫలితమూ, ప్రయోజనమూ ఉంటాయి. షాజహాన్‌పూర్‌లో ఒక ప్రిసెప్టర్ (ఉమాశంకర్) అభ్యాసుల నుద్దేశించి "మీరు మీకు తోచినప్పుడు వచ్చిపోతారు. కాని మేము 24 గంటలూ శ్రమించాలి" అన్నారు. బాబూజీ ఆ మాటలు విన్నారు. వెంటనే అతన్ని పిలిచి "నీవు అభ్యాసులకు సిట్టింగ్ ఇచ్చేప్పుడు మాత్రమే ప్రిసెప్టరవు. అపుడే దివ్యత్వంతో కనెక్ట్ అవుతావు. సిట్టింగ్ ఇవ్వనపుడు నీవు కూడా అభ్యాసీవే" అని హెచ్చరించారు. అభ్యాసీగా ఉన్నపుడు ప్రేమ, భక్తి, శ్రద్ధ ఉన్నట్లే ప్రిసెప్టర్ అయ్యాక కూడా వాటిని అభివృద్ధి పరచుకుంటూ ఉండాలన్నారు.

**ప్రశ్న: ధ్యానానికి ఉపక్రమించబోయే ముందు ప్రార్థనలో ఏమి నివేదించుకోవాలి?**

**జవాబు:** బాబూజీనే మన స్వామిగా భావన చేయాలి. వారికే మనల్ని మనం అర్పణ చేసుకోవాలి, కేవలం ప్రార్థనను పలుమార్లు ఉచ్చరించటమే కాదు. బాబూజీ చెప్పారు, ఎవరు ఎటువంటి వారయినా అనగా మంచివారు, చెడ్డవారు, శిష్టులు, దుష్టులు అనే భేదభావంలేకుండా ప్రాణిమాత్రులందరికీ (Submissive mood) అంకిత భావంతో ఉండటానికే వచ్చాను అని. బాబూజీ తనను ఎవరైనా దూషణ చేసినా బాధపడనన్నారు. అలాగే ఈ ప్రకృతిలో తానొక చీమనైతే తనను ఎవ్వరైనా త్రొక్కినా కుట్టి

బాధించనన్నారు. ఆ మహానుభావుని నుంచి మనం ఆ నమ్రతాభావాన్ని, సహనాన్ని అలవరచుకోవాలి. అది కష్టమే అయినా దివ్యత్వానికి అది అవసరం.

ఆధ్యాత్మికతలో భయం ఉండదు. ప్రేమ మాత్రమే ఉంటుంది. మనుషులందరూ రకరకాలుగా ఉంటారు. అయినా అందరికీ అందరితోనూ సంబంధం ఉంటుంది.

**ప్రశ్న: మనసులో వ్యాకుల్యత (టెన్షన్) ఉన్నపుడు ఏమి చేయాలి?**

**జవాబు:** అలా అనిపిస్తున్నపుడు ప్రార్థన చేసుకుంటే ఫలితం ఉంటుంది. ఆఫీసుకు వెళ్ళబోయే ముందు ప్రార్థన చేసుకోవచ్చు. ఆఫీసు పనిలో ఉన్నపుడు ఏదైనా టెన్షన్ అనిపించినా, అంతా బాబూజీయే చేయిస్తున్నట్లు, **వారే** చేస్తూ ఉన్నట్లు భావించుకుంటూ **వారి** నగుమోమును మనసులో స్మరించుకుంటే అంతా సానుకూలమవుతుంది.

రియాలిటీ కండిషన్‌కు చేరినపుడు మన నోటి నుంచి ఏది వెలువడినా అది సత్యమే అవుతుంది. మనం అబద్ధం మాట్లాడుతున్నామనుకున్నా అందులో సత్యమే ఉంటుంది. అక్కడ సత్యానికే కాని మరోదానికి తావుండదు.

మనసు అలసిపోతే శరీరం అలసిపోయినట్లు ఉంటుంది. మనసులో అలుపు అనే భావం కలుగకపోతే శరీరంలో కూడా అలుపు రాదు. కనుక మనసే ప్రధానమవుతుంది. వయస్సు మళ్ళింది. పని చేయలేమనుకుంటారు. అలా అనుకోకుండా పని చేయాలనుకుంటే చేయగలుగుతారు.

సాక్షాత్కారం కలిగిన కండిషన్‌లో డివైన్ అన్నా, దివ్యత్వం అన్నా, దివ్యకాంతి అన్నా, బాబూజీ అన్నా, అన్నీ తనకే చెందినట్లనిపిస్తుంది. ఏ పని అయినా చేయగలుగుతారు. అక్కడ ఆ శక్తి ఉంటుంది. ఆ కండిషన్ దాటిన తార్వాత ఆలోచన కార్యరూపం ధరించటంలో అంత వేగం ఉండదు.

బాబూజీ చెప్తూ ఉండేవారు – మనం వీలైనంతవరకు పూజగదిలోనే కూర్చుని ఉండాలి. అక్కడి వాతావరణంలో శక్తి నిండి ఉంటుంది. బయటకు వచ్చి కూర్చుంటే ఎవరో ఒకరు వస్తూ ఉంటారు. వారు అడిగినదల్లా ఇవ్వవలసి ఉంటుంది. శక్తి తరిగిపోతూ ఉంటుంది. ఒక్కోసారి వచ్చిన వ్యక్తి అనర్హుడైతే ఇచ్చిన శక్తి అతను భరించలేకపోవచ్చు. దానివలన శరీరానికి ఉపద్రవం కలుగకపోవచ్చుగాని అతని ఆధ్యాత్మిక స్థితిని భరించలేనందువలన భంగం కలుగవచ్చు. అంతేకాదు, మనమీద అంటే మన శక్తి మీద మనకు నియంత్రణ (కంట్రోల్) ఉండదు.

**ప్రశ్న: మనం ఏదైనా తప్పు చేసినపుడు అల్టిమేట్ (అంతిమం) ఏదైనా శిక్ష వేస్తుందా?**

**జవాబు:** అల్టిమేట్ శిక్ష వేయదు. అలాగే అనుగ్రహించదు కూడా. ప్రకృతి కూడా శిక్షించదు. కాని తప్పు చేసిన వాని స్వభావమే (నేచర్) అతణ్ణి శిక్షిస్తుంది. మన ఆ స్వభావమే మేలు కూర్చవచ్చు.

**ప్రశ్న: ఇతరుల ఆత్మ గురించి ప్రార్థన చేయవచ్చునా?**

**జవాబు:** జీవించి ఉండగా ఆత్మ ఎటువంటి స్వభావం కలిగి ఉన్నా, చనిపోయాక ఆ ఆత్మ ఇక్కడి మంచి చెడులతో నిమిత్తం

లేకుండా, మంచి జరగాలని, పునర్జన్మ ఉండకూడదని మనం ప్రార్థించవచ్చు. ఎందుకంటే ఆత్మ అందరికీ సంబంధితమై ఉంటుంది. మరణించాక ఆ ఆత్మను శిక్షించాలని గాని, కీడు కలగాలనిగాని మనం కోరినా అది జరగని పని.

ఆధ్యాత్మిక గ్రంథాలు చదివినంతమాత్రాన ఋషులు కాలేరు. సాధన (అభ్యాసం) వల్లనే అది సాధ్యమౌతుంది.

**ప్రశ్న: భండారాలో అనుగ్రహం లభిస్తుందా?**

**జవాబు:** కొండలమీద, దూరతీరాల్లో ఉన్న మందిరాలకు వెళ్ళేపుడు మనకు దైవచింతన ఉంటుంది. తిరిగి రాగానే అది పోతుంది. బాబూజీ షాజహాన్‌పూర్‌లోనే ఉన్నారు. అక్కడికి వెళ్తేనే మనకు వారి కృప, అనుగ్రహం కలుగుతుంది; ఫలితం ఉంటుంది అనుకోకూడదు. వారు మనలోనే ఉన్నారు, మన వెంటే ఉన్నారు, అనుకుంటే ఎక్కడున్నా వారి అనుగ్రహం లభిస్తుంది. పవిత్ర ప్రదేశాలకు వెళ్ళేపుడు ప్రయాణంలో దైవ చర్చ ఉండాలే కాని, ఏ స్టేషన్‌లో ఏమి తినుబండారాలు దొరుకుతాయో, ఏమి తినాలి అనే ఆలోచనలు ఉండకూడదు. మన ప్రయాణంలో పవిత్రార్థం పోయి, పిక్‌నిక్‌గా మారుతుంది.

ఈ మధ్య టి.వి.ల్లో యోగ ప్రోగ్రాములు వస్తున్నాయి. ఆ తర్వాత పిల్లల నాటికలు లాంటివి వచ్చి వాటి ద్వారా సందేశమిప్పిస్తారు. అంతమాత్రాన కృప, దైవానుగ్రహం ప్రసారం కాదు, స్వయంసాధన ద్వారానే సాధ్యమవుతుంది.

సాధన ద్వారా మోక్షం లభిస్తుంది. కాని మళ్ళీ కొంతకాలం తర్వాత, అనగా వంద సంవత్సరాలు కావచ్చు, రెండు వందల సంవత్సరాలు కావచ్చు, మళ్ళీ జన్మించి, ముక్తి కొరకు సాధన చేయాల్సి ఉంటుంది. పతంజలి కూడా యోగం ద్వారా మోక్షం సాధించాడు. కాని ముక్తి కొరకు మళ్ళీ జన్మించక తప్పలేదు. కనుక మోక్షస్థితితో ముగించకుండా ముక్తి కొరకు పరిపూర్ణ సాధన చేయవలసి ఉంటుంది.

లివింగ్ మాస్టర్ అంటే, మనం మొదట్లో మాస్టర్ మనలోనే ఉన్నారని అనుకుంటూ ధ్యానం చేస్తాం. ధ్యానంలో పురోగతి చెందుతూ మనల్ని మరచిపోతూ, మనమే మాస్టర్‌లో ఉన్నామనుకుంటాము. ఇది ఒక విధంగా లయావస్థ. అనగా లివ్ ఇన్ మాస్టర్. అంటే మాస్టర్‌లో మనం జీవించి ఉండుట అని అర్థం. నిజం చెప్పాలంటే, లివింగ్ మాస్టర్ అనే దానికి అర్థం లేదు. ఎందుకంటే శరీరానికి నశింపు ఉంది. శాశ్వతత్వం లేదు. శాశ్వతమైనది దివ్యత్వం. అందులో మనం ఉండటమే లివ్ ఇన్ మాస్టర్ అవుతుంది. మనం పూర్వజన్మ, ఈ జన్మ అనుకుంటూ ఉంటాము. అనగా గతజన్మలో ఉండి, ఈ జన్మలోనూ ఉన్నామంటే పాత శరీరం పోయి, మళ్ళీ శరీరం దాల్చామేకాని మనం పోలేదన్న మాట. మనం పోనపుడు అనగా మనకు మరణం లేనపుడు మాస్టర్‌కు మాత్రం మరణం ఎందుకు ఉంటుంది.

గతంలో మనం ఏమిటి అనే ఆలోచన అనవసరం. ప్రస్తుతం మనం సహజమార్గంలో ప్రవేశించి సాధన ఎంతవరకు చేస్తున్నాము, మన ప్రోగ్రెస్ ఎలా ఉన్నది, ఎలా ప్రోగ్రెస్ కావాలి, లక్ష్యం ఎలా సాధించాలన్నదే మన ఆలోచనగా ఉండాలి. బాబూజీ అభ్యాసీ యొక్క గతాన్ని లక్ష్యపెట్టేవారు కాదు. సాధన కొద్దీ (ప్రోగ్రెస్) పురోగతినే అనుగ్రహిస్తారు.

**ప్రశ్న: ఇంటర్ కమ్యూనికేషన్ ఏమిటి?**

**జవాబు:** అది ఏదో కండిషన్. అనగా స్థితి కలిగినపుడు వచ్చేది కాదు. అవుసరం కొద్దీ వస్తుంది. ఇది సామాన్యులకు సాధ్యమయ్యేది కాదు. ఇది అనంతం నుంచి భూమి మీద అవతరించిన దివ్య వ్యక్తులకు ప్రసారమయ్యే సందేశం.

పిల్లలకు చిత్రాల ద్వారా మాటలు నేర్పినట్లే మాస్టర్ నాకు, నెగేషన్, పార్షద్, మహాపార్షద్ వంటి వాటిని చిత్రపటం ద్వారానే గుర్తించగలిగేటట్లు చేశారు. మాస్టరే నాకు నేర్పుతున్నారు. నాచేత వ్రాయిస్తున్నారు. అర్థం చేసుకొనేటట్లు చేస్తున్నారు. నాకు ఇంగ్లీషు రాకపోయినప్పటికి 'వారు' ఇచ్చిన శక్తివల్లనే అర్థం చేసుకొనగలను, మాట్లాడగలను. అవుసరమనుకున్నపుడు 'వారు' నాకు ఆ జ్ఞానాన్ని ఇస్తారు.

**ప్రశ్న: అభ్యాసీలపై గ్రహాల ప్రభావం ఎలా ఉంటుంది?**

**జవాబు:** నీవు కోరితే గ్రహాలు ఉంటాయి. నేను కోరితే గ్రహాలు తొలగిపోతాయి. పండితులు ఫలానా ఫలానా రత్నం ధరిస్తే మేలు కలుగుతుందని, గ్రహ ప్రభావం తగ్గుతుందని చెప్తారు. నేటి

సమాజంలో రాళ్ళ మీద మోజు పెరిగి మొత్తం రాళ్ళే సృష్టించబడు తున్నాయి. బాబూజీ చెప్పారు మానవుడి విశ్వాసం క్రమంగా సన్నగిలి శిలగా మారిపోతున్నదని.

**ప్రశ్న: వాస్తు విషయాలను ఏమంటారు.**

**జవాబు:** వీటన్నిటినీ దృష్టిలో పెట్టుకొని స్వయం ఆలోచనా శక్తిని నశింపు చేసుకోవటమే. దైవంపై ఆధారపడే భావాన్ని (డిపెండెన్సి) అలవరుచుకోవటమే అత్యంతావశ్యకం.

సహజమార్గం అనగా ఆధ్యాత్మిక సాధనా పద్ధతే కాకుండా ఒక విధమైన సహజసిద్ధమైన, సరళమైన జీవనవిధానం కూడా (A way of living). ఆధ్యాత్మికపరంగా ప్రార్థన, ధ్యానమూ, ఆనందానుభూతి ఉంటాయి. ప్రాపంచికంగా జీవన సరళిలో, సరళత్వం, నిజాయితీ, సహజత్వం, స్వాభావికతతోపాటు కృత్రిమత్వం లేకుండా మెలగాలి. చంటి పిల్లవాడు కావలసిన దానిని కోరతాడు, బాధ కలిగితే రోదిస్తాడు, ఆనందం కలిగితే నవ్వుతాడు, కేరింతలు కొడతాడు. అనగా భావనలో సహజత్వమే కాని దాపరికముండదు, సంకోచముండదు. బాబూజీ సహజమార్గ విధానంలో మనం అంతిమం చేరటానికి ధ్యానం, నిరంతర దివ్య స్మరణతోపాటు సహజసిద్ధమైన జీవనవిధానాన్ని కూడా ప్రాతిపదికగా చేశారు. సరళమైన జీవితానికి మనం బాబూజీని ఆదర్శంగా తీసుకోవాలి. ఆధ్యాత్మికత బాబూజీ మనకిచ్చిన వరదానం అనగా ఆశీస్సు. దానిని సాఫల్యం చేసుకోవటానికి మనం బాబూజీ ప్రవర్తనాసరళిని అనుసరించాలి. అనగా

అందరినీ ప్రేమించాలి, సమభావంతో చూడాలి, సదుద్దేశ్యంతో అర్థం చేసుకోవాలి. ఇతరులకు సహాయం చేయాలి, ద్వేషకావేశాలు తగవు.

**లోపాలు-నిరసన:**

బాబూజీ ఎప్పుడూ ఎవరినీ నిరసించేవారు కాదు, విమర్శించేవారు కాదు, లోపాలను ఎత్తి చూపేవారు కాదు. అభ్యాసీలో ఆధ్యాత్మికప్రగతి తక్కువ ఉందని కానీ, లేదని కానీ, గ్రాస్‌నెస్ అనగా సంస్కారాలు ఎక్కువయ్యాయనిగానీ, దోషాలున్నాయని గానీ వేలెత్తి చూపేవారు కాదు. అందుకని **వారి** పరిపూర్ణ ఆశీస్సును మనం సఫలీకృతం చేసుకోవాలంటే 'వారు' ఆచరణాత్మకంగా చూపిన ఈ సద్గుణాలను మనం అనుసరించాలి. ఇతరులను మంచి దృక్పథంతోనే గానీ వ్యతిరేక తలంపుతో అంచనా వేయకూడదు. మనలో, చెడు దృక్పథంతో గానీ వ్యతిరేకతలంపుతోగానీ అంచనా వేయకూడదు. మనలో, చెడు దృక్పథంతో ఆలోచించే మనస్తత్వం ఏర్పడితే కొంతకాలానికి మనం కూడా చెడ్డవాళ్ళమే అవుతాం. అందుచేత మనం సదాలోచన మాత్రమే కలిగి ఉండాలి.

నా ఆధ్యాత్మిక జీవితంలో గత ఏబది సంవత్సరాల అనుభవంలో నాలోని లోపాలు నాకు తెలుసు. ఈ ఏబది సంవత్సరాల సాన్నిధ్యంలో బాబూజీ ఎప్పుడూ నాలో ఫలానా లోపం ఉందనిగానీ, ఫలానా కండీషన్ పొందలేకపోయాననిగాని అనలేదు. 'వారు' పరమశక్తికి అధికారి. 'వారి' కరుణామయ

దృష్టితో, మనలో దోషాలు వాటంతట అవే తొలగిపోతాయి. మనం సహజమార్గాన్ని సరిగా అవలంబించాలి. అలా ఆవలంబించకుండా, ఎంతో కాలంగా సాధన చేస్తున్నప్పటికీ మనలో ప్రగతి కనిపించటంలేదని అనుకోవటం తగదు. సక్రమమైన సాధనవలన, ధ్యానంలో పొందే ట్రాన్స్‌మిషన్ ద్వారా మనలో స్వచ్ఛత, పవిత్రత, పరమార్థం లభిస్తాయి. కొంతమంది ప్రిసెప్టర్స్ గురించిగాని, అభ్యాసీల గురించి గాని ఏమీ ఫలితం కనిపించటం లేదని వాపోవచ్చు. బాబూజీ దృష్టి సోకితే అన్ని దోషాలు హరించుకుపోతాయి. 'వారు' ఒక వ్యక్తి వంక నిశితంగా చూస్తున్నారంటే, అతని భౌతిక శరీరాన్ని కాదు, ఆంతిరిక స్థితిని మాత్రమే. దానినిబట్టి అభ్యాసీకి ఏమి ఇవ్వాలో దానిని అనుగ్రహిస్తారు.

అభ్యాసీలు సిట్టింగ్ తీసుకున్న తరువాత దైవ ధ్యానం పూర్తయిపోయిందని అనుకుంటారు. ఆ తర్వాత దైనందిన జీవిత వ్యాపకాల్లో నిమగ్నమైపోతారు. అందుచేత ధ్యానం ముగిసింది అనే భావం తప్పు అనీ, ధ్యానానికి నిర్ణీత సమయం మాత్రమే ముగిసింది అనీ భావించాలి. అభ్యాసీ దినమంతా కూడా బాబూజీ స్మరణలోను, ఏ పని చేస్తున్నా మెడిటేషన్‌మూడ్‌లోనూ ఉండాలి. బాబూజీ అందరినీ ఎలా ప్రేమిస్తున్నారో పుస్తకాలు చదివి అర్థం చేసుకోవాలి.

దైవాన్ని గురించిన నిరంతర స్మరణ ఉండాలి. మనం ఆర్జించిన ధనాన్ని బ్యాంకులో జమచేసుకొన్నట్లే ధ్యానంలో మనం పొందినదానిని హృదయంలో నిలుపుకోవాలి.

**ప్రశ్న: మనకు కోపం ఎందుకు వస్తుంది?**

**జవాబు:** మనం బాగా ఆలోచిస్తే, మనం తలంచిన పని తలచిన విధంగా జరగనప్పుడు కోపం వస్తుంది. ఆవేశపడతాం. పండో, రొట్టెయో అడుగుతాం, పెట్టరు, పెట్టలేదని కోపం వస్తుంది. ఏ విషయంవలన మనకు కోపం వస్తుందో ఆలోచించాలి. దానికి పరిష్కారం ఆలోచించాలి. పరిష్కారం ద్వారా శాంతి పొందాలి. బాబూజీ అంటూ ఉండేవారు – "అందరూ శాంతి, శాంతి అంటూ ఉంటారు. ముందుగా మీరు మీ ఇంట్లో శాంతం వహించటానికి ప్రయత్నించండి. అలా ఇంటింటా శాంతి నెలకొని ఉంటే పరిసరాలు అంతటా శాంతి నెలకొని ఉంటుంది. ప్రశాంతతవలన ప్రతి ఇల్లూ ఆశ్రమంగానే ఉంటుంది. అందుచేత ఇల్లిల్లూ ఆశ్రమం కావాలి. అప్పుడే సర్వత్రా శాంతి, దివ్యత్వం ప్రసరిస్తుంది" అనేవారు.

అందుచేత మనం బాహ్య పరిసరాలలో కూడా ప్రశాంతతతో ప్రవర్తిస్తే అంతటా అనగా వాతావరణ మంతా ప్రశాంతి, దివ్యభావమూ, దివ్యశక్తి వ్యాపించి ఉంటాయి.

**అనవసర విషయాలపై ధ్యాస:** గోడలకు చెవులుంటాయి అని ఒక సామెత ఉంది. అంటే కొంతమంది తమకు తెలిసిన విషయాన్ని నిగ్రహించుకోలేక వెల్లడి చేస్తూ ఉంటారు, ముఖ్యంగా అనవసరమైన విషయాలను. అందువలన అనవసర విషయాలపై ధ్యాస ఉంచకుండా అసలైన విషయాలపైనే ధ్యాస అలవరచు కోవాలి. ధ్యానంలో మనసు లగ్నం కావటంలేదని అంటూ

ఉంటారు. కాని బాహ్య విషయాలమీద ఆసక్తి, వాటి మీద శ్రద్ధవలన అసలు విషయం మీద నిగ్రహం పోతుంది. అలాగే క్లీనింగ్ విషయంలో కూడా మన నుంచి సంస్కారాలు తొలగిపోవాలి అని మనఃపూర్వకంగా ప్రయత్నించాలి. ఒకసారి నేను బాబూజీ ముందు కూర్చొని ధ్యానంలో ఉండగా నాలో సంస్కారాలన్నీ ఒక్కసారిగా తొలగిపోయాయి. వారి శక్తి అటువంటిది.

సహజమార్గం అవలంబించటానికి ముందుగా ముఖ్యమైనది జీవన విధానం. నవంబర్‌లో జరగబోయే బాబూజీ జన్మదిన వేడుకల్లో కూడా ఈ విషయాలమీదనే ప్రాధాన్యత నివ్వదలచాను.

ఒకసారి బాబూజీ అస్వస్థులుగా ఉన్నప్పుడు వారిని చూడటానికి నేను వెళ్ళాను. వారికి పరిచర్యలు చేస్తున్న అభ్యాసులు వారు విశ్రాంతి తీసుకుంటున్నారు, భంగం కలిగించవద్దని చెప్పారు. అప్పుడు బాబూజీ అన్నారు, "ఏదో బలమైన దివ్యశక్తికే నన్ను డిస్టర్బ్ చేయగల శక్తి ఉంటుంది. ప్రగాఢమైన ప్రేమ, భక్తి ఉంటే దానివలన దివ్యశక్తి చలిస్తుంది. అంతేగాని సామాన్యుల వలన కాదు" అని చెప్పారు.

**అవసరాలు – అసంతృప్తి:** బాబూజీ షాజహాన్‌పూర్ వదలి ఇతర ప్రాంతాలకు పర్యటనకు వెళ్ళిన తరువాత, ఆశ్రమంలో గాని, ఇంటి వాతావరణంలోగాని దినచర్యలలో కొంత క్రమభంగం కలిగేది. బాబూజీ పర్యటన నుంచి తిరిగివచ్చిన తరువాత ఆ

లోపాలను తెలుసుకున్న తరువాత వాటి కారణాలు ఏమిటో తెలుసుకుని 'వారు' దానికి సంబంధించిన వ్యక్తులను, సేవకులను అందరినీ పరామర్శించి వారికి కలిగిన ఇబ్బందులను, మనసులోని అసంతృప్తిని, అవసరాలను తెలుసుకొని వాటిని తీర్చటం ద్వారా మళ్ళీ సాధారణ పరిస్థితులు నెలకొనేటట్లు చేసేవారు. అందుచేత అభ్యాసీలు కూడా తమ దైనందిన జీవితంలో మన అవసరాలు ఎలా తీర్చుకోవాలని కోరుకుంటామో, అలాగే ఇతరుల అవసరాలను కూడా గుర్తించి వాటిని నెరవేర్చటానికి ప్రయత్నించాలి. వారి అసంతృప్తిని తొలగించినప్పుడు వారికి కూడా ఆనందం కలుగుతుంది. ఒకవేళ మనం వారి అవసరాలను పూర్తిగా తీర్చలేకపోతే తన అశక్తతను వివరించి సమాధానపరచటానికి ప్రయత్నించాలి. సమాజంలో ప్రశాంతత నెలకొనడానికి ఈ విధంగా అందరూ ప్రయత్నించాలి. కుటుంబ సభ్యులు, బంధువులు, మిత్రులే కాదు. అందరితోనూ ప్రేమపూర్వకమైన వ్యవహారం కలిగి ఉండాలి. మన ప్రాపంచిక జీవితంలో ఎవరిపట్ల కూడా అమర్యాదగా ప్రవర్తించరాదు. అభ్యాసీలు అందరూ ఇలాంటి ప్రేమపూరిత వాతావరణాన్ని నెలకొల్పితే బాబూజీ చాలా సంతోషిస్తారు.

**విశ్వాసానికి, సంకల్ప శక్తి (ఇచ్ఛాశక్తి) కి వ్యత్యాసం:** మనకు ఏదైనా బాగుందనిపించి, దాని పనితనం మీద నమ్మకం కుదిరి దానిమీద ఆధారపడాలనుకోవటం విశ్వాసమవుతుంది.

మన ఆంతరిక శక్తి మీద ఆధారపడి, దివ్య శక్తి మీద విశ్వాసం ఉంచితే మనలో ఆత్మశక్తి బలపడుతుంది. ఆ ఆత్మశక్తితో మనమేదైనా సాధించదలచుకుంటే ఆత్మవిశ్వాసంతో విజయం సాధిస్తాం. దివ్యత్వంమీద, దివ్యశక్తిమీద అప్రయత్నపూర్వక ఆధారం ఏర్పడుతుంది. అటువంటి దివ్యశక్తి సమన్వితుడైన బాబూజీ సహాయంతో మనం ప్రాపంచిక విషయాలలో విజయం సాధిస్తాం. అందుచేత బాబూజీ మీద పరిపూర్ణ విశ్వాసం ఉంచి, ఆ పనిలో సాఫల్యం సాధించినప్పుడు, ఆ విశ్వాసంవలన నేను చేశాను అనే భావం చోటు చేసుకోదు. దివ్యత్వం మీద ప్రేమ లేకపోవటమే విశ్వాసలేమికి కారణమౌతుంది.

**ధ్యానంలో ఉండగా శ్వాసక్రియ నిలిచిపోవడం:** ధ్యానంలో ఉండగా మనలో శ్వాసక్రియ జరగటంలేదనే స్పృహ కలిగి ఉన్నంతవరకు, మనం ధ్యానంలో పూర్తిగా మగ్నం కాలేదనే భావించాలి. మన శ్వాస మన ధ్యానాన్ని భంగపరుస్తున్నదనే ఆలోచన కలుగుతుంది. కానీ పూర్తిగా ధ్యానంలో లీనమై పోయినప్పుడు శ్వాసయొక్క ధ్యాస మనకు ఉండదు. ఒకవేళ శ్వాసకార్యం నిలిచిపోయినా దాని ప్రయోజనాన్ని దివ్యశక్తి సమకూర్చుతుంది.

**ధ్యానంలో కలిగే అనుభూతి:** ఆరంభంలో శారీరకంగా తేలికైనట్లు అనుభూతి కలుగుతుంది. కొంత సమయం తర్వాత ఆ అనుభూతి ఉండదు. అలాగే కొంత ఆనందం కలుగుతుంది. అందుచేత కలిగిన ఆనందం, తేలికదనం మీదే దృష్టి నిల్పకుండా ఇంకా

పురోగమనం సాధన చేయాలి. ఎందుకంటే ఒకసారి పొందిన ఆనందం, తేలికదనం అనే అనుభూతి మన స్వంతమైపోయాక వాటిని గురించి ఆలోచించటం అనవసరం. దివ్యత్వం గురించి ధ్యానంలో ధ్యాసనిలిపి పొందవలసిన దానిని శోధించాలి. బాబూజీని ఒక అభ్యాసి, తాను చాలాకాలం నుంచి ధ్యానం చేస్తున్నా ప్రోగ్రెస్ నిలిచిపోయిందని అడగ్గా, ధ్యానంలో కలిగిన అనుభూతులనే తిరిగి నెమరువేసుకొని వాటినే మళ్ళీ మళ్ళీ పొందాలనే తలంపు లేకుండా ఉండి ఆత్మసాక్షాత్కారం కొరకు తపనతో సాధన చేయటమే ధ్యేయంగా ఉండాలన్నారు.

బాబూజీతో ఒక అభ్యాసీ పొగత్రాగడం గురించి, హుక్కా గురించి ప్రస్తావించినపుడు బాబూజీ ఛలోక్తిగా, "నేను హుక్కా పీలిస్తే దివ్యత్వాన్ని గుంజుతాను. నీవు అదే చేస్తే పొగ పీలుస్తావు" అన్నారు. అందుచేత ఇటువంటి చౌకబారు విషయాలమీద ధ్యాస నిలపరాదు.

బెంగాల్ ప్రజలు చేపలు తింటున్నారంటే వారికి లభ్యమవుతున్న ఆహారాన్నిబట్టి అది వారి ప్రకృతి సిద్ధమైన అలవాటు అన్నారు. అలాకాకుండా వైద్యుడు ఎవరైనా రోగికి గ్రుడ్లు తినమని సూచనచేస్తే అది అతడు ఆరోగ్యవంతమయ్యే వరకు అవసరమవుతుందే కాని తరువాత దాని అవసరం ఉండదు. ఆహారాన్ని రుచికోసం కాకుండా ప్రసాదంగా స్వీకరించాలి. మనం స్వీకరించేది భగవత్ప్రసాదం అనుకుంటే రుచులను గురించిన ఆలోచన రాదు.

**ప్రశ్న: సాయంకాలం క్లీనింగ్ సమయంలో కొద్దిసేపటికే దానిని వదిలేసి ధ్యానం చేయాలనిపిస్తుంది. అటువంటప్పుడు క్లీనింగ్ కంటిన్యూ చేసుకోవాలా లేక ధ్యానం చేసుకోవచ్చా?**

**జవాబు:** అటువంటి సందర్భంలో క్లీనింగ్ నిలిపివేసి మెడిటేషన్ చేసుకోవచ్చు. ఎందుకంటే ధ్యానంవైపే మనస్సు మ్రొగ్గుతోంది కనుక. నీ సిస్టమ్‌కు అదే అవసరమన్న మాట. సహజమార్గ విధానంలో కొంత ప్రోగ్రెస్ అయ్యాక క్లీనింగ్ యొక్క ఆవశ్యకత కూడా ఉండదు. కనుక క్లీనింగ్‌ను నిర్లక్ష్యం చేసి ధ్యానం చేసుకోవచ్చు. ప్రార్థన, క్లీనింగ్ అనేవి ధ్యానంలో నిమగ్నం కావటానికి సహాయకారులేకాని అత్యవసరాలు కాదు. ధ్యానంలో మునిగిపోగలిగితే వాటి అవసరం ఉండదు. బాబూజీ మహరాజ్‌తో నేనొకసారి, ధ్యానంలో ఉండగా అంతకుముందు కలిగిన స్థితులు ప్రొగెస్ కావటానికి నాకు భంగం కలిగిస్తున్నాయి అన్నాను. అపుడు బాబూజీ అన్నారు, నీవు దివ్యత్వంలో పూర్తిగా మునిగి ఉన్నావు. కనుక నీకు ధ్యానం యొక్క అవసరంలేదని సూచించారు. అభ్యాసీల విషయంలో నేరంచేసే ఆలోచనలుకాని, శిక్షించే తలంపులుకాని రావు. కాని బాబూజీ అభ్యాసీలు కాని వారి విషయంలో కూడా పవిత్రత నెలకొల్పటానికే కృషి చేస్తున్నారు. 'వారు' ఈ యుగంలో అవతరించినది మానవ మాత్రులందరినీ అంతిమానికి చేర్చదలచిన సంకల్పంతోనే! అనర్థదాయకమైన ఈ కాలంలో 'వారు' అవతరించినది కలియుగాన్ని సత్యయుగంగా మార్చటానికే. **వారి** కృషితో

సామాజిక రుగ్మతలన్నీ అంతరించిపోయి సత్ప్రవర్తన కలిగిన సృష్టిక్రమానికి శుభోదయమవుతుంది. మానవులలో సాక్షాత్కారం పొందినకొద్దీ చెడు విషయాలమీద అనాసక్తత ఏర్పడి మంచి పెరుగుతుంది. అపుడు మళ్ళీ సత్యయుగానికి నాంది పలికినట్లవుతుంది. కలియుగమనేది ఎన్నో యుగాల తర్వాత వచ్చింది. ఈ విధంగా చెడు పెరిగి పెరిగి సంఘటితమై, ఒకానొక మహాపురుషుడు అవతరించి తన విధ్వంసక శక్తితో దానినంతటినీ సర్వనాశనం చేశాక ఒక మంచి కాలం అనగా సత్యకాలం ప్రారంభమవుతుంది. ఏదైనా చెడు త్వరగా వ్యాపిస్తుంది. మంచి నిదానంగా చోటు చేసుకుంటుంది. ఇది మానవ నైజం. బాబూజీ కృపవలన సహజమార్గం ద్వారా మానవులలో పరివర్తనం ప్రారంభమై మంచి వేగంగా పురోగమిస్తోంది. కనుక మంచికాలం అసన్నం కానుంది.

మనకు పరిస్థితులు అనుకూలంగా ఉన్నప్పుడు ఆనందం కలుగుతుంది. పరిస్థితులు ప్రతికూలంగా ఉన్నప్పుడు బాధ కలుగుతుంది. అనగా సుఖదుఃఖాలు రెండూ పరిస్థితులనుబట్టి మనలోనే కలుగుతాయి. ఇది బాహ్య జీవితానికి సంబంధించింది. కానీ ఆంతరిక చైతన్యంతో వీటికి అతీతమైన ఆనందం కలుగుతుంది. సంతోషం కలిగినా, దుఃఖం కలిగినా బాబూజీనే స్మరించి అన్నీ వారే ఇచ్చినట్లుగా భావిస్తూ, దుఃఖాన్ని తొలగించమని బాబూజీనే ప్రార్థించి హృదయం వారి కొరకే విప్పి ఉంచాలి. అప్పుడు వారి దయా సౌరభం, సుఖం మన

అంతరంగంలో వ్యాపిస్తాయి. అనగా సుఖదుఃఖాలను సమానంగా పరిగిణిస్తే వ్యాకులత ఉండనేరదు.

బాబూజీ చెప్పిన ఒక చతురోక్తిని ఉదహరిస్తాను. ఒక పనిలో నాలుగువేల మందిని నియమిస్తాం. అందులో చాలామంది తమ పని చేసిచేయనట్లుగా కాలం గుడుపుతారు. కాని ఏ నలుగురో బాధ్యతగా తీసుకొని అంకితభావంతో పనిచేస్తూ పని సక్రమంగా జరగటానికి భారం వహిస్తారు. అనగా ఆ నలుగురు గాడిదల్లాగా బరువు అనగా పనిభారం మోయవలసి ఉంటుంది. అటువంటి వ్యక్తులు గుర్తించబడతారు. అలా బరువు మోసే గాడిదలను నేను ప్రేమిస్తాను అని బాబూజీ చమత్కరించారు.

సృష్టికర్త మానవులను సృష్టించాడు. మనకు భగవంతుడు అవసరమైనట్లే దైవానికి మనుజులు అవసరం. దైవం తనను వారు ప్రేమించాలనుకుంటాడు. అందుకే సందర్భానుసారంగా దివ్య వ్యక్తులను అవతరింపజేసి తన సృష్టిలోని మానవులందరూ తనను ప్రేమించేటట్లు చేయిస్తాడు. వారి ద్వారా సృష్టికార్యం కూడా సక్రమంగా తన నియమం ప్రకారం జరిగేటట్లు చేస్తాడు.

సామాన్యంగా అవతారములన్నీ గాడ్లీ రీజియన్ నుంచి అవతరిస్తాయి. కానీ బాబూజీ మాత్రం అంతిమం అనగా భూమా నుంచి అవతరించారు. అనగా సంపూర్ణ శక్తివంతమైనది వారి అవతారం. బాబూజీగారి గురుభాయీ ఒకసారి బాబూజీతో ఇలా అన్నారు: “భూమా నుంచి పరిపూర్ణ శక్తితో ఈ భూమిమీద మా మధ్య నీవు అవతరించటం మా భాగ్యంగా భావిస్తున్నాం. ఆ

ఆదిశక్తితో మాకు నేరుగా సంబంధం ఏర్పడటం మా అదృష్టం" అని.

ప్రేమ అనేది అన్ని అడ్డంకులనూ తొలగించుకొని గమ్యాన్ని చేరగలదు. ప్రేమ ముఖ్యంకాని, ఆచార వ్యవహారాలు అడ్డుకాకూడదని బాబూజీ తమ స్వకుటుంబ విషయంలో చెప్పినట్లు ఇలా వివరించారు: బాబూజీగారి తండ్రి చనిపోయాక, బాబూజీ చెల్లెలి వివాహం జరుగుతున్న సందర్భంలో, బాబూజీగారి తల్లి విధవరాలు కావటం వలన ఆమెను చాటుగా ఉండాలని బంధువులు ఆదేశించారు. అపుడు బాబూజీ ఆ బంధువులను ఉద్దేశించి, "మీలో ఎవరైనా సరే నా తల్లి ప్రేమకు సరితూగే ప్రేమతో నా సోదరిపట్ల ప్రేమను కలిగి ఉన్నారా?" అని ప్రశ్నించారు. అందురూ మౌనం వహించగా, బాబూజీ చెప్పారు, తల్లిప్రేమ అన్ని అడ్డంకులనూ అధిగమించి బిడ్డ క్షేమం కోరుతుందని, ఇటువంటి అనాచారాలకు ప్రాతినిధ్యమివ్వరాదు అని. అందుచేత కీడు శంకించే మనస్తత్వం కలిగి ఉండకూడదు. ఇటువంటి సందర్భాలలో బాబూజీ మన ఎదుట ఉన్నారనే భావన మనకు సత్ఫలితాన్నిస్తుంది. (పురుషులందు పుణ్యపురుషులు వేరయా అన్నాడు వేమన. అలాగే పుణ్యవతులందు పుణ్యమతులు కూడా వేరుగా ఉంటారు.)

ఇతరులను మాస్టర్ అని భావించే వారు కూడా బాబూజీ చెప్పిన విషయాలు తెలుసుకోవటానికి ఇక్కడకు వస్తూ ఉంటారు. అందుకని మన సంబంధం బాబూజీ స్థాపించిన మిషన్‌తో,

వ్యక్తులతో కాదు. అలాగే మన సంబంధం కూడా దైవానితోనే. మనం మిషన్‌లో ఎప్పుడు చేరాము అన్నది ముఖ్యం కాదు. మనం మిషన్‌లో చేరినదే ముఖ్యం.

ఒకసారి ఒక అభ్యాసి బాబూజీని, “మీరు భూమా నుండి భువికి ఎందుకు దిగివచ్చారు?” అని అడిగాడు. దానికి బాబూజీ ఇలా వివరించారు: “కన్య వివాహమైన తర్వాత మాతృ స్థానాన్ని వదలి అత్తవారింటికి వెళ్ళుతుంది. కొంతకాలం తన మాతృస్థానం (పుట్టిల్లు) గురించిన ఆలోచన ఉంటుంది. ఆ తర్వాత భర్త కుటుంబంతో స్నేహ బాంధవ్యాలవలన, సంతానాన్ని సాకటంలోనూ నిమగ్నమైపోయి కాలక్రమేణా పుట్టిల్లును, తల్లిదండ్రులను మరచిపోతుంది. అటువంటప్పుడు తన పుట్టింటి వారెవరైనా ఆమెను చూడటానికి వస్తే మళ్ళీ ఆమెకు పుట్టిల్లు యొక్క స్పృహ వస్తుంది. అలాగే మానవులందరికీ భూమాయే మాతృస్థానం. అలా మరచిపోయిన మాతృస్థానాన్ని జ్ఞప్తికి తేవటానికే నేను భూమా నుండి మీ మధ్యకు వచ్చాను” అన్నారు.

బాబూజీ మహరాజ్ వారి జన్మ శతాబ్ది ఉత్సవాల సందర్భంలో సోదరి కస్తూరిజీ ఒక గీతమును రచించి, ఆలపించారు. దానిలోని ఒక పంక్తి భావం – “ఈరోజు నీ ముఖములోని దరహాసం ఎలాఉన్నదంటే నీవు అందరినీ ప్రేమిస్తూ ఉన్నావని గ్రహించాను. ప్రతి అభ్యాసి హృదయమును దివ్యత్వంతో నింపుటకు నీ ఆశీర్వచనాలు నాకు స్వతంత్రమునిచ్చాయి.”

## శ్రీ బాబూజీ మహరాజ్ వారి నూరు సంవత్సరాల జన్మదిన వేడుకల సందర్భ సమావేశాల్లో సోదరి కుమారి కస్తూరిజీ పసిడి పలుకులు

నా ప్రియ సోదరులారా! ఈ జన్మ శతాబ్దివత్సర సమారోహ ప్రాంగణంలో నిన్నటి (10-11-1998) నుండి శ్రీ బాబూజీ మహరాజ్ యొక్క ప్రత్యక్షతను మనందరి హృదయాలలోను అనుభవిస్తున్నామన్న విషయాన్ని మీ అందరికీ చెప్పుకోకుండ ఉండలేకపోతున్నాను. కనుక ప్రతి ఒక్కరు ఈ సమారోహంలో ధ్యానంలో గాఢంగా నిమగ్నమై ఉంటే ఆ ప్రత్యక్షతానుభూతిని లోతుగా గ్రహించగలుగుతాము - ఆ దర్శనానందానుభూతితో లబ్ధి పొందుతాము.

బాబూజీ మహరాజ్ శక్తికి ప్రమాణము - 'వారు' సెంట్రల్ రీజియన్‌లో కలిగించిన అనుభూతి. ఈ సెంట్రల్ రీజియన్ భూమా యొక్క శక్తిభరితమై ఉన్నది- భూమా శక్తిని కూడి ఉన్నది. ఇలాంటి ఈ సెంట్రల్ రీజియన్‌లో ప్రవేశించాలంటే బాబూజీ వారి సహాయంలేకుండా జరగనే జరగదు. అందువలన బాబూజీ మహరాజ్ వారి చరణాలను ఆశ్రయించాలి -శరణువేడాలి. అటువంటి శక్తివంతమైన సెంట్రల్ రీజియన్ నుండి మనకు శక్తి ప్రసారం - ట్రాన్స్‌మిషన్ రావడం మన అదృష్టం. అలాంటి శక్తి సంపన్నుడు, అవతార పురుషుడు శ్రీ

బాబూజీ మహరాజ్‌ని శ్రీ లాలాజీ మహరాజ్ మనకు ప్రసాదించారు. ప్రాణిమాత్రులందరి ప్రయోజనం కొరకు ఈ మహాప్రసాదం లభించింది. కనుక ఆ ప్రయోజనం మనం పొందాలి.

షాజహాన్‌పూర్‌లో ఒక ఉత్సవ సమయంలో శ్రీ బాబూజీ వారిని ఒకరు ఇలా అడిగారు: "బాబూజీ! వ్యక్తుల అర్హతా నర్హతలతో నిమిత్తం లేకుండా అందర్నీ మిషన్‌లో చేర్చుకుని 'అనంతం' వద్దకు చేర్చుతానంటున్నారే ఇది........"

దానికి బాబూజీ ఇలా సమాధానం ఇచ్చారు: "అతడు యోగ్యుడా కాడా అనే మీమాంసతో కాలం వ్యర్థం చేయను. అందరికీ ప్రేమతో ప్రాణాహుతి శక్తిని ప్రసారం చేస్తాను. అది నా బాధ్యత. ప్రతి ఒక్కరికీ ఇవ్వడానికే నేను వచ్చాను. ఆ శక్తిని గ్రహించడానికి నేను వారిని సిద్ధపరుస్తాను. శక్తిపై నాకు అనుమానం లేదు. దానిని వారు వారి శక్త్యానుసారం సాధన, దీక్షనుబట్టి పొందగలుగుతారు."

ఈ సందర్భంలో శ్రీ లాలాజీ మహరాజ్‌కు కృతజ్ఞత తెలుపుకుందాం. సర్వమానవాళిని ఉద్ధరించడానికై మన బాబూజీని ఈ భువిపై అవతరింపజేసిన శ్రీ లాలాజీ వారిని గుర్తించి వారిలో దివ్య చైతన్యం కలిగించారు మౌల్వీ సాహెబ్. తపస్సుతో దివ్యశక్తిని భూమిపై అవతరింపజేయాలన్న లక్ష్యాన్ని మౌల్వీ సాహెబ్, వారికి (లాలాజీ సాహెబ్) నిర్దేశించారు. వారి (మౌల్వీ సాహెబ్) ఆదేశం ప్రకారం శ్రీ లాలాజీ మహరాజ్ ఏడు

నెలల నిరంతర తపస్సుతో దివ్యశక్తి స్వరూపంగా శ్రీ బాబూజీ మహరాజ్‌ని ఈ భూమిపైకి అవతరింపజేశారు. ఇందులో ఒక ప్రత్యేకత ఉంది. గత కాలంలో అవతారాలన్నీ అల్టిమేట్ – భూమా నుండి కాక దాని దిగువ ప్రాంతం (రీజియన్) నుండి ఋషులు, మునుల ప్రార్థనలవలన రాముడు, కృష్ణుడు ఈ భూమిపై అవతరించారు. కాని లాలాజీ సాహెబ్ వారి నిరంతర తపః ఫలితంగా భూమా అనగా అల్టిమేట్ నుండి అక్కడి దాని యొక్క సంపూర్ణ శక్తితో బాబూజీ అవతరించారు. ఈ విధంగా ఇంతకు ముందు ఎప్పుడూ జరుగలేదు. కనుక అలాంటి మహత్‌భాగ్యం కలిగించిన శ్రీ లాలాజీ సాహెబ్ వారికి ముందుగా కృతజ్ఞత తెలుపుకోవాలంటున్నాను.

ఏ ఆధ్యాత్మిక గ్రంథంలోనూ – హృదయ మండలం, మనోమండలం గురించి తప్ప కేంద్ర మండలం గురించి చెప్పబడలేదు. బాబూజీ వారి పరిశోధనా ఫలితమే కేంద్ర మండలం –సెంట్రల్ రీజియన్. భూమా నుండి అనగా అనంతం నుండి అవతరించిన వారే బాబూజీ కనుక ఆ అనంతం వరకు తీసుకవెళ్ళడం గురించి వారే చెప్పగలరు. తీసుకవెళ్ళగల సమర్థతా వారికే ఉంది.

"శతాబ్ది" అన్న పదం చాలా చిన్నది. కాని దాని అర్థం చాలా విలువైనది. **"శత్" అనగా నూరు రెట్లు, "అబ్" అంటే సౌందర్యం, అనగా దివ్య తేజః సౌందర్యం. "ది" అనగా ఇచ్చేది లేదా ఇచ్చేవారు. అంటే ఈ శత సంవత్సర జన్మదినపు పండుగ**

**దివ్య సౌందర్యాన్ని - దివ్యత్వాన్ని మనందరికీ ప్రసాదిస్తోంది.** ఇది మనందరికీ శ్రేయోదాయకం. ఈ పర్వదినం మనందరికీ దివ్యాశీస్సులందిస్తోంది. ఈ జన్మ శతాబ్దివత్సర సమారోహం (పండుగ) అనేది - 'వారు' తమ ఆశీస్సులందించడానికి బాబూజీ ఏర్పాటుచేసిన ఒక సందర్భం. బాబూజీ మహరాజ్ అంటూ ఉండేవారు, "నేను ప్రాణిమాత్రులకు దేనినైతే ఇవ్వడానికి వచ్చానో దానిని పూర్తిగా ఇచ్చి వెళ్తాను. ఏ మాత్రమూ వెనక్కు తీసుకొనివెళ్ళను. గ్రహించగలిగినది గ్రహించబడగా మిగిలినది వాతావరణంలో వారి ఆవరణలో వ్యాపించి ఉంటుంది" అని. ఇప్పుడు ఆ సమయం వచ్చింది. ఈ ఉత్సవం ఎందుకంటే 'వారు' తెచ్చిన ఆ దివ్యశక్తి నూరింతల సౌందర్య తేజమై ఇనుమడించి మనందరికి లభ్యం కావడానికే. నేను ఈ జన్మ శతాబ్దివత్సర పర్వదినం ఇంత ఘనంగా జరుగుతుందని ఊహించలేదు. అలహాబాద్ సెంటర్‌లో జరిగిన ఉత్సవానికి వెళ్ళి వచ్చాక ఈ సంకల్పం కలిగింది. ఇది బాబూజీ వారి దివ్య సంకల్పమే! ఇదంతా వారి దివ్యానుగ్రహం. మనందరం కృతార్థులం. శ్రీ లాలాజీ వారి శతాబ్ది ఉత్సవం ప్రతి నెలలో ఒక రోజు పండుగ చేశారు. ఈ శత జయింతి ఉత్సవాలు ఎన్నో చోట్ల జరుగుతూ ఉండవచ్చు. కాని ఇక్కడ శ్రీ బాబూజీ మహరాజ్ యొక్క పరిపూర్ణ కృప, దివ్యశక్తి నూరింతలు అధికంగా వర్షిస్తోంది. ఈ శతాబ్ది ఉత్సవ కానుకగా ఒక చిన్న పుస్తకాన్ని కానుకగా బహూకరిస్తున్నాను. ఇది బాబూజీ కృపతో సంభరితమై ఉన్నది.

దీనిని మీరు సద్వినియోగం చేసుకుని బాబూజీ కృపకు పాత్రులుకండి. లబ్ధి పొందండి. ఈ శతాబ్ది సంవత్సరంలో బాబూజీ యొక్క ఆశీస్సులు వర్షిస్తున్నాయి. ఇవ్వడమే వారి వంతు. గ్రహించడం గ్రహించలేకపోవడం మన వంతు. 'వారు' వితరణ చేస్తున్న దివ్యశక్తి గ్రహించబడగా మిగిలినది ధ్యాన సాధనకొద్దీ, వీనుల ద్వారా, శ్వాస ద్వారా గ్రహించబడుతుంది. బాబూజీ ఓసారి ఇలా అన్నారు– "నేను ప్రాణిమాత్రులకు వితరణజేసే అంత ప్రేమ, ఏ తల్లి కూడా తన బిడ్డకు అందించలేదు. ప్రేమను పంచడం నా వంతు. పొందడం మీ వంతు." బాబూజీ అలా అన్నట్లుగానే నా హృదయంలోని మమత మీ అందరిలోనూ ప్రసరించాలని నా అభిలాష. ఇది ఒక స్వర్ణయుగం. ఈ యుగమే **వారి** దివ్య సౌందర్యధారతో పునీతమవుతోంది. ఈ సమారోహం– ఈ పండుగా సాటిలేనిది. దీనిని నిర్వహించాలన్న తలంపు నాది కాదు. బాబూజీ యొక్క దివ్య ఆదేశంతో ఈ సమారోహం ఇక్కడ నిర్వహించబూనటం జరిగింది. కనుక సావధానులై బాబూజీ యొక్క దర్శనభాగ్యం మీ అంతరంగంలో అనుభూతి పొందండి. బాబూజీ నుండి దివ్యశక్తి అపారంగా ప్రవహిస్తోంది. బాబూజీతో ఆత్మానుసంధానమున్న అభ్యాసులందరూ ఇక్కడ ఉన్నా, ఎక్కడ ఉన్నా అది అందరికీ లభ్యమవుతూనే ఉంటుంది. ఈ దివ్యశక్తి ప్రసారాన్ని స్వీకరించి అందరూ పునీతులౌతారు. శ్రీ బాబూజీ మహరాజ్ ఒక భాండాగారం. ఒక నిధి. ఆ భాండాగారంలో దేనికైనా అర్థం దొరుకుతుంది. ఓసారి ఈశ్వరసహాయ్‌గారు

బాబూజీని "బాబూజీ! ఇక్కడకు వచ్చిన అభ్యాసులు, రాని అభ్యాసులు కూడా ఈ కృపా లబ్ధిని పొందుతారు, అని మీరంటున్నారు కదా! అటువంటప్పుడు అభ్యాసులు ఇక్కడకు రావలసిన అవసరం ఏముంది?" అని అడిగారు. దానికి బాబూజీ, "ఇక్కడకు వచ్చిన వారు నా కళ్ళ ముందుంటారు – నన్ను ప్రత్యక్షంగా చూస్తారు. రాని వారికి పరోక్షంగా వారిపై నా దృష్టి (అటెన్షన్) ఉంటుంది" అన్నారు.

ఇదివరకు అంటే ఇంతవరకు ఎవరు చెప్పినా హార్ట్ రీజియన్, మైండ్ రీజియన్ గురించి మాత్రమే వెల్లడించడం జరిగింది. ఇప్పుడు సెంట్రల్ రీజియన్ గురించి తెలియజేశారు. సృష్టికి సంబంధించిన శక్తి అంతా ఇక్కడే కేంద్రీకృతమై ఉంది. అటువంటి 'శక్తి కేంద్రం' పై నుంచి సశక్తియుతంగా అవతరించారు కనుకనే బాబూజీ ఆ కేంద్రాన్ని గురించి చెప్పగలిగారు. కనుక బాబూజీని గురించిన స్మరణలో **వారి** స్పృహలో ఉన్న వారందరికీ **వారి** శక్తి ప్రవాహం లభిస్తూంటుంది. **వారి** దివ్య స్మరణలోని ప్రతిక్షణమూ పవిత్రమైనదే!

**మనం వారి దివ్యపాద సన్నిధిని శరణుజొచ్చుదాం!**

**వారి పెదవుల పదాల వల్లించుకొని పరమార్థం గ్రహించుదాం!**

నేను దివ్య సౌందర్యాన్ని **వారి** దివ్య చక్షువులతోనే కాంచగలిగాను. నా నేత్రాలతో కాదు. నా ప్రార్థనానంతరం **వారి** దర్శన స్థితి లభించింది. **వారి** 'దర్శనం' పొందగలిగినప్పుడే,

వారే డివైన్ పర్సనాలిటీ – దివ్యతామూర్తులని, దివ్యస్వరూపులని తెలుస్తుంది. నాకు ఆ స్థితిని (రియలైజేషన్ స్థితిని) ఇచ్చినప్పుడు 'వారి' ఎదుట ఒక కనిపించీ కనిపించనిదైన ఒక తెర – పార దర్శకపు తెర ఉండింది. తమకు, నాకు మధ్య ఉన్న ఆ ఉల్లి పొరలాంటి తెర ఎందుకు అని వారిని వేడుకోగా "ప్రకృతి నియమం ప్రకారం ఒక కాలంలో ఒకే డివైన్ పర్సనాలిటీ (దివ్యమూర్తి) మాత్రమే ఉండాలి. మరో దివ్యత్వరూపానికి స్థానం లేదు. అందుకనే అలాంటి ఏర్పాటు" అని బాబూజీ అన్నారు. ఆ కండిషన్ – ఆ దివ్యత్వ స్థితిని పొందిన వారెవరైనా సరే అక్కడ బాబూజీనే సందర్శించగలుగుతారు.

బాబూజీ వారి ప్రతి వాక్కులోనూ ఒక ప్రత్యేకార్థం ఇమిడి ఉంటుంది. బాబూజీ మహరాజ్ అలహాబాద్ ఉత్సవంలో సందేశం ఇస్తూ "నేను మన మిషన్ ద్వారా 'మాస్టర్స్'ను తయారుచేస్తాను" అన్నారు. దానిని సీనియర్ అభ్యాసులు, ప్రిసెప్టర్స్ అపార్థం చేసుకున్నారు. తాము 'మాస్టర్స్' అయ్యాము అనుకున్నారు. 'మాస్టర్' శబ్దం చాల విలువైనది, పవిత్రమైనది. దానిని దుర్వినియోగం చేయకూడదు. ఆ తర్వాత బాబూజీ దానిని గూర్చి వివరించారు కూడ. దానికి సరియైన నిర్వచనం ఏమంటే, అభ్యాసీ సహజమార్గ సాధన చేయకముందు అతడి మనస్సే అతణ్ణి నియంత్రిస్తుంది. సహజమార్గ సాధనలో ప్రవేశించి సాధన చేసిన కొలదీ అభ్యాసీ తన మనస్సును నియంత్రించుకొని – అదుపులో ఉంచుకుంటూ తన ధ్యేయం కోసం ప్రయత్నిస్తాడు.

మనసుకు తోచిన దానిని అనుసరించడు. అనగా తనపై తాను కంట్రోల్, అజమాయిషీ చేసుకోవడం ద్వారా ఆధిపత్యం అనగా మాస్టరీ సాధించడం ద్వారా 'మాస్టర్' కావడమన్నమాట. అందుకు సాధన అవసరం. శబ్దార్థం ప్రకారం బాబూజీ అభ్యాసులను ఆ విధమైన మాస్టర్స్‌గా తయారుచేస్తారు – అని భావించాలి. అంటే జితేంద్రియులుగా చేస్తారన్నమాట. బాబూజీ మరో విషయం చెప్పారు – ప్రశిక్షకులుగాని, సీనియర్ అభ్యాసులుకాని తాము అధికులమనే భావన విడనాడి స్వార్థం, అహం (సెల్ఫ్)లపై నియంత్రణ సాధించి తన కంటే, తన కుటుంబీకులకంటే సోదర అభ్యాసులను, ఇతరులను గౌరవించడం, ప్రేమించడం అలవరచు కోవాలన్నారు. ఇలాంటి ఆధిక్యతాభావం, మాస్టర్ అన్న పదానికి అపార్థం కలిగి ఉన్న ఒక అభ్యాసీ గురించిన సంఘటన వివరిస్తాను.

మా ఇంటికి తరచుగా అంటే 4,5 సంవత్సరాలుగా ఒక అభ్యాసీ వస్తుండేవాడు. ఎప్పుడు వచ్చినా తన బ్రీఫ్‌కేస్ తానే స్వయంగా తెచ్చుకునేవాడు. ఈసారి వచ్చేప్పుడు అతడు ముందు వస్తుండగా, వెనగ్గా ఇతగాడి బ్రీఫ్‌కేస్ మోసుకొస్తూ మరో అభ్యాసీ వస్తున్నాడు. అది గమనించిన నేను "మీరు ప్రిసెప్టర్ అయ్యారా!" అని అడిగాను. దానికి అతడు "అవును. మీకు ఎలా తెలుసు?" అన్నాడు. అపుడు నేను – ఇదివరలో మీ బ్రీఫ్‌కేస్ మీరే తెచ్చుకొనేవారు. ఈసారి మీ బ్రీఫ్‌కేస్ మరో అభ్యాసి మోసుకు రావడం జరిగింది. అనగా ఆ అభ్యాసీ కంటే మీరు అధికుడు

అనే భావన మీలో కలిగింది– అంటూ వివరించాను. కనుక "మాస్టర్" అనే పవిత్ర శబ్దానికి వక్రభావన పనికిరాదు. అందరినీ ప్రేమించాలి, గౌరవించాలి. ఇంకా చెప్పాలంటే ప్రిసెప్టర్లు వారిని వారు ప్రేమించుకున్నంతగా తాము తమ అభివృద్ధిని కోరుకున్నంతగా మరో విధంగా చెప్పాలంటే అంతకంటే ఉన్నతంగా, ఎక్కువగా భావించి, అభ్యాసీల అభివృద్ధినీ కోరుకోవాలి.

ఈ ఫంక్షన్ – ఈ పండుగ ఇక్కడే జరపాలనే నిర్ణయపు ఆలోచనే లేదు. వీలైనన్ని ఎక్కువ కేంద్రాలలో జరిపించే ఊహే ఉండింది. కాని అలహాబాద్ సమావేశానికి వెళ్ళి తిరిగి వచ్చిన తర్వాత ఇక్కడ జరపాలనే ఆలోచన అప్రయత్నంగా మదిలో మెరిసింది – ఈ ఊహ వారిచ్చిందే!

బాబూజీ వారి ప్రతి వాక్యం ఎంతో ఆచరణాత్మకంగా ఉండి ఆ శబ్దం చిన్నదైనా దాని అర్థం విలువైనదిగా, నిగూఢంగా ఉంటుంది. వసంత పంచమి భండార్ సమయంలో దేశీయులు అందరితోపాటే విదేశీయులు ఆహ్వానించబడ్డారు. నిర్వాహకుల మాటల్లో 'విదేశీ అభ్యాసీలు' అన్న పదం ఒక సందర్భంలో దొర్లింది. దానికి ఇతర దేశ వాసులు కలత చెంది "మమ్మల్ని మీరు అలా అనవద్దు. మా ఇల్లు షాజహాన్‌పూర్‌నందే ఉంది. మేము బాబూజీకి షాజహాన్‌పూర్‌కు చెందిన వారమే. మేమంతా సహజమార్గ్ అభ్యాసులం. బాబూజీ మా వారే!" అన్నారు.

సహజమార్గ సాధనవలన దేశీయత ఉండదు. జాతీయత

పోతుంది. భౌగోళిక హద్దులు చెరిగిపోతాయి. ఇతర దేశాలలో సహజమార్గ విధానాన్ని బాబూజీ ప్రవేశపెట్టినపుడు "సహజమార్గంలో భ్రాతృభావం చాలా అవసరం – అత్యవసరం" అనేవారు. దీనికి తార్కాణం ఏమంటే ఏ దేశ వాసులైనా సరే – ఏ ప్రాంత వాసులైనా సరే అందరూ బాబూజీకి చెందిన వారే! కుల, మత వివక్షత విచక్షణలు లేకుండా సహజమార్గం విశ్వజనీనమైంది. సహజమార్గ విధానం ఒక జీవన శైలి. బాబూజీ గారిని చూసీ వారితో గడిపిన వారి అనుభూతుల, అనుభవాలను చూసి మనం నేర్చుకోవాలి. సహజమార్గం ఆధ్యాత్మిక జీవితంతోపాటు లౌకిక జీవితంలో కూడా ఎలా మసలుకోవాలో నేర్పుతుంది. ఎక్కడ, ఏ, మన ఉత్సవాలకు మనం వెళ్ళినా ఇల్లూ వాకిలీ, పరివారం అన్నీ మరచిపోతాం. స్నేహం ప్రేమభావంతోనే మెలగుతూ అందులోనే లీనమైపోతాం. ఇది మనందరికీ స్వానుభవంలో అనుభూతిలోకి వచ్చేదే. అభ్యాసీలు అందరూ తమతోటి అభ్యాసులను తనకంటే తన కుటుంబీకులకంటే కూడ మిన్నగా ప్రేమించాలి. పిల్లల్ని లాలించి, ప్రేమించి నేర్పించాలేకాని కోప్పడ్డం, కొట్టడం చేయరాదు. మంచి ప్రవర్తన కోసం వారిని ప్రేమతో చూడాలి. ఆధ్యాత్మికతే కాదు – అన్నీ 'వారి' నుండే నేర్చుకున్నాను. శ్రీ బాబూజీ మహరాజ్ అభ్యాసులను తన బిడ్డలుగా ఆధ్యాత్మికంగానే కాకుండా వ్యావహారిక జీవనంలో కూడా ఎలా కాపాడుతారో ఎలా శ్రద్ధ వహిస్తారో తెలుసా! ఓసారి షాజహాన్‌పూర్‌లో ఒక సమావేశంలో నన్ను ప్రసంగించమన్నారు

బాబూజీ. నేను మాట్లాడుతూ మాట్లాడుతూండగానే కాసేపటికి మాటరాని దానిగా అయిపోయాను. కొన్ని నిమిషాలు గడిచిపోయుంటాయి. ఇంతలో బాబూజీ వారి నుండి పిలుపులాగా – "నీవు ఏ విషయం మాట్లాడుతున్నావో దానిమీదే శ్రద్ధ వహించు. నన్ను జ్ఞాపకంలోకి తెచ్చుకోకు. ఒకవేళ నన్ను జ్ఞాపకం చేసుకోవాలంటే లోతుగా ధ్యానంలోకి వెళ్ళిపో, వెనుదిరిగి ఆలోచించవద్దు – నిరాలోచనగా ఉండిపో. నీకు ధారగా వచ్చిన విషయాన్నే మాట్లాడు" అని చెప్పినట్లయింది. అపుడు నేను నా ప్రసంగం కొనసాగించాను. ఆ తర్వాత బాబూజీగారితో "నేను మాట్లాడక నిలబడిపోయిన సంగతిని ఎవరూ ప్రస్తావించ లేదేమిటి" అన్నాను. దానికి సమాధానంగా బాబూజీ "ఆ సమయంలో అందర్నీ మంత్రముగ్ధులైనట్లు ఆలోచనా రహితులై (థాట్‌లెస్) అయి కాలం నిలిచిపోయిన భ్రాంతిలో పడేశాను. నీ పెదవులు మాత్రమే కదిలాయి. కనుక వారికి నీ మౌనం గుర్తింపుకు రాలేదు. నేను నా బిడ్డలకు ఏ లోపమూ రాకుండా, జాగరూకత వహిస్తాను" అన్నారు. ధ్యానంలో ఏదైనా పొందవచ్చు, కాని ప్రేమను అలవరుచుకోవటం చాలా ముఖ్యం. ప్రేమ అవసరాన్ని బాబూజీ ఎన్నోసార్లు నొక్కి చెప్పారు. బాబూజీ వారి ప్రేమకు నేను చెప్పిన ఆ సంఘటనే ఒక ప్రత్యక్ష నిర్వచనం. బాబూజీ బిడ్డలమైన మనల్ని 'వారు' ఎలా ఆదుకుంటారో మరో సంఘటన వివరిస్తాను. బాబూజీ వారి సమక్షంలో కడప సెంటర్‌లో నేను ప్రసంగించాను. ప్రసంగం పూర్తయాక శ్రోతలతోపాటు నేనూ అనాలోచితంగా చప్పట్లు కొట్టాను. ఆ

తర్వాత నా పొరపాటు గ్రహించాను. ప్రసంగించిన నేనే అసందర్భంగా హర్షం ప్రకటించినట్లయిందని – తప్పు గ్రహించాను. చేసిన పొరపాటుకు మనసులో మధనపడుతూన్న నన్ను పసిగట్టి బాబూజీ "ఎందుకు వేదన" అని అడిగి "నీవేమీ సిగ్గుపడవద్దు. చింతా వద్దు. నీవు చేశావనుకునే ఆ పొరపాటు ఎవరూ గుర్తించనే లేదు. అయినా నీకు అది నమ్మకం కుదరాలంటే సభలో ఉన్న ఆ సదస్యులనెవరినైనా అడిగి తెలుసుకో" అన్నారు. ఆ విధంగా నేను తెలుసుకోగా ఎవరూ దానిని గుర్తించలేదన్నారు. పైగా ప్రసంగం చాలా బాగుందని అభినందించారు. మన అనాలోచిత అసందర్భ చేష్టల నుంచి కూడా బాబూజీ ఎలా కాపాడుతారో గమనించండి.

రాజైనా మహారాజైనా – ఎవరైనా సరే దైవానికి తనను తాను సమర్పించుకోవాలి. అదే శ్రేష్టమైన భక్తి. బాబూజీ అనేవారు, "లాలాజీ మహరాజ్ నా హృదయాన్నే దోచేసుకున్నారు. 'నా' అనేది నాలో లేకపోయాక నాలో ఏమి మిగిలి ఉంటుంది!" అని. అలాగే మనమంతా 'వారి'కి ఆత్మ సమర్పణ గావించుకోవాలి. ప్రతి అభ్యాసీ ఒక్కో యోగి కావాలి. ప్రతి విషయంలోనూ బాబూజీ జీవితాన్ని ఆదర్శంగా తీసుకుని మసలుకోవడం అలవరచుకోవాలి.

మనం ఎలర్ట్ (మెళకువ)గా ఉంటే అంతరంగంలో పొందే అభివృద్ధి, సూక్ష్మత గ్రహించవచ్చు. మనం ఎన్నో జన్మలు ఎత్తి ఈ జన్మకు వచ్చాము. కాని ఈ జన్మ ప్రత్యేకత ఏమిటంటే శ్రీ బాబూజీ మహరాజ్‌తో ఉండడమే! వారి దయతో జన్మల పరంపర నుండి విముక్తి కలుగుతుంది.

బాబూజీ మనముందు – మన ఎదురుగా కూర్చుని ఉంటారు. మనం 'వారి'ని చూస్తూనే ఉంటాం. కాని 'వారు' ఎవరిని ఎక్కడ చూస్తున్నారో గ్రహించడం మనకు దుర్లభం. కుర్చీలో కూర్చున్న వారి భౌతిక శరీరం మన కళ్ళముందే ఉంటుంది. మనవైపే చూస్తున్నట్లూ ఉంటుంది. అయినా వారి మనసు ఎక్కడో లగ్నమై ఉన్నట్లుంటుంది. ఒక అభ్యాసీ 'వారి'ని ఈ విషయమై ప్రస్తావించగా బాబూజీ "ఎప్పుడైనా సరే ఒక మహత్‌శక్తి దివి నుండి ధరాతలానికి దిగి వచ్చినప్పుడు మానవరూపంలో ఆ శక్తి ఇక్కడే ఉన్నా 'దాని' యొక్క అసలు నివాసం 'దివి' లోనే ఉంటుంది" అని అన్నారు. ఎప్పుడూ ఊర్ధ్వముఖులై ఉంటారన్నమాట.

గురుభక్తి ఉండాలి. గురువును భక్తి భావంతో చూడాలి. గురువును మానవమాత్రుడిగా అర్థం చేసుకునేవారు గురుభక్తులు కానేకారు. గురు పశువులు అవుతారు. ఆ దరికి చేర్చే గురువును గుర్తించడం ఎలా? ఎవరి సమక్షంలో మనం ఉండగా పవిత్రత, ప్రశాంతత మనలో అనుభూతమవుతాయో వారిని గురువుగా భావించాలి. అటువంటి వ్యక్తికే మనలో మార్పును అనుభవానికి తెచ్చే శక్తి ఉంటుంది. సాధారణ వ్యక్తిలో, మనలో మార్పును అనగా భక్తి భావాన్ని కలిగించగల శక్తి ఉండదు.

సిట్టింగ్ (Sitting) అంటే సిట్ ఇన్ గాడ్ (Sit in God) భగవంతునిలో, వారి ఆవరణలో, వారి దివ్యత్వంలో కూర్చొని ఉండు, అని. ఆ ధ్యాన భావంవలన నియర్‌నెస్ – సామీప్యత అనుభవం పొందుతాం. 'వారి' దివ్యజ్యోతిలో, వారి దివ్యత్వంలో

– స్థితిలో మునిగి వారిని దర్శించడానికి ప్రయత్నించాలి.

కండిషన్స్ (స్థితుల అనుభూతి) ఎలా వస్తాయి, ఎవరిస్తారు అని అడుగుతుంటారు. బాబూజీ ఈ విషయమై ఇలా అన్నారు: " ఏ కారణంచేత కండిషన్ మారుతున్నది. ఎవరివలన మారుతున్నది. ఎవరి జ్ఞాపకం – ఎవరి స్మరణ వలన మార్పు వస్తూన్నది అనే దానికి మూలం దివ్యమే – దైవమే, అని గ్రహించాలి."

దైవం అందరిలోనూ ఉన్నాడు. ఈశ్వరుడున్నాడంటే దివ్య ప్రకాశం కూడా అందరిలోనూ ఉందన్నమాటే. మనలో ఉన్న ఆ ఈశ్వర ప్రకాశంతోనే మనం ఈశ్వరుని శోధించాలి. ఈశ్వర ప్రకాశం మనలో ఉంది కనుక ఈశ్వరుడూ మనలో ఉన్నాడని మనం ఆలోచించాలి. ఈశ్వరీయ ధ్యానంలో మునిగి ఉంటే ప్రకాశం మాటే ఉండదు. అయినప్పటికీ మన హృదయంలో ఉన్న ప్రకాశం అది ఎవరిదో, ఎలా ఉంటుందో, అది ఎలా సాధ్యపడుతుందో – అప్పుడు మనకు తెలుస్తుంది.

ఓసారి బాబూజీ అన్నారు ''బాబూజీ జ్యోతిని చూపించలేదు – అని కొందరు అభ్యాసులంటారు. చూడు. నీవు ఏదో ఒక గదిలోకి వెళ్ళు. అపుడు నీకు కావలసిన వస్తువును వెదకాలంటే వెలుతురు అవసరమనిపిస్తుంది. అప్పుడు లైట్ వేయి– వెలిగించు. నీవు వెదకాలన్న వస్తువు కనిపిస్తుంది. అనగా, వెలుతురు, వస్తువు ఉన్నట్లే నీలో వెలుతురు ఉంది – ఈశ్వరుడూ ఉన్నాడు. ఇంకా ఎక్కడో వెదకడమేమిటి? ఈశ్వరుడు తన

వెలుతురు (ప్రకాశం) తోనే తనను కనిపింపచేస్తాడు. కనుక నీవు దివ్య ప్రకాశంలోనే మునిగి దానిలోనే చూడు" అనగా ఆ ప్రకాశం లేకుండా మనం జీవించి ఉండే అవకాశం లేనేలేదు.

గురువు నుండి దీక్ష తీసుకోవాలా? అని ఒకరు అడిగారు కదా! మన సహజమార్గ విధానంలో దీక్ష అనేదేదీ లేదు. అలాంటి దానికి స్థానం లేదు. కేవలం సిట్టింగ్ అనేది మాత్రమే! దీనికి బాబూజీ "అబ్" అనే ఒకే ఒక శబ్దాన్ని వ్రాశారు. అనగా ప్రాక్టికల్ – ఆచరణ అన్నమాట. మనం ఈ ప్రపంచంలో ఉంటున్నాం. ఆ భౌతిక విషయాల్లో లీనమవుతున్నాం. అలాగే (Sitting) సిట్టింగ్‌లో కూర్చోవాలి. (Sit in God) సిట్ ఇన్ గాడ్ అంటే దైవసాన్నిధ్యంలో కూర్చో. ఎంతసేపు కూర్చోగలిగితే అంతసేపూ కూర్చో. కూర్చుండగలిగినంతసేపూ కూర్చున్న కొద్దీ దైవసామీప్యతానుభూతి, 'వారి' సాన్నిధ్యం లభిస్తుంది. ఎంతెంతగా సామీప్యత ఉంటే అంతంతగా ప్రకాశం ఉంటుంది. అదే ఈశ్వరునితో అనుసంధానం చేకూర్చుతుంది.

బాబూజీని ఒకసారి – మీరు ఈ భూమిపై ఎందుకు జన్మించారు? అని అడగ్గా "ఇప్పటివరకు ఈ భూమి మీదకు వచ్చిన ఋషులను, సాధుజనులను అవతార పురుషులను ప్రజలు కోరుతూ వచ్చారు. కాని కేవలం ఇవ్వడానికే ఒకరు ఈ భూమిపైకి అవతరించినప్పుడు కోరుకోవలసినదేముంటుంది. ఇస్తూన్న దానిని పుచ్చుకొంటూ, ఉంటూ ఉండడమే" అన్నారు బాబూజీ. మరోసారి బాబూజీని "బాబూజీ! గురుదక్షిణగా లాలాజీకి

ఏమిచ్చారు?" అని అడిగారు. "నా హృదయాన్నే వారు దోచుకున్నాక, నావద్ద ఇంకా మిగిలి ఉన్నదేముంది?" అని జవాబిచ్చారు బాబూజీ.

లాలాజీగారిని "మీకు ఏమి కావాలి?" అని అడిగారెవరో. "వరాలిచ్చే వారే నాకు ఉండగా నేనిక ఎవరిని ఏమి అడిగాలి?" అన్నారట లాలాజీ.

అప్పుడప్పుడు అభ్యాసులు నన్ను "జీజీ! మమ్మల్ని ధనవంతులుగా చేయండి" అని కోరతారు. ఇలాంటి సందర్భంలో చెప్పవలసినదేమంటే ఏ దైవభక్తి శ్రేష్టుడైనా, మహర్షులైనా, సెయింట్ అయినా – "మేము పూర్తిగా కొల్లగొట్టబడ్డాము. ఇక మా వద్ద ఏమీ మిగల్లేదు" అంటూనే ఉన్నారు. మరి వారివద్ద ఏదీ లేనప్పుడు ఇతరుల కివ్వడానికి ఏమి మిగిలి ఉంటుందిక.

బాబూజీ మహరాజ్ అనేవారు, "నీవు నీ స్వగృహానికి అంటే ఈశ్వర నివాసానికి వెళ్ళిపోవాలనుకుంటే, నీవి అనుకున్న వాటినన్నీ వదిలిపెట్టు. ఆ ఇంటి నుండి ఎలా వచ్చావో అలా అయితేనే చేరగలవు. ఈ ఇంటి సామానుతో కాదు. రిక్తమైపోవాలి. ఇక్కడ కూడబెట్టిన వన్నీ – అహం, అహంకారం, స్వార్థం అన్నీ వదిలి బంధనాల నుండి విముక్తుడవై వెళ్ళిపోవాలి."

ఒకామె బాబూజీకి ఇలా జాబు వ్రాశారు: "బాబూజీ! నేను మీ పుస్తకాలు ఏమీ చదవలేదు. నాకంతగా చదువు రాదు కనుక. పోనీ ఎవరైనా చదివి వినిపించినా అర్థం చేసుకునే జ్ఞానమూ నాకు లేదు. మరి నేను ఎలా ఈ ఫలితాన్ని పొందగలను" అని. దానికి బాబూజీ "తల్లీ! నీ పరిస్థితి వంటిదే

నా స్థితి కూడా. భగవంతుడు వ్రాయటానికి, చదువటానికి ఏ స్కూలు గాని, ఏ యూనివర్శిటినిగాని స్థాపించలేదు. అందుచేత చదువు ప్రారంభించబడలేదు – అనే ఆవేదన అనవసరం. అందుచేత నీవు చదివినదంతా వదిలివేసి భగవంతునికి నీ హృదయం మాత్రం అర్పిస్తే నీవు తేలికగా ఆయన్ని చేరతావు. అన్నిటికంటే అదే తేలిక అనుకో" అని బదులు వ్రాశారు.

"సబ్‌మిషన్ (అంటే నమ్రతతో సమర్పణం – తన్ను తాను సమర్పించుకోవడం) కష్టం కాదా!", అని ఒక అభ్యాసీ బాబూజీని అడిగాడు. అందుకు బాబూజీ అది చాలా తేలిక, అంటూనే "నేను ఎందుకు ఈ లోకానికి తీసుకురాబడ్డానో అది ప్రాణిమాత్రులకు సబ్‌మిసివ్‌గా అంటే ఆణకువగా ఉండడానికే! కనుక నీవు నీ సబ్‌మిషన్ మూడ్ అనగా నమ్రతా భావాన్ని దానితో జోడించు. అపుడు నీవు నీ సాధనా ఫలితాన్ని పొందుతావు" అని సూచనగా మార్గనిర్దేశం చేశారు.

మీరు మెడిటేషన్‌లో ఏదో పొందుతారు కదా! దానిని గ్రహించే చైతన్యమే – మెళకువతనమే మీలో లేకపోతే – మరి ఏమి పొందుతారు? ఈశ్వర ధ్యానంలో మనం కూర్చుంటాం. ఈశ్వరుడు మనవాడు. మనలో ఉన్నాడు – బాబూజీ మనవారు. మనలో ఉన్నారు. మనకు ప్రత్యక్షంగా, ఎదుటగా ఉన్నారు. ధ్యానంలో ట్రాన్స్‌మిషన్ –ప్రాణాహుతి ద్వారా మనలో దివ్యధార ప్రవేశిస్తుంది. దాని ద్వారా రియలైజేషన్ అంటే సాక్షాత్కారం కలిగించటమే ఆయన చేసే ప్రయత్నం. ఈశ్వర సాక్షాత్కారం కలిగించడానికే బాబూజీ వచ్చారు. కనుక వారే చైతన్యపరుస్తారు.

సహజమార్గంలో ఆది నుండి దీక్ష ఇవ్వడం అనే దానిని తొలగించివేశారు. దీనిలో శిక్షణ మాత్రమే ఉంది. శిక్షణ అంటే సహజమార్గ శిక్షణ. ట్రెయినింగ్ అంటే ధ్యానం ఎలా చేయాలి అన్నది. అంతేగాని దీక్ష ఇవ్వడం అనేది లేదు.

గురుత్వం అనే భావన ఎంతమందిలో గూడుకట్టుకుని ఉందో, దానిని తొలగించడానికే వచ్చాను నేను అన్నారు బాబూజీ. కనుక గురువు అన్న మాటే లేదు. గురు పరంపరను పోగొట్టడానికే బాబూజీ వచ్చానన్నారు. కనుక డివైన్ మాత్రమే మన గురువు.

బాబూజీవారికి లాలాజీ గురువు కదా! అన్న అభిప్రాయానికి సమాధానం చెప్పాలంటే, లాలాజీ వారు గురువు కాదు. వారొక సెయింట్, మహర్షులు. గురువు అన్నది ఒక ఆకారం – శరీరం అవుతుంది. అందులో చిక్కుకున్నవాడు గురు పశువు అవుతాడు. గురువు అనే ప్రలోభంలో, మోహంలో ఇరుక్కుపోతే అహంకారి అవుతాడు. ఇక అతనికి ముక్తి సాఫల్యం ఎలా దక్కుతుంది? బాబూజీ తమ గ్రంథాలలో దీన్ని వివరించారు. కనుక అది చదవండి.

మనమందరం బాబూజీకి చెందిన వారం. బాబూజీ ఎప్పుడూ ఎవరినీ గొప్పవాడని, తక్కువవాడని, మంచివాడని, చెడ్డవాడని అంచనా వేసేవారు కాదు. సహజమార్గ శిక్షణ, ధ్యానంపై మాత్రమే దృష్టి వహించేవారు.

మరి అటువంటి గురువు లభించడం ఎలా అంటే, ఎవరివద్ద ఉండగా ప్రశాంతత లభిస్తుందో, ఎవరి ప్రభావంవలన

మనలో మార్పు కలుగుతుందో – వారే మన గురువు (మన డివైన్). గురువు అంటే శిక్షకుడు. సద్గురువు అంటే శిక్షణలో సిద్ధహస్తుడు. మనకు ప్రతి ఆధ్యాత్మిక స్థితిలోనూ ఎలా ప్రోగ్రెస్ కావాలో, ఏమి చేయాలో తెలియజేస్తూ – మన పుస్తకాల్లో వివరించినట్లుగా చేయిపట్టి నడిపించి ముందుకు తీసుకువెళ్ళేవాడే సద్గురువు. సత్ అనగా ఈశ్వర్. గ్రహింపు చేసేవాడు డివైన్ పర్సన్ – దివ్య పురుషుడు (దివ్య తత్వజ్ఞుడు). అతడి ద్వారా రియలైజేషన్ అంటే దివ్య సాక్షాత్కారం కలుగుతుంది. ఆ తర్వాత అల్టిమేట్ అంటే అంతిమం (భూమా) వరకు తీసుకువెళ్ళగల శక్తి సామర్థ్యము ఎవరిలో ఉంటాయో వారే దివ్య పురుషుడు – డివైన్ పర్సన్ అవుతారు. వారివలన ఒక శక్తిలోనే – అన్ని శక్తులు కలిగేటటువంటి సామర్థ్యం సిద్ధిస్తుంది. అపుడు సాధన సఫలీకృతమవుతుంది.

బసంత్‌పంచమి ఉత్సవంలో లాలాజీ సాహెబ్ యొక్క ప్రసాదం అందరికి ఇవ్వడం జరుగుతుంది. పిల్లలు వస్తారు; వారికి ఏమీ తెలియదు. వారు ఆధ్యాత్మిక శక్తిని అంతరంగంలోకి గ్రహింపలేరు. అందుచేత వారికి లడ్డు, బూంది వంటి ఏదైనా పదార్థం పంచిపెడితే దాని ద్వారా డివైన్ గ్రేస్ – దివ్యశక్తి మహత్తు వారిలో కూడా దివ్యత్వాన్ని – డివినిటీని సమకూర్చుతుంది. అలాగే అభ్యాసులు కానివారికి కూడా ఈ దివ్యశక్తిని ప్రసాదించినట్లవుతుంది.

బాబూజీ అన్నారు – లిబరేషన్ ఈస్ లైక్ ఏ బాల్, జస్ట్ లైక్ ఎ బాల్ ఫర్ ఎ చైల్డ్.

సాల్వేషన్ ఈజ్ లిమిటెడ్; బట్ లిబరేషన్ ఈస్ ఫుల్. మోక్షమనేది తాత్కాలికం, పరిమితం. ముక్తి అనేది పూర్ణమైనది – పరిపూర్ణమైనది.

వంటకంలో ఉప్పు, కారం తదితర సామాగ్రి 'సమ'కూరి నప్పుడు రుచికరంగా ఉంటుంది. అలాగే అన్ని స్థితులు – దశలు ఆధ్యాత్మికతలో ఒనగూడినప్పుడు ముక్తి సాఫల్యమవుతుంది.

"ధ్యానంవలన ఏకాగ్రత లభిస్తుంది. దైవ చింతన, దైవ స్పృహ కలిగి ఉండాలి. దైవం మనలోనే మన అంతరంగంలోనే ఉన్నాడన్న భావన ఉండాలి" అని బాబూజీ అంటూ ఉండేవారు.

ధ్యానంలో కూర్చుని ఆలోచనలు వస్తున్నాయే, అను కుంటూ బిగించుకుని ఆ ధ్యాసలో కూర్చుంటారు. అది సరైన పద్ధతి కాదు. శ్రీ బాబూజీ మహరాజ్ సాన్నిధ్యం కొరకు, దివ్యత్వం కొరకు వేచి చూడాలి. దివ్యధారలో మునిగిపోవాలి. దివ్యజ్యోతిలో లోతుగా మునగాలి.

రోజు రోజుకు నేను చిన్నపిల్లనైపోతున్నానేమో! ఏమి వ్రాయాలో 'వారే' చెప్పి, అర్థం వివరించి నా చేయి పట్టుకుని వ్రాయిస్తున్నారు. 'వారి' ప్రక్కన కూర్చుని 'వారి' నుంచి విన్న మాటలు చెబుతున్నాను. నేను 'వారి' పుస్తకాలు చదవలేదు. ఎలా మాట్లాడుతున్నానో! అది తెలుసుకోవాలనీ లేదు.

ఒకసారి నేను, వరదాచారిగారు బాబూజీవద్ద కూర్చుని ఉండగా జరిగిన ఓ సంఘటన వివరిస్తాను. ఒక అభ్యాసి తన సోదరునితోపాటు బాబూజీవద్దకు వచ్చాడు. ధ్యానంలో కలిగిన

తన అనుభూతిని ఆ కండిషన్ గురించి వివరించాడు. తన సోదరుని పరిచయం చేస్తూ, "ఇతడు ఆర్య సమాజ్ సభ్యుడు. గాడ్ ఈజ్ ఫ్రాడ్ (దేవుడు మోసగాడు) అని అంటాడు. మన సాధనలవీ రుచించవు ఇతగాడికి" అన్నాడు. బాబూజీ మౌనంగా ఉండిపోయారు. కాసేపయాక ఆ ఆర్య సమాజ సభ్యునితో "నీవు దేవుణ్ణి దగా అంటున్నావు కదా! దేవుడున్నాడని నేననలేదు. దేవుని యొక్క ఉనికి ఉన్నట్లుగాను, దగా అబద్ధం అంటున్నావు. కనుక నీవు అంగీకరించినట్లు నీ మాటల్లోనే ఉంది కదా!" అతగాడి మాటల్ని ఎదురు త్రిప్పిన బాబూజీ చమత్కారం చూశారా!

"మీరు పూజ చేస్తారు కదా! అందులో హవనం చేస్తారా" అని అడిగాడు. హవనం అంటే హెూమం చేసేప్పుడు పూజాదికాల్లో అగ్నిలో సమిధలు ప్రేల్చడం అంటే కాల్చడం వంటిది. బాబూజీ దానికి సమాధానంగా "ఆc చేస్తాం. కాని బాహ్యంగా కాదు అంతరంగంలో. అగ్నిలో కాదు. దైవ ప్రేమకైన 'తపన'తో ఉద్భవించే అగ్నిలో, ప్రేమాగ్నిలో హవనం జరుగు తుంది" అన్నారు. అంటే ధ్యానం సాగేటప్పుడు ఆధ్యాత్మికోన్నతికి ప్రతిబంధకాలుగా ఉన్నవన్నీ ఆ ప్రేమాగ్నిలో దహించబడి పోతాయి, కాల్చివేయబడతాయి – అన్నమాట. అప్పుడు అక్కడే ఉన్న వరదాచారిగారు "ఆ ఆర్య సమాజ్ సభ్యుని దృక్పథాన్ని బాబూజీ ఒక్క చూపుతో ఒక్క క్షణంలో మార్చివేయగలరు చూడండి" అని అన్నారు.

విచిత్రంగా ఆ మరుసటి రోజు ఆ ఆర్యసమాజ్ వ్యక్తి బాబూజీ వద్దకు వచ్చి పాదాలనంటి నమస్కారం చేసి తనకు

సిట్టింగ్ ఇమ్మని, పూజ చేస్తానని అడిగాడు. అప్పుడు వరదాచారి గారు "చూశారా బాబూజీ! మీరు జయించారు. మీరు క్షణంలో అతనిలో మార్పు తేగలిగారు. నా మాట నిజం చేశారు" అన్నారు.

దానికి బాబూజీ మహరాజ్ "ఫతేఘర్ రామచంద్రజీ అనుగ్రహం ఉంటే అటువంటి అద్భుతం జరుగుతుంది. ఈ షాజహాన్‌పూర్ రామచంద్ర కాదు అలా చేసింది" అన్నారు.

సాక్షాత్ పరమశక్తి స్వరూపుడైన శ్రీ బాబూజీ మహరాజ్ కూడా తమ గురువుపట్ల వినమ్రత, విధేయత ప్రకటిస్తూండగా ఆ మహిమంతా తమ గురుదేవులదేనన్న అర్పణభావం వారి అనన్య గురుభక్తికి తార్కాణం. అలా అంటూనే "నేను – ఈ రామచంద్ర సమర్థ సద్గురు శ్రీ రామచంద్రజీ వారి సేవకుడను మాత్రమే" అనీ అన్నారు.

ఈ సంఘటనను పరిశీలిస్తే మనం గమనించి గుర్తించవలసిన ముఖ్యాంశం ఇందులో ఇమిడి ఉంది. సంయమ నియమాలతో (సాధనతో) సాధించబడలేనిది ఒక మహర్షి, సెయింట్ యొక్క 'ప్రేమ'తో మనకు 'అది' ప్రాప్తమవుతుంది. (బాబూజీ వారి అనుగ్రహం పొందగలిగేట్లయితే, వారి ఒక కొనగంటి చూపుతో దేన్నయినా మనకు ప్రసాదించడం జరుగుతుందన్నమాట)

దీనినిబట్టి మనం నేర్చుకోవలసిందేమంటే సహజ మార్గంలో ఉన్న మనం – నిత్యజీవితంలో ఎలా వ్యవహరించాలో, ప్రేమతో ఎలా ప్రవర్తించాలో, పిన్న పెద్దలతో, ఇరుగు

పొరుగులతో సఖ్యత సాత్విక ప్రవర్తన ప్రేమభావంతో ఎలా ఉండాలో మహర్షులనుంచే నేర్చుకోవాలి.

ఒకసారి బాబూజీ మహరాజ్ విదేశాల నుండి తిరిగి వస్తూ మద్రాసు చేరుకున్నారు. అభ్యాసులు ఘనంగా స్వాగతపు ఏర్పాట్లు చేశారు. అందులో భాగంగా ఒక ఘనమైన పుష్పహారం వారికి సమర్పించ నుద్దేశించారు. బాబూజీ దానిని చూసి – తాను దానిని మోయలేనని వలదని వారించారు. అందుకు ఆ అభ్యాసి నిరుత్సాహపడి "ఈ పుష్పమాల చాలా ఖరీదైనది బాబూజీ!" అని వేడుకోగా బాబూజీ ఆ అభ్యాసీతో "అయ్యో! అంత ఖరీదైనదా! అయితే దీనిని నీవు ఇంటికి తీసుకుపోయి భద్రపరుచు. దానిలోని పుష్పాలు వాడిపోనంతవరకు రోజూ కొన్నింటి చొప్పున స్త్రీలను ధరించమని చెప్పు. ఆ విధంగా నీవు చేసిన ఖర్చు వృధాపోకుండా సద్వినియోగమై – ఆదా చేసినట్లవుతుంది" అన్నారు. అంతేగాక అక్కడే ఉన్న సులోచనను ఉద్దేశించి "ఒకవేళ నేను ధరించిన ఈ పుష్పాలు నీవు అలంకరించుకోవడమెలాగని సందేహించుతావా? వద్దు. నేనసలు వాటిని స్పర్శించనేలేదు. దాని చుట్టూ ఉల్లిపొర కాగితం ఉంది కదా" అన్నారు. ఆ విధంగా సాదా జీవనాన్ని, పొదుపు మార్గాన్ని బోధించినట్లయింది కదా!

బాబూజీ తమ పరిశోధనలో అంటే రీసెర్చ్‌లో భాగంగా ఈ కస్తూరిని తయారుచేసి తీర్చిదిద్దారు. తమ వాణి, (వారి ఆ సత్య వాక్కు వినిపించినప్పుడు) ఒక్కటయితే మరి ఇప్పుడు 'అనేకం' ఎలా అయ్యాయి? అదే 'వారి' గొప్పదనం. 'వారు'

అనంత శక్తి నుండి వచ్చారు. లాలాజీ 'వారి'ని అవతరింపచేశారు. ఆ అనంతశక్తిలోని ఒక్క బిందువుతో ఈ అనంతాన్ని సృష్టించగలరు! ఆ అనంతశక్తిలో మనమూ, ఈ విశ్వమూ అంతా ఇమిడి ఉన్నాయి. ఈ ప్రపంచంలో ఎన్నో అవాంఛనీయ సంఘటనలు జరగుతున్నాయి. అయినా ఆధ్యాత్మిక విశ్వాసం సడలరాదు. ఇది నా దృఢ విశ్వాసం.

కనుక సహజమార్గ అభ్యాసులందరూ ఈ విధానాన్ని అర్థం చేసుకొని మనలో ఉన్న దివ్యత్వాన్ని విశ్వాసంతో, ప్రేమతో, భక్తితో ఆరాధించాలి, ధ్యానించాలి.

సక్సెస్ –విజయం అన్నది బాబూజీయే చేకూర్చుతారు. మనలో ఉన్న ఆ దివ్యజ్యోతిని అందరిలోను ప్రజ్వలింపజేయాలి. మన ప్రయత్నమంతా దివ్యంతోను (డివైన్‌తోను) బాబూజీతోను ముడిపడి ఉంది. సాఫల్యం అంతా అక్కడి నుండే లభిస్తుంది.

బాబూజీ మహరాజ్ శతాబ్ది జయంతి ఉత్సవాలకు అలహాబాద్ వాస్తవ్యులు, ప్రశిక్షకులూయైన శ్రీ చంద్రికా ప్రసాద్‌గారు అధ్యక్షత వహించారు. ఆ రోజు అనగా 14.11.1998న సోదరి కస్తూరిగారు వేదిక నుండి ఇచ్చిన ప్రసంగధార.

మన బాబూజీ రామచంద్రజీ చంద్రులు కాగా చంద్రికా ప్రసాద్‌గారు – ఆ చంద్రులకు చంద్రికలు. అంటే వెన్నెల వెలుగు. శ్రీ బాబూజీ మహరాజ్‌ను శ్రీ చంద్రికా ప్రసాద్‌గారు ప్రేమించారు. బాబూజీగారి ప్రేమ సాగరంలో మునిగారు చంద్రికా ప్రసాద్‌గారు.

శ్రీ బాబూజీ మహరాజ్ జన్మ శతాబ్ది వర్ష సమారోహ్ సందర్భంలో అందరికీ 'వారి' ప్రేమ, 'వారి' 'దర్శనము' కలగాలని, దానితో అందరి జీవితాలు ధన్యత నొందాలని నా ఆకాంక్ష. నాలో ఏ కండిషన్ అనుభూతమౌతుందో అదే కృప అందరికీ లభించాలని నా ప్రార్థన. 'వారి' సమక్షంలో (బాబూజీ జన్మ దిన సందర్భంగా 'వారు' ఇక్కడే మన ఎదుటే ఉన్నారన్న అనుభూతిలో) 'వారి'ని గురించి మాట్లాడడం అంత సులభతరం కాదు. కాని ఒక ప్రశ్న ఎప్పటినుండో జనం అడుగుతున్నారు.

"సహజమార్గ విధానంలో ఉన్న మంచి ఏమిటి? దాని ప్రత్యేకత ఎలాంటిది? అనేక ఇతర సాధనా మార్గాలున్నా మీరు ఈ సహజమార్గ విధానమే శ్రేష్టమైనదనీ, దివ్యమైనదనీ ఎలా చెప్పగలుగుతున్నారు? అనేది వారి ప్రశ్న.

వారి ప్రశ్న సరైనదే కాని, వారి ఆలోచన సరైనదికాదు. ఎన్ని రకాల సాధనా మార్గాలున్నా, ఎన్ని సంస్థలు ఉన్నప్పటికిన్నీ, వాటి అన్నింటిలోనూ ఈశ్వర ప్రాప్తి ఎంతవరకు సమకూరుతూ వుందన్న వాస్తవాన్ని నేను నా బాల్యం నుండే గ్రహిస్తూనే వచ్చాను. వాటిలో భగవంతుని నామం ఉచ్ఛరించడం, పుస్తకాలు చదవటం షుమారు అన్ని సంస్థల విషయంలోనూ ఇదే అని నేను స్థూలంగా తెలుసుకున్నాను.

మనం రామాయణం చదువుతున్నాం. దానివలన కొంత ఆనందం కలుగుతుంది. కాని ఆ ఆనందం రామాయణం పారాయణం చేసినంతసేపటివరకే పరిమితమవుతుంది. కొంత సుఖం, కొంత మంచి అనిపిస్తుంది. ఏ రోజునైతే రామాయణ

పఠనం జరగలేదో ఆ రోజు పూజ జరగలేదే అని, మనసు ఆందోళన పడుతుంది. ఆ విధంగా పుస్తక పఠనంలోగాని, కీర్తనలు ఆలపించడంలోగాని, వినడంలోగాని కలిగే ఆనందం కొంతవరకే పరిమితమై ఉంటుంది. నా స్వానుభవంలోకి వస్తే రామాయణం చదవడం ప్రారంభించాక రామాయణమే చదువుతూ ఉండాలనిపించేది. బాబూజీ మహరాజ్‌పట్ల నా మనసు ఆకర్షితమవటం జరిగాక వారి బోధనలవలన నాకు జ్ఞానోదయమైంది. ఎపుడైనా అస్వస్థతగా ఉండి రామాయణ కథ పారాయణంచేసే అవకాశం కలగకపోతే – అయ్యో! ఈ రోజు పూజ కావించలేదే అని బాధ చెందుతూ దానిని గురించి మననం చేసుకునేదాన్ని. అంతకుముందు మా తండ్రిగారు సహజమార్గం గురించి చెబుతూండేవారు. దానిలో ధ్యానం గురించిన మహత్తును వివరిస్తూ ఉండేవారు. శ్రీ బాబూజీ మహరాజ్‌తో పరిచయమయ్యాక అభ్యాసిగా మారి పూజ, ధ్యానంలలో ఉన్న తేడాను గుర్తించాను. పూజలో ఉన్న ఆనందం మనం ఎంచుకున్న గ్రంథాలమీదనో, పాటల మీదనో ఆధారపడి ఉంటుంది. బాబూజీ మహరాజ్ ధ్యానం చేయమని చెప్పలేదు. ధ్యానం ఉంచు – ధ్యానం నిలుపుకో (ధ్యాన్ రఖో) అని చెప్పారు. దేనిపైన ధ్యానం ఉంచాలి – దేనిపైన ధ్యానం నిలుపుకోవాలంటే, 'దివ్య జ్యోతి' – దివ్యత్వం (డివైన్) నాలో నా హృదయంలో ఉంది అనే తలంపుతో. దానివలన మన ఈ సిస్టమ్ అంతా ప్రకాశితమై ఉంటుంది. మన హృదయంలో డివైన్ – దివ్యత ఉంది. మన హృదయంలోనే దివ్యతేజః కాంతి ఉంది. ప్రతి సంస్థలోను దీపాలు

వెలిగించినపుడు చాలా జ్యోతిర్మయంగాను, శోభాయమానంగానూ ఉందనిపిస్తుంది. కాని బాబూజీవద్ద సహజమార్గ విధానంలో వెలిగే దీపకాంతితో – నా చిన్నతనం నుంచీ నేను చూసినటువంటి ఏ దీపకాంతి కూడా సరితూగినట్లు అనిపించలేదు. దానిలో కాంతి తగ్గలేదు. ఎందువలన? మనం చూసిన ఆ వెలిగించిన ఆ దీపకాంతి అంతసేపు మాత్రమే మనోరంజకంగా ఉంటుంది. అంతవరకే మన హృదయంలో నిలిచి ఉంటుంది. కాని డివైన్ లైట్ – దివ్యత్వంతో కూడిన కాంతి అవడంవలన హృదయంలో నిలిచిపోయి శాశ్వతంగా ఉంటుంది. అది నిత్యమై నిఖిలమై (అంతటా) ఉంటుంది.

శ్రీ బాబూజీ మహరాజ్ యొక్క సహజమార్గ సౌందర్యం, ఆధ్యాత్మిక విశిష్టత ఎలాంటివంటే, అందులో ఈశ్వర దర్శనం అనగా భగవత్ సాక్షాత్కారంకంటే కూడా ఈశ్వరీయ మిలన్ – భగవదైక్యం, ఈశ్వరునితో యోగమందడమే ప్రాథమిక ప్రమాణమని వారన్నారు. రెండవ విషయం ఏమంటే, దానికి పరిపూర్ణతను సిద్ధింపచేయటానికి ధ్యానంలో 'శక్తి'ని ప్రవహింప చేశారు. పసిపిల్లవాడు దారి తప్పినా తల్లి ఆ పిల్లవానిని వదిలి ఉండనట్లే త్రోవ తప్పిన అభ్యాసీని కూడా బాబూజీ వదిలేసి ఊరుకోరు. తన నిర్దేశిత కార్యాన్నుండి 'వారు' ప్రక్కకు తప్పుకోలేదు. ఒక్క క్షణం కూడా తన పనిని వదిలి ఉండేవారు కాదు. అలాగే మనం ధ్యానాన్ని విడువరాదు.

శ్రీ బాబూజీ మహరాజ్‌కు నేను నా కండిషన్స్ గురించి వ్రాస్తూండేదాన్ని. ఒక్కోసారి ఒక దశకు చేరాక ఆ దశకు (ఆ

స్టేజ్‌కు) సంబంధించిన విశాలమైన ఏమీలేని ఎడారి నుండి నేను ముందుకు సాగగలనా లేక నిలిచిపోతానా – అని సందేహం వెలిబుచ్చేదాన్ని. అలా వ్రాసిన జాబు పూర్తికాగానే, ఆ రాత్రే నాకు సమాధానం లభించేది. అనగా నా అంతరంగంలో 'వారి' వాణి విన్నట్లుండేది. "నీ అంతరంగంలో కొంత వెయిటింగ్ (నిరీక్షణ) ఉంటుంది. ఆ తర్వాత మళ్ళీ నీ అన్వేషణ ప్రారంభమవుతుంది" – అని చెప్పినట్లనిపించింది.

నేను వ్రాసిన జాబుకు, జవాబుగా వ్రాస్తూన్న వారి ఉత్తరం పూర్తయిందో లేదో గాని – నేను మళ్ళీ ఉత్తరం వ్రాశాను. ఇది వారికి చేరిందో లేదోగాని, ఆ వెంటనే నా సందేహాన్ని అధిగమించే శక్తి నా ఎదుట నిల్చినట్లయింది. అందువలన సహజమార్గం సశక్తి సాధన. సహజమార్గం మనకు ఒక గొప్ప లక్ష్యం ఇచ్చింది. ఇతర మార్గాలలో ఇలాంటిది ఎక్కడా లేదు. మీరాబాయి, సూరదాసు మున్నగువారి లక్ష్యం ఎంతవరకూ భగవత్ సాక్షాత్కారం వరకే పరిమితమైంది. అంతకుమించి ఇంకా ముందున్న విషయాన్ని (లక్ష్యాన్ని) గురించి ఎవ్వరూ వ్రాసి ఉండలేదు –చెప్పలేదు. బాబూజీ చెప్పారు – "ఈశ్వరునిలో లయమైపోవటం జరగాలని నేను చెబుతున్నాను" అని. అయితే మనలో వెంటనే ప్రశ్న ఉదయిస్తుంది. ఈశ్వరునిలో – భగవంతునిలో కలిసిపోవడం ఎవరికి సాధ్యం? ఎలా? – అని. బాబూజీ మహరాజ్ ఎక్కువగా మాట్లాడేవారు కాదు. కేవలం ఒక్క వాక్యం మాత్రమే చెప్పేవారు. అదేమంటే "సమయం వచ్చినపుడు అంతా చూస్తారు" అని.

నా ముందు శ్రీ బాబూజీ రూపంలో ఆధ్యాత్మిక సౌందర్యం పరచుకుని ఉండగా 'వారు' ఒక మార్గదర్శిలా ముందు ఉన్నారు.

ఒకానొక సందర్భంలో ఒకరు ప్రశ్నించారు – "ఆధ్యాత్మికతలో హృదయ మండలం, హిరణ్యగర్భస్థితి దాటి ఋషులు, సెయింట్స్ దాటి వెళ్ళలేకపోయారు. అయితే సహజమార్గంలో బాబూజీ మహరాజ్ సెంట్రల్ రీజియన్ –కేంద్ర మండలానికి ఎక్కువ ప్రాముఖ్యత నిచ్చారు. దాని జాడ ఎక్కడా కనిపించడం లేదేమిటి?'' అని. దానికి జవాబుగా ఇది చెప్తున్నాను.

ఒక రోజున ఒక పుస్తకం వ్రాయాలన్న భావం నా మదిలో మెదిలింది. దానిని వ్రాయడానికి నేను అనుసరించిన పద్ధతి ఏమిటంటే, మొదట ఏ యే ఆలోచనలు వస్తాయో వాటిని నోట్ చేసుకున్నాను. ఎవరైతే ఈ ఆలోచనలు కలిగించారో వారే తప్పక కలంపట్టి వ్రాయిస్తారన్న నిశ్చయభావం కలిగింది. ఇక దానిలో విలంబన జరిగేది కాదు. స్నానం చేస్తున్నా, వంట చేస్తున్నా, బట్టలుతుకుతున్నా కూడా ఆ పనులు ముగియడం లేదా త్వరగా ముగించుకోవడం తరువాయి వచ్చిన భావాలను వ్రాయటం జరిగేది. అలా వంట చేసేటప్పుడు కూడా – అక్కడే వ్రాయడం జరిగేది. ఒక్కోసారి చేసే పని ఆపివేసి కూడా కలం పట్టుకుని కూర్చునేదాన్ని. ఎందుకంటే, బాబూజీ మహరాజ్ మనతో ఏదన్నా వ్రాయించాలనుకుంటే మరి వ్రాయడం కూడా వారే నేర్పవలసి ఉంటుంది కదా! ఒకసారి ఒక ప్రశ్న ఎదురైంది. నాకు తెలియనిదాని జవాబు నా కలం వ్రాయడం గమనించిన నాకు

ఆశ్చర్యం కలిగింది. సెంట్రల్ రీజియన్ గురించి వారు వ్రాయించిన దానినిబట్టి అక్కడి విషయం తెలిసింది. సెంట్రల్ రీజియన్‌లో ప్రవేశించడం, దాని మహత్తు అంతా కూడా వారు కలం ద్వారా వ్రాసి చూపించారు. లేకపోతే నాకెలా అర్థం అయ్యేది? దానిని చదివితేనే సెంట్రల్ రీజియన్ యొక్క మహిమ, ప్రాముఖ్యత మరియు బాబూజీ యొక్క పరిశోధన – అంతా తెలుసుకోగలిగాను. భూమా కేంద్రం నుంచి మహత్తర శక్తి సమన్విత వ్యక్తిగా బాబూజీని లాలాజీ సాహెబ్ అవతరింపజేశారు కనుక సెంట్రల్ రీజియన్ యొక్క మహత్తును, దాని వైభవాన్ని వెల్లడించడానికి ఒక్క బాబూజీకే సాధ్యమవుతుంది – సుసాధ్యమైంది. 'వారు' ప్రాణిమాత్రుల కొరకే కాదు, సమస్తం కొరకు వచ్చారు.

ఏదైనా విషయం, ఏదైనా శక్తి లేదా ఏదైనా కండిషన్ నాలో కలిగినప్పుడు నాకు తెలియకుండానే నా అంతరంగంలో స్వయంగా ప్రార్థన జరుగుతూ ఉండేది. "తమ రచనల్లో సాధన చేస్తూపోతే మమత కరిగిపోతుందని అందరూ వ్రాస్తూండగా, నాలో సాధనవలన మమత పెరిగిపోతోందనిపిస్తోంది" అని బాబూజీకి జాబు వ్రాశాను.

దానికి బదులుగా బాబూజీ "అది లాలాజీ సాహెబ్ యొక్క ప్రేమ, ఆశీర్వాదం. అందరిలోనూ మమత పెంచడమే లాలాజీ వారి ప్రయత్నం" అని వ్రాశారు. కుటుంబ సభ్యులపట్ల ఉన్న మమత వేరుగా ఉంటుంది. కాని ఆధ్యాత్మికంగా దాని దృక్పథంలో

మమత అందరిపట్ల ఒకే రకంగా ఉంటుంది. నాకు ఏది లభిస్తుందో అది అందరికీ లభించాలి. నాలో ఏ కండిషన్స్ కలుగుతాయో అవి అందరిలోనూ కలగాలని నేను కోరితే అవి అలానే కలుగుతాయని చెప్పగల ధీమా, అధికారం నాకు ఉంది. కాని ఈ అధికారంలో బాబూజీ కృపయే ఇమిడి ఉంది.

నూరురెట్ల దివ్య సౌందర్య తేజం, దివ్యశక్తి వర్షించే దినం ఈ రోజు. ఈ జన్మ శతాబ్ది సమారోహనందు నేను నా ప్రేమను జోడించి అభ్యాసీ సోదర సోదరీమణులకు ఏ కానుక సమర్పించాలి, అని బాబూజీని ప్రార్థించాను. దాని ఫలితంగా బాబూజీ వ్రాసిన వ్యాసంతోపాటు ఈ జన్మ శతాబ్దిని గురించిన నా వ్యాసం కూడా కలిపి, పొందుపరచిన ఈ చిన్ని పుస్తకం మీకు కానుకగా ఇస్తున్నాను.

ఆశ్చర్యకరమైన విషయం ఏమంటే, శతాబ్ది వర్ష్ అనే మాటను వింటూన్నా కూడా దాని అర్థం స్ఫురించలేదు. దాని అర్థం ఏ పుస్తకంలోనూ వ్రాయబడలేదు. **శతాబ్దిని విడదీసినట్లయితే శత్ + అబ్ + ది అని కదా వస్తాయి.** అయినా వీటిని ఎంత తరచినా కూడా అర్థం స్ఫురించలేదు. అర్థం చేసుకునే శక్తి ఎక్కడిది? అప్పుడు బాబూజీ కృపతో వెంటనే తట్టింది. **శత్ అనగా నూరు - నూరు రెట్లు. అబ్ అనగా సౌందర్యం - దివ్య సౌందర్యం. ది అనగా ఇచ్చువారు అని. అనగా నూరురెట్లు దివ్య సౌందర్యాన్ని ప్రదానం చేయువారు అని అర్థం అన్నమాట.** కనుక మనం ఇక్కడి నుండి వెళ్ళేప్పుడు ఇతరమైన ఇలాంటి

ఉత్సవ సమయాల్లో పొందే దివ్యత్వానికన్న నూరురెట్లు దివ్య సౌందర్య తేజాన్ని, దివ్యశక్తిని వెంటతీసికొని పోతున్నామన్నమాట. ఈ కారణంగా దివ్యత్వాన్ని వితరణ చేయటమే బాబూజీ మహరాజ్ సంకల్పం.

ఏ సంస్థలోనైనా ముఖ్యవిషయంగా ఒక 'లక్ష్యం' ఉంటుంది. బాబూజీ ఏమి చెప్పారంటే, సహజమార్గ విధానంలో నేను మిమ్మల్ని ధ్యానంలో ఉండే ప్రయత్నం చేయమని చెప్పను. కేవలం ఈశ్వరుడు మీవాడే అనే భావం, ధ్యాస కలిగి ఉండ మంటాను. ఆ ధ్యాసలో మీరెంత సన్నిహితంగా – సామీప్యంగా ఉంటే ఈశ్వరుడు అంతగా సన్నిహితుడై ఉండి – మీ లక్ష్యం నెరవేరుతుంది. మరెన్నటికీ మీరు ఆయనకు దూరం కాలేరు.

మన సాధనకు లక్ష్య నిర్దేశంచేసి, ఆ లక్ష్యాన్ని సమకూర్చేవారు, సాధనను పూర్తిచేయగల 'సాధ్యం' బాబూజీగా మన సమక్షంలో ప్రత్యక్షమై ఉండడం మన అదృష్టం. ఇది ఎంతటి మహిమాన్వితమో ఊహించండి. బాబూజీ నెలకొల్పిన సహజమార్గ విధానం 'వారి' మాటల యదార్థాన్ని, దృఢత్వాన్ని, పరిపూర్ణతను సిద్ధింపజేస్తూ ఉంటుంది.

ఈశ్వర దర్శనం – ఈశ్వర ప్రాప్తి – అనంత ప్రాప్తిని పొందదానికి శ్రీ బాబూజీ మహరాజ్ ప్రాణాహుతి ద్వారా మనల్ని అర్హులను చేస్తారు. అనుక్షణం 'వారి' అనుగ్రహ వీక్షణం మనపై ఉంచి కాపాడుతూంటారు.

ఈ సహజమార్గం ప్రపంచమంతటా రాజ్యమేలుతుంది. ఆధ్యాత్మికత కొరకు తన పేరు సార్థకం చేసుకుంటుంది.

సహజమార్గ విధానంలో అభ్యాసీ అనగానే మన పేరు కూడా అందులో కలిసి ఉంటుంది. మన మెంతటి సౌభాగ్యవంతులమో కదా! బాబూజీ సహజమార్గ విధానాన్ని మన ముంగిటికి తీసుకవచ్చారు. దానిని మానవాళి కొరకై ప్రవేశపెట్టారు. దానితో మనకు సంబంధం ఉంది. ఇప్పుడే కాదు – ఎల్లప్పుడు ఉంది, ఉంటుంది. దాని నుండి దివ్య వైభవాన్ని, దివ్యశక్తిని పొందుతూనే ఉంటాం. నేను కోరుకుంటూన్నది ఒక్కటే – ఏ అభ్యాసీకైనా సరే, ఎల్లవేళలా నేను సేవ చేయగలిగి ఉండాలి. ఆధ్యాత్మికంగా ఒకరు పైకి ఎదుగుతున్నారంటే క్రింద ఉన్న వాళ్ళు వెనుకబడిపోయినందుకు వారు చింతిస్తూ ఉంటారు. అందుకని అందరూ కలిసి గమ్యం చేరాలి. మనకు కలిగే ఆనందాన్ని అందరం కలిసి ఆనందించాలి. నేను బాబూజీ నుండి దీనినే నేర్చుకున్నాను. నేను ఆధ్యాత్మికంగా ముందుకు సాగిపోతున్నాను. అంటే నా వెనుక ఉన్న వారిని కూడా – "మీరూ రండి, మీరూ రండి! గమ్యం ఎంతో దూరం లేదు" అని ప్రోత్సహించుతూ ఉంటమే. ప్రతి శబ్దమూ సాత్వికంగా ఉండాలి. శబ్దాడంబరమే కాదు. దానిలో దివ్యత్వం ఉండాలి. దివ్య సౌందర్యం ఉట్టిపడాలి. దివ్యశక్తి ప్రవహిస్తూ ఉండాలి.

అనంతం (అంతిమం) నుండి అనంతశక్తితో అవతరించిన బాబూజీ యొక్క శక్తితో సహజమార్గం సశక్తియుతమై ఉన్నది. ఈ మన సహజమార్గ విధానం ప్రపంచమంతటా వెల్లువలా ప్రసరించాలి. సహజమార్గంతో మనం సంబంధం కలిగి ఉన్నాము

కనుక అది ఎక్కడ ఉన్నా మనమక్కడ ఉన్నామన్న మాటే! సహజమార్గంలో మన సఖ్యత, పట్టుదల – బాబూజీ శక్తితో ఎల్లప్పుడూ వికసిస్తూ అందరినీ ముందుకు తీసుకు వెళ్ళడానికి, సర్వదా సఫలీకృతమవుతాయి. ఈ సహజమార్గానికి ఎవరు అనుసంధానమై ఉంటారో – వారికి నేను నివేదించేదే మంటే వేలు, వేలకు వేలు సూర్యులుగా ఈ ప్రపంచంలో ప్రకాశిస్తారు. ఈ సహజమార్గ ఆకాశంలోని సూర్య తేజస్సుతో సృష్టిలోని అంధకారం ఎక్కడా నిలవకూడదు. ఒకసారి బాబూజీ చెప్పారు కదా – "నేను ప్రతి అభ్యాసీ ఒక సూర్యుడు కావాలని కోరుకుంటాను" అంటే ఈశ్వరీయ జ్ఞాన సూర్యతేజంతో భాసిల్లి ఈ సహజమార్గ విధానంలో ప్రకాశించాలని 'వారి' కోరిక. అదే ప్రకారం జరిగింది– జరుగుతోంది – జరుగబోతోంది కూడా! 'ఆయన' సర్వస్వమూ మనకు ఇచ్చి మన నుంచి బాబూజీ తిరిగి కోరుకున్నదేమంటే – మనమంతా ఏకత్రితమై (ముప్పేటగాయై) ఒక్కటై వారి కోరిక తీర్చాలని. కనుక వారి అభీష్టం నెరవేర్చడానికి పాటుపడదాం. ఈ సహజమార్గమనే ఈశ్వర జ్ఞాన సూరీడు ప్రపంచమంతటా వెలుగు వెదజల్లడానికి కృషి సల్పుదాం. ఇదే నా ప్రార్థన.

అది సాధించడానికి ఇదే నా ప్రార్థన. మీరంతా వారి ప్రేమలో మెలగాలి. మీ ప్రేమను వారిలాగే అందరికీ పంచి ఇవ్వాలి. వెనుకబడిన వారిని కూడా మీతోపాటు రమ్మని ప్రోత్సహిస్తూ ఉండాలి. సహజమార్గంలో చేరే వారందరూ ఈ భావాన్ని కలిగి ఉండాలని నా విన్నపం. ఎవరిని చేర్పించుతూ

వెళ్ళినా వారందరిలో ఈ ప్రబల ఆకాంక్ష ఉండాలి. అందరికీ పవిత్రత, శక్తీ – ఏమి కావాలంటే దాన్ని ఈ పవిత్ర నీరాజనం సమకూర్చుతూ ఉంటుంది. సహజమార్గం గురించి పూర్తిగా చెప్పాలంటే అది ఎవరికీ సాధ్యపడని విషయం. అయినా అన్నింటినీ మించిన ముఖ్య విషయం ఏమంటే బాబూజీ సెంట్రల్ రీజియన్ గురించి జరిపిన అన్వేషణ. ఇది భూమా యొక్క శక్తివంతమైన క్షేత్రం – దీనినే వారు వెల్లడి చేశారు.

"ఇంత సామాన్యంగా ఉన్నటువంటి వ్యక్తి, అంతిమం నుంచి – అనంతం నుంచి నేను అవతరింపజేసిన ఈ దివ్యమూర్తి (డివైన్ పర్సనాలిటీ) యొక్క చరణాలు ఎప్పుడూ విడువకండి" అని సమర్థ గురుదేవులు శ్రీ లాలాజీ మహరాజ్ సందేశం ఇస్తున్నట్లుగా ఉంది ఇప్పుడు.

ప్రతి అభ్యాసీ సెంట్రల్ రీజియన్ అనగా కేంద్ర మండలం లోనికి అడుగుపెట్టాలని నాయొక్క అభిమతం. నా ఈ మొర ఆలకించాలని బాబూజీ వారిని వేడుకోగా – వారు అంగీకరిస్తూ ఉన్నట్లుగా నా అంతరంగంలో తెలియజేశారు.

## శ్రీ చంద్రికా ప్రసాద్‌గారి ప్రసంగం

కస్తూరి బెహెన్ నాకిచ్చిన గౌరవానికి నేను హృదయ పూర్వకంగా ఋణపడి ఉన్నాను. నేను సహజమార్గం తోను, బాబూజీతోను, కస్తూరి బెహెన్‌తోను సంబంధం కలిగి ఉన్నాను. నేను శ్రీ బాబూజీ మహరాజ్‌తో కొంతకాలం కలిసి ఉన్నాను. బాబూజీని మనమెంతగా ప్రేమిస్తామో అంతగానూ వారు మనల్ని

ప్రేమించేవారు. వారితో కలిసి ఉండటం, వారి ప్రేమ పొందటం నా అదృష్టం. అదే ప్రేమ మన కస్తూరి బెహెన్ నుంచి కూడా లభిస్తుంది. నేను రూర్కీలో ఉన్నప్పుడు కస్తూరి బెహెన్ మోడీనగర్‌లో ఉండేవారు. అది అంత దూరం కాదు. మాకు అవసరం పడినప్పుడల్లా అనగా చిన్న చిన్న ఫంక్షన్‌లు జరుపు కుంటున్నప్పుడు  మేము ఆమెను ఆహ్వానించటం జరుగుతూ ఉండేది. ఆమె మా ఆహ్వానాన్ని మన్నించి హాజరవుతూ ఉండేవారు. ఆమె రాక మాకందరికీ లాభదాయకాన్ని కలిగించేది. ఆమెను గురించి బాబూజీ 'సంత్' (సెయింట్) అని వ్యాఖ్యానించే వారు. ఆ మాట అక్షరాలా నిజం. ఆమె బాబూజీ వలెనే తన ప్రేమను మనందరిపైన కురిపించారు. నేటికీ కురిపిస్తూనే ఉన్నారు. నేను లక్నో ఈ సందర్భంగా రావలసి వచ్చినప్పుడు, ఆమె నుంచి దివ్యశక్తిని పొందవచ్చుననే ఆశతో వచ్చాను. అలాగే పొందాను. ఇక్కడ గుమికూడిన అభ్యాసులందరూ కూడా ధ్యానమగ్నులై ఆమె ప్రదానంచేసే ప్రాణాహుతిని పొందాలని నా అభిలాష. ధన్యవాదాలు.

**తిరిగి కస్తూరిగారు తమ ప్రసంగంలో ఇలా చెప్పారు:**

బాబూజీని, వారి ఫంక్షన్‌కు చూడటానికి వచ్చినవారు ఏదో ఒకటి ఆయన ఉన్నా లేకపోయినా పొంది వెళ్ళేవారు. వచ్చిన వారి కోరికలు వివిధ రకాలుగా ఉండవచ్చు. కాని అందరికీ శక్తి, సాన్నిధ్యం లభించేవి. వారు ఏమి కోరివచ్చారో అది పొంది వెళ్ళేవారు.

**సత్యోదయం:** సత్యోదయం అన్నదానికి నిర్వచనం ఏమంటే, దానికి రాత్రి, పగలు అని తేడా లేదు. ఎందుకంటే దానికొక లక్ష్యముంది. అదే నిరంతర స్మరణ. అ లక్ష్యాన్ని సాధించేవరకు మనకు ఇరవై నాలుగు గంటలూ రేయి అనక, పగలనక అదే ధ్యాస ఉంటుంది. తపన ఉంటుంది. మీ ధ్యానం గాఢం అవుతుంది. మీ ఆలోచనలు సన్నగిల్లుతాయి. మీ ధ్యానం జరుగుతూనే ఉంటుంది.

**నిర్మలీకరణ:** మనసు నిర్మలంగా ఉండాలంటే ఏమి చేయాలని అందరూ అడిగేవారు. ఏమీ చేయాలని లేనివారికి ఏమీ చెప్పాల్సిన పని ఉండదు. చేయాలనుకున్నవారికి ఏదో ఒకటి చెప్పాలి. వారు మనిషికి ఏదో ఒకటి చేయటానికి మిష (బహానా) కల్పించారు. ఒక్కొక్కరికి ఒక్కొక్క విధానం చెప్పేవారు. బాబూజీ అన్నారు – నిర్మలీకరణమన్నది నీ హృదయంలోనే అవుతుంది. – ఇంకా కానిదేముంటుంది.

కొన్ని సందర్భాలలో తెలియజెప్పేవారు సరిగా చెప్పకపోతే అది దురుపయోగం అవుతుంది. మిషన్‌లో అభ్యాసులకు సరియైన అవగాహన వచ్చేట్లు తెలియజేయాలి. కొంతమంది ఫిర్యాదు చేస్తారు. రెండుసార్లు ధ్యానం, క్లీనింగ్ చేసుకున్నా ధ్యానంలో లగ్నం కాలేకపోయామని, అలాగే మరొకరు ఏ రోజైనా క్లీనింగ్ చేసుకోకపోతే మురికిపడిపోతామా అని అడుగుతూ ఉంటారు.

ప్రతి ఒక్కరిలోను దేవునిపట్ల శ్రద్ధ, భక్తి ఉంటాయి. దాని మూలం తెలియాలి. విధానాలు వేరు, ఇష్టాలు వేరుగా ఉంటాయి. అది మనం అర్థం చేసుకోగలిగితే ప్రోగ్రెస్ ఉంటుంది. కాని

అందరకీ, ధ్యానం చేయటం, ఆలోచనలను శుద్ధపరచడం ఒకే విధంగా ఉంటుంది. నిరంతర స్మరణ ఉంటే, ధ్యానంలో వచ్చే ఆలోచనల ప్రభావం తక్కువగా ఉంటుంది. మీలో అనవసరమైన వన్నీ తొలగిపోతాయి.

సహజమార్గ విధానంలో ఉదయం ధ్యానం, సాయంత్రం క్లీనింగ్ (నిర్మలీకరణం), రాత్రికి ప్రార్థన నియమాలుగా నిర్ణయించబడ్డాయి. ఏ నియమమూ లేకపోతే సాధనలో ఆచరణ నిర్లక్ష్యం చేయబడి లక్ష్యాన్ని సాధించటం జరగదు. వీటితోపాటు నిరంతర స్మరణ కూడా చాలా ముఖ్యం. ఏదైనా ఒక విషయాన్ని అనివార్యం అని చెప్పకపోతే జనులు ఆచరించరు. కనుక లక్ష్యం కొరకు విధి విధానాలు నిర్దేశించబడతాయి. సహజమార్గం జీవన విధానాన్ని నేర్పుతుంది. బాబూజీ చెప్పినవాటిని గ్రహించి క్రమపద్ధతిలో జీవించటం అలవరచుకోవాలి. ధ్యానం చేస్తున్నాను కాని ధ్యానం కలగటంలేదు అని ఫిర్యాదు చేసే అభ్యాసులకు బాబూజీ చెప్పారు – నేను మిమ్మల్ని ధ్యానంలో కూర్చుండ మనలేదు. ధ్యానముంచండి అన్నాను. ధ్యానముంచటం అంటే, (డివైన్) దైవం నీలోనే ఉన్నాడని, నీవెంటే ఉన్నాడని, ఆ దివ్యశక్తి నీలోనే ఉందని భావన కలిగి ఉండటమే. ఏ అనవసర ఆలోచనలు వచ్చినా వాటిని దివ్యానికి సంబంధించినవిగానే భావించితే అవి బలహీనపడి సమసిపోతాయి. ఆలోచనలు మిమ్మల్ని ముసురుకొని మీ ధ్యానాన్ని భగ్నం చేస్తున్నాయనుకుంటే వాటిని నావిగా భావించండి. అపుడు దివ్యశక్తి మీకు వలయంగా ఏర్పడి రక్షణ కల్పిస్తుంది అనే వారు బాబూజీ.

**పూజ:** బాబూజీ చమత్కారానికి, హాస్యధోరణికి కొన్ని ఉదాహరణలు వర్ణిస్తాను. ఒకసారి షాజహాన్‌పూర్‌లో బాబూజీని దర్శించటానికి వచ్చిన వారు ఇలా ప్రశ్నించారు.

"పూజ అంటే ఏమిటి?" అని. దానికి సమాధానంగా బాబూజీ ధ్యానం చేయటం, క్లీనింగ్ చేసుకోవటం, ప్రార్థన చేసుకొని నిద్రించటం అన్నారు. దానికి వారు –పూజ అంటే ఇదేనా, మేమేదో గొప్పగా ఊహించుకొన్నాం అన్నారు. అపుడు బాబూజీ చెప్పారు – అలాగయితే మీరు రాత్రి 2 గంటల సమయంలో స్నానం చేయండి. ఆసనంవేసి కూర్చోండి. టీ త్రాగవద్దు, ఏ ఆలోచనా లేకుండా మంత్రాలు వల్లించండి. పచార్లు చేస్తూ ప్రార్థన చేయండి. అప్పుడెలా ఉంటుందో చూడండి – అన్నారు.

ఈ విధంగా కాలానికి బలైపోతారు. వారికి హల్వా రుచించదు, శనగ గుగ్గిలు తినడంకంటే ఇనుప గుగ్గిలు తింటేనే తృప్తి కలుగుతుంది. అంటే సులభమైన మార్గంకంటే జటిలమైన మార్గమే నచ్చుతుంది. పుస్తకంలో ఒక ప్రశ్న ఉంటుంది. అలాగే దానికి జవాబూ ఉంటుంది. నీలో కలిగిన ప్రశ్నను మళ్ళీ మళ్ళీ ప్రశ్నించుకుంటూ ఉండు. దానికి జవాబు అదే చెబుతుంది. 'ఐ' (I) ని 'యు' (You) లో కలిపివేసుకుంటూపోతే ఇంక ప్రశ్నకు స్థావరమెక్కడ అని మర్మంగా చెప్పారు. అనగా 'ఐ' నేను అనగా అహం ఈశ్వరునిలో 'యు'లో లీనమైపోతే సాధన పూర్తయినట్లే కదా!

ఒక వ్యక్తి బాబూజీని 'అహం బ్రహ్మోస్మి' అంటున్నారు, దాని సంగతేమిటి అని అడిగాడు. దానికి సమాధానంగా బాబూజీ

“ఆ మాటల్లోనే ‘నీవు’ వేరు, ‘బ్రహ్మ’ వేరు అని ప్రకటించ బడుతున్నాయి. బ్రహ్మ అనేది అన్నింటికీ మించిన భ్రమ” అన్నారు.

ఇప్పటివరకు ఎవ్వరూ ‘బ్రహ్మము నేనే’ అని చెప్పి ఉండలేదు. ఇవి మన ఊహలకు అంచెలు. మనమెవరని అనగా ఏ శక్తి కలిగిన వారిని దృష్టిలో ఉంచుకుంటామో, మన శక్తి సాధన కూడా ఆ మేరకే ఉంటుంది. కాని ఈశ్వరుడు ఒక్కడే. ఆయన సర్వశక్తిమంతుడు. ఆయనే లక్ష్యంగా ఉండాలి.

**అంతర్వాణి (ఇంటర్ కమ్యూనికేషన్స్):** నా దగ్గరకు వచ్చిన వారు ఇంటర్ కమ్యూనికేషన్స్ (అంతర్వాణి) గురించి మాట్లాడారు. ఎప్పుడైతే ఇన్నర్ (అంతరంగం) డివైన్‌లో ప్రవేశపెట్టబడుతుందో అప్పుడు శబ్దాలు (మాటలు) అన్నీ అక్కడ నుంచే వస్తాయి. ఇన్నర్ (అంతరంగం) అనేది ‘అక్కడ’ ప్రవేశించకుండానే అక్కడి నుంచి వచ్చేది ఏముంటుంది? అన్నీ దానిలో ఇమిడ్చినపుడే అక్కడి నుంచి శబ్దం వస్తుంది. పూర్తిగా లయమైపోయినపుడు ధ్వని పలికే అవకాశమే ఉండదు – నిశ్శబ్దం మినహా. కనుక ఇంటర్ కమ్యూనికేట్ చేయడం అందరికీ సాధ్యమయ్యే పనికాదు.

బాబూజీ సూపర్ కాన్షస్ మైండ్ గురించి చెప్పారు. సాధనలో మనం ఎప్పుడైతే గాడ్లీ రీజియన్‌లో ప్రవేశిస్తామో అపుడు ఆ రీజియన్‌లో – మనలో ఏ ఆలోచనలూ కలుగవు. ప్రాపంచిక విషయాలు అక్కడ ధ్వనించవు. ఏవైనా ప్రశ్నలు మీకు వేయబడినపుడు అవి ఆ రీజియన్‌కే తగిలి దాని ప్రభావంతో అక్కడి నుండియే సమాధానం వెలువడుతుంది. మీ నోరు

మెదులుతుంది. దానికి కారణం దేవునికి మైండ్ (మనసు) లేకపోవటమే.

బాబూజీకి నేనిలా వ్రాశాను– "మీరు నాలో డివైన్ లైట్ ఉంది దానిని శోధించటంలోనే మునిగిపొమ్మన్నారు. నేను ఎంత ఆంతరికంగా వెళ్ళినా (శోధించినా) మీరే కన్పిస్తున్నారు. బాహ్యంగానూ మీరే కన్పిస్తున్నారు. మీ ప్రజెన్స్ లేకుండా ఉండాలనే తలంపు కూడా రావటం లేదు. మీరు మరి అంతరంగంలోనే డివైన్ ఉందని, దానిలోనే డ్రౌన్ కమ్మని (మునిగి ఉండమని) చెపుతూ ఉంటే నేనేమి చేయాలి" అని. దానికి సమాధానంగా బాబూజీ ఇలా చెప్పారు: "నీ హృదయంలోపల నుంచే ట్రాన్స్‌మిషన్, దివ్యధార వస్తున్నాయనుకో. ఒకవేళ నేను నీకు కన్పించినట్లయితే, ఈశ్వరుని నుండి ప్రవహించే ఆ దివ్యధార నా హృదయంలో ప్రవేశించి, నాకు ఆ దివ్యత్వాన్ని అందించే యోగ్యత కల్పించి నీ హృదయంలోకి ప్రవహింప (ట్రాన్స్‌మిషన్) చేయబడుతున్నట్లుగా భావించుకో. కనుక ఆ డివినిటీ, ట్రాన్స్‌మిషన్ అన్నీ అక్కడి నుంచే వస్తున్నట్లు భావించుకుంటే సిస్టమ్ అంతా ప్రభావితమౌతుంది" అన్నారు.

**లయావస్థ:** నా వ్రాతలోనూ, మాటల్లోనూ, అభ్యాసీల సమక్షంలోనూ, వారి హృదయాలలో ఎటువంటి ఆలోచనలూ, వారి సమయాన్ని నష్టపరచేవిగా ఉండకూడదని నా ప్రార్థన. అందుచేత సాధన విషయంలో ప్రశ్నోత్తరాలు, మనం ఎలా ఉండాలి, ఎలా మెలగాలి అనే దానిని గురించే నేను మాట్లాడటం

జరుగుతుంది.  నాటికీ నేటికీ కూడా నా ముందు ఒకే ప్రశ్న తల ఎత్తి ఉంది. అదేమంటే బాబూజీ మహరాజ్ లయావస్థకు ప్రాధాన్యతనిస్తూ, అది లేకుండా అనంతయాత్ర అసంపూర్ణ మౌతుంది అన్నారు. అయితే మరి లయావస్థ అంటే ఏమిటి, ఎలా ఉంటుంది, లయావస్థ ప్రారంభమైనట్లు మనకు ఎలా తెలుస్తుంది అనే ప్రశ్న ఉదయిస్తుంది. దానికొక చిన్న ఉదాహరణ ఇస్తాను చూడండి. నీటి యొక్క ఘన రూపం మంచుగడ్డ. మనం దానిని అలాగే ఉంచాలనుకుంటే చల్లని ప్రదేశంలో అనగా ఏదో ఫ్రిజ్‌లో నిల్వ చేస్తాము. కాని దానిని బయటకు తీస్తే అది స్వభావసిద్ధంగా కరిగి దాని అసలు స్థితికి అనగా ఘన రూపం నుంచి ద్రవస్థితికి మారుతుంది. అదే విధంగా మనలో కరుడుగట్టిన గ్రాస్‌నెస్ అనగా సంస్కార బంధనాలు నుంచి తాను, తన అనే అహం నుంచి మనం విముక్తులమై, మన ఉనికినే మరచి ఉండే స్థితికి చేరాలి. మనకు మనం పరిమితం కాకుండా, సంకుచితం కాకుండా, మన చుట్టూ బంధనాలు సృష్టించు కోకుండా ఉంటే లభించే మొట్టమొదటి లాభం ఏమంటే ఘనీభవించిన నీరు ద్రవించి తన నిజస్థితిని ఎలా పొందిందో అలాగే మనం ఏ స్థానాన్ని వీడి వచ్చామో ఆ స్థానానికి చేరతాము. నీరు శీతలీకరణంవలన ఎలా గడ్డకట్టి ఉండిపోతూ ఉందో మనం మన సంస్కార బంధనాలవలన గట్టిపడి కరిగిపోలేకున్నాం. బాబూజీ ఇలా చెప్పేవారు:  "ధ్యానంలో దివ్యకాంతి గురించి నేనెందుకు చెపుతున్నానంటే అంతకంటే లోతుగా జనులు అర్థం చేసుకోలేరు. ఒక మండుతున్న కర్రకు, మంట ఆరిపోయిన కర్రను

జోడించినట్లయితే కొంతసేపటికి అది కూడా మందుతుంది" అనగా డివైన్ పర్సనాలిటి యొక్క దివ్యతేజస్సుతో సామాన్యుని హృదయంలో కనుమరుగైన దివ్యకాంతి ప్రజ్వలిస్తుంది అని భావించాలి. ఇపుడు మన మనస్సు మన అంతరంలో ఉన్న డివైన్‌తో లయలీనమైపోతే హృదయమనే మందిరంలో ఉంటున్న దైవం, మనస్సుతో సాధన ద్వారానే మనకు ప్రత్యక్షమవుతాడు. అదే మనం లయావస్థలో అడుగు పెడుతున్నట్లు సంకేతం. బాబూజీ మహరాజ్ చెప్పారు – నీవు దివ్యసాగరంలో దూకి, దైవంలో మునిగిపో, మళ్ళీ దానిలో నుండి బయటకు రానంతగా మునిగిపోయి ఉండు అని. అందుకుగాను వారు సాధన కూడా చెప్పారు. మంచుగడ్డ కరిగి నీరైపోయినట్లు, మనం దైవం యొక్క ధ్యాసలో మునిగి ఉండే ప్రయత్నం చేసినట్లయితే, ఆ దైవప్రేమపట్ల తపనతో ఉండడం ద్వారా మనలో కలిగే అవాంఛనీయ ఆలోచనలు మన సావధానాన్ని ఎంత ఆటంకపర్చగలిగేవి అయినా సరే క్రమంగా తొలగిపోతాయి. నశింపబడతాయి. నేను బాబూజీకి నా ఉత్తరంలో వ్రాశాను. నా అంతరంగం కరిగి పోతోంది. దాని స్థానంలో దివ్యసౌందర్యం వెలుగొందుతూ పోతోంది, నీటితో తయారైన మంచుగడ్డ బయట ఉంచితే మళ్ళీ నీరుగా మారిపోయినట్లు. అహం అనే బంధనం నుంచి తొలగించి దైవానికి జోడించే ప్రయత్నం చేసినట్లయితే ఒక రోజున ఆ దైవంలో లయమైపోయే స్థితి కలుగుతుంది.

బాబూజీ అంటూ ఉండేవారు – జనులు ప్రశ్నలైతే వేస్తారు కాని జవాబును అర్థం చేసుకొనే సామర్థ్యం పెంచుకోరు – అని.

బాబూజీ చెప్పారు – మానవునికి అన్నిటికంటే ముఖ్యమైన ప్రశ్న 'ఐ' (I) నేను అనేది. దానికి ఫలితం 'యు' (You) లోనే ఉంది. జన్మ యొక్క సాధనలో జరగవలసిందల్లా ('I', 'You') 'ఐ', 'యు' అనగా నేను, నీవులో కలిసిపోవటమే.

**'యు' (You) నుంచి 'ఐ' (I) వేరుపడినప్పుడు:** నీటి నుంచి మంచుగడ్డ వేరైనట్లు, మంచుగడ్డ కరిగి మళ్ళీ నీరైనట్లుగానే మానవుడు కూడా ప్రయత్నం చేస్తే తాను ఎక్కడి నుండి వచ్చాడో, ఎవరైతే తనను సృష్టించారో అక్కడికి తాను కరిగి (**నేను** కరిగిపోయి) కలిసిపోతాడు. ఈ దశనే ఆత్మసాక్షాత్కారం అంటాము. ఇప్పుడు 'నేను' అనగా నేను చూశాను, నేను చేస్తున్నాను అనే ఆలోచనలు 'నేను' ఐక్యమైపోయిన తర్వాత ఆ అనంత తత్వము యొక్క ఆవరణ వలయ రేఖను (సరిహద్దును) తాకవు. లోనికి ప్రవేశించవు కూడా. అక్కడి నుంచి ఏదైనా చెప్పాలనుకున్నప్పటికీ మన సాధన, ఆలోచనలు, ఏ విషయాలు కూడా దానిని అంటుకోలేవు.

ధ్యానంలో చాలా ఆలోచనలు వస్తాయి. ధ్యానంలో ప్రార్థన చేయదగునా అని బాబూజీని ప్రశ్నించినపుడు, వారు చెప్పారు– ప్రార్థన ద్వారా ధ్యానం అను దానిని దృష్టిలో పెట్టుకొని నీ అంతరంగం ధ్యానంలో ఉండటానికి ప్రయత్నిస్తోంది. ప్రార్థన ధ్యానం కాదు. ధ్యానం ప్రార్థనా కాదు. ప్రార్థన ద్వారా ధ్యానం చేయటానికి మనస్సు ఆయత్తం చేయబడుతుంది. ప్రార్థన అనేది ఆధ్యాత్మిక ఆలోచనకు, సాధనకు ఒక విధమైన వినమ్రతా భావాన్ని జోడిస్తుంది.

బాబూజీ మహరాజ్ మహత్ శక్తివంతుడై ఉండి కూడా సామాన్యమైన కుటుంబ ఉదాహరణ ఇచ్చారు. బాబూజీ ఇలా చెప్పారు:

"నేను లాలాజీకి వ్రాశాను. నాకు చాలా కోపం కలుగుతోంది. నేను కచేరి నుండి అలసిపోయి తిరిగి ఇంటికి వచ్చేసరికి సర్వేశ్ తల్లి (భార్య) మీద చాలా కోపం వస్తుంది. ఆ కోపం తీవ్రతలో నేను అల్పాహారం కూడా తీసుకోకుండా లేచిపోతాను అని. ఈ ఉత్తరం వ్రాసేసరికి లాలాజీకి స్పందన కలిగింది. వారి కృషితో (సంకల్ప శక్తితో) ఆమెలో చాలా మార్పు వచ్చింది. శాంత స్వభావం అలవడింది. దానికి జవాబుగా లాలాజీ సాహెబ్ రెండే రెండు వాక్యాలు వ్రాశారు. "నీ ఉత్తరం అందింది. ఆమెలో సహనశక్తిని ప్రవేశపెట్టడంలో నాతో సహకరించినందుకు ఆమెను అభినందిస్తున్నాను" అని. ఈ ఉదాహరణనుబట్టి సహనశక్తిని అలవరచుకొని సంయమనం పాటించటంవలన ఈ ప్రపంచంలో ఉంటూ కూడా ఆధ్యాత్మిక ప్రగతిలో సాధనలో చాలా ఉపయోగం ఉంటుంది. ఇది చాలా అవసరం కూడా. ఈ సహన శక్తిని సాధించటం మొదట కొంచెం కష్టమనిపించినా అలవరుచుకున్నాక ఏమీ అనిపించదు.

బాబూజీ చెప్పారు 'జ్ఞాపకం' చాలా గొప్పది అని. వాక్యం చాలా చిన్నదే కాని దాని అర్థం చాలా విలువైనది. దాని పూర్తి అర్థం నాకు ఎన్నో సంవత్సరాల తర్వాత కాని తెలియలేదు. దానిని నా పుస్తకంలో వ్రాశాను. జ్ఞాపకాలు ఎప్పుడూ చెరిగిపోనివి. ఎక్కడో దూరాన ఉన్నవాటిని గురించి వస్తాయి.

అవి ఎలా వస్తాయి, ఎందుకు వస్తాయి అంటే దివ్యసాగరంలో నీవు మునిగిపోయి వెదుకు. అవి ఒక దశలో వస్తాయి. అవి నిరంతరం, శాశ్వతం అయి ఉంటాయి. ఈ 'జ్ఞాపకం' ఎలాంటిది అంటే అది వచ్చాక మళ్ళీ మరపురానిది. ఇదే మొదటి మెట్టు. ఇక్కడి నుంచే లయావస్థ ప్రారంభమవుతుంది. బాబూజీ అందుకే చెప్పారు, దివ్య సముద్రంలో మునిగిపో. దానిలోనే ఈదులాడు – అని. దానిలో ప్రవేశించాక మళ్ళీ దాని నుంచి తిరిగి రావాలనే భావన రాదు. సముద్రంలో దూకుతాం. కాని వెంటనే మునిగి చచ్చిపోము. సముద్రంలో ఎన్నో జంతువులు సంచరిస్తూ ఉంటాయి. అవి జీవించే ఉంటాయి. మనం సముద్రంలో మునుగుతున్నప్పుడు మధ్య మధ్య బయటకు వస్తూ ఉంటాము. మళ్ళీ మునుగుతూ ఉంటాము. అలా మునకలు వేస్తూ వేస్తూ నీళ్ళు త్రాగి ఊపిరి సల్పక చివరికి మరణిస్తాం. అపుడు నీటిపై శరీరం తేలుతుంది. అదే విధంగా దివ్య సాగరంలో కూడా నెమ్మది నెమ్మదిగా లోతుకు వెళ్ళటం జరుగుతుంది. అంచెలు అంచెలుగా అనగా దివ్య దశల ద్వారా అనంతంలోకి చేరటమవుతుంది. నీటిలో చచ్చిపోవటమంటే, అందులో మునిగి ప్రాణం వదలినట్లే. దివ్యసాగరంలో 'అహం'ను విడిచి లీనమైపోవటం. దీనినే బాబూజీ 'ఫనాయేఫనా' అని వ్యాఖ్యానించారు. అపుడు ఏదైతే మనదికాదో దానిని వారు పరిగ్రహిస్తారు.

కమలం నీటిలోనే ఉంటున్నా దాని పత్రాలు ఎలా నీట మునగవో నీటిని అంటీనంటనట్లుగా మనం ఈ జగత్తులో అలా

ఉండాలి. అలా ఉన్నప్పుడు ఈ భూమి మీద ఉంటూనే దానిపై నడయాడుతూ ఉండి కూడా  పాదాలు భూమి నంటనట్లుగా, దుమ్ము ధూళి సోకనట్లుగా తేలియాడుతూ ఉంటాం. ఈ స్థితిలో నేను బాబూజీకి వ్రాశాను. భూమి యొక్క స్పర్శ కూడా నాకు తెలియటంలేదు అని. దానికి బదులుగా బాబూజీ వ్రాశారు. “నా సహజమార్గ శిక్షణ యొక్క అత్యంత మహత్తు ఇదే. ఇది శిక్షణనిచ్చే వారి శ్రేష్ఠతనుబట్టి ఉంటుంది. ఇందులోని గొప్పసత్యం ఏమిటంటే ఈ ధరణి మీద జీవిస్తూనే ఉన్న వారిని అంతిమసత్యం వరకు తీసుకువెళ్ళటమే దాని ప్రతిభ. నా శిక్షణలో ఉన్న ప్రాధాన్యత ఏమంటే, అభ్యాసీ ఒక (స్టేజ్) దశకు వెళ్ళిన తర్వాత అక్కడ నిలిచి, దాని నాధారంగా చేసుకొని దానికి ముందున్న దశను చూడగలుగుతాడు. కాని అతని గత దశల ఆలోచనలు కొంతవరకూ వెన్నంటి ఉంటాయి” అని.

నేను బాబూజీని ప్రశ్నించాను. ఒకే జన్మలో అనంతయాత్ర పూర్తి చేయటం సంభవమా? అని. ఎందుకంటే, కబీరు మహాశయుడు ఒక దశకు చేరుకుని ముందుకు సాగిపోలేక హద్దుకు, హద్దులేమికి మధ్య నిలిచిపోయానన్నాడు. అతను తన శక్తితో అహం యొక్క హద్దును అధిగమించాడు. కాని అనంతశక్తి యొక్క హద్దును చేరలేకపోయాడు. బాబూజీ మహరాజ్ వంటి దివ్యమహాత్ముల సహాయం ఆ సమయంలో ఆయనకు లభించలేదు.

బాబూజీ మహరాజ్ చెప్పారు – సెంట్రల్ రీజియన్ ఒక అన్వేషణ అని. నా ముందున్నది ఇదే ప్రశ్న. భూమి మీద జీవించి

ఉన్న వ్యక్తిని అక్కడికి ఎలా తీసుకువెళ్తారు అని. కాని 'వారు' కలిగించిన దృఢ దీక్ష మరియు 'వారి' కృపతో సెంట్రల్ రీజియన్‌కు తీసుకువెళ్ళారు. ఆ అనుభవం నాకు తెలిపింది ఏమంటే, అక్కడ బాబూజీ మహరాజ్ యొక్క సంకల్పంతో ఒక నావలో కూర్చుండి, నా అనే స్పృహ లేకుండా దానిలో ప్రయాణించినట్లుంది. ఈ విషయమే బాబూజీ మహరాజ్‌కు వ్రాశాను. దానికి 'వారు' జవాబు ఏమి వ్రాశారంటే, సెంట్రల్ రీజియన్‌లో ఈదటమే (స్విమ్మింగ్) జరుగుతుంది. కాని యాత్ర కాదు. ఇక్కడి వరకు స్టేజెస్ అనగా దశలు దాటటం జరిగింది. కాని ఇక్కడ అలా కాదు.

బాబూజీ మహరాజ్‌గారి లయావస్థ చాలా మహత్వ పూర్ణమైనది. దానిలో మునిగిపోయాక మరింక బయటకు వచ్చే ప్రయత్నం ఉండకూడదు. అది ఎలాగంటే, మీరు ఆఫీసుకు వెళతారు. మేము ఇంటి పనులు చేస్తూ ఉంటాము. ఓసారి ఏదో పనిలో మనం దివ్యస్మృతిని మరచిపోతాం. మళ్ళీ జ్ఞాపకం వస్తుంది. అప్పుడు మనం 'వారి'నే స్మరిస్తూ ఉన్నామని, వారి ఆశీస్సులు అందుకుంటున్నామని భావన చేయాలి. ఇలా నిరంతరం 'వారి' జ్ఞాపకంతోనే ఉండాలి. దివ్యసాగరం అంటాము. మామూలుగా సాగరం ముందు నిలబడితే నీరు, చల్లదనం అన్నీ చూస్తూ ఉంటాము. కాని అందులో దిగి బయటకు వచ్చే ప్రయత్నం చేయకుండా ఉంటే మునిగి మరణిస్తాము. అలాగే దివ్యసాగరంలో ఇటువంటి ప్రయత్నం లయావస్థ అవుతుంది. ఇది అవశ్యం. ఇది బాబూజీ మహరాజ్

కృపవల్లనే జరిగింది. ఈ విషయంలో సెంట్రల్ రీజియన్ గురించిన విషయం ఏ ఆధ్యాత్మిక గ్రంథంలో కాని, ఏ మహర్షి చేతగాని వెల్లడిచేసి ఉండబడలేదు. అది 'వారి' చాతుర్యం. వారి ప్రేమ అద్వితీయం. ఎప్పుడైతే నేను సెంట్రల్ రీజియన్‌లో ప్రవేశం పొందానో వారికి ఉత్తరం వ్రాశాను. తరువాత షాజహాన్‌పూర్ వెళ్ళాను. అప్పుడు ఈశ్వర్‌సహాయ్‌గారు అడిగారు, "కస్తూరిని మీరు సెంట్రల్ రీజియన్‌కు ఎలా తీసుకువెళ్ళగలిగారు?" అని. బాబూజీ అందుకు సమాధానంగా "అది లాలాజీ సాహెబ్ యొక్క మహత్తు" అంటూనే కొంచెంసేపు ఆగి, "నేను ఏదైనా పని చేయాలనుకుంటే దానిని లాలాజీ సాహెబ్‌కు నివేదిస్తాను. 'వారు' వద్దంటే ఆపివేస్తాను. ఏమీ అనకపోతే చేసివేశాక ఇంకేమౌతుంది" అంటూ చమత్కరించారు. ఇటువంటి చతురత్వంలో కూడా వారి ప్రేమపూరిత భావం ఉంటుండేది. అందుకు ఉదాహరణగా, ఒకసారి మా పినతండ్రిగార్కి అనారోగ్యంగా ఉండగా ఊరు వెళ్ళాను. అప్పుడు నేను వ్రాసిన ఉత్తరం బాబూజీకి షాజహాన్‌పూర్‌లో ఉండగా చేరింది. వారికి వచ్చిన ఉత్తరాలను చదువుతూ మధ్య మధ్య వాహ్! వాహ్! అంటూ ఎర్ర సిరాతో గుర్తించటం జరుగుతూ ఉండేది. అది చూస్తుంటే మాకు గమ్మత్తుగా ఉండేది. నా ఉత్తరాలకు జవాబు కొరకు నిరీక్షించటం నాకు అలవాటు. నేను లఖీమ్‌పూర్ నుంచి తిరిగి రాగానే వారి నుంచి జాబు రాలేదేమా అనుకుంటూ ఉండగా మూడవ రోజున అది రానే వచ్చింది. అందులో 'వారు' ఇలా వ్రాశారు– 'నీ మనసు పాడయ్యింది అనుకుంటున్నాను. దానికి వైద్యం అవసరం

అనుకుంటే షాజహాన్‌పూర్ రావాలి" అని. అందుచేత వారి చర్యలు తెలివైనవిగా, చమత్కారయుతంగా ఉండేవి. మనం బాల్యాన్ని మర్చిపోతాము. కాని చురుకైన విషయాలను మర్చిపోలేము. ఒకసారి ఇలా జరిగింది. 'వారు' తమ గదిలో విశ్రాంతి తీసుకుంటున్నారు. ఆ సమయంలో స్త్రీలు ఎవ్వరూ 'వారి' పాదాలు స్పర్శించరాదని నిర్దేశించారు. దూరం నుంచి చూసి మనసులోనే ప్రణామం చేసుకొని వెళ్ళటం జరిగేది. ఒకరోజు 'వారు' బయట కూర్చుని ఉండగా 'వారి' చరణాలు స్పర్శించి నమస్కరించాను. అపుడు 'వారు', మనస్సులో స్పర్శానుభూతి ఉన్నా సరిపోతుంది అన్నారు. అలాగే మరొక రోజున 'వారు' గదిలో ఉండగా, వెలపల నుంచే మనసులో వారి చరణాలపై శిరస్సు ఉంచి ప్రణామం చేశాను. వెంటనే 'వారు' వేగంగా బయటకు వచ్చి పాదాలు స్పర్శించకుండానే వెళ్ళిపోతున్నావా! అన్నారు. అందుచేత బాబూజీలో లయావస్థ చాలా గొప్పది. 'వారు' చెప్పేది ఏదైనా సరళంగా ఉండేది. 'వారి' చరణాలపైన మోకరిల్లి, వారినే దృష్టిలో ఉంచుకొని ఏ పని చేసినా తప్పుగా ఏదీ జరగదు. అలాగని మన ఆచరణలో, ఆలోచనలో, వాక్కులో ఎలా ఉన్నా పరవాలేదని అనుకోవద్దు. సమాజంలో అందరితో సత్ప్రవర్తన, సదాలోచన, ప్రేమభావం, సమతాభావంతో మెలగాలి. అలా అని మీ వస్తువులన్నీ పంచి ఇవ్వాలని కాదు కాని, అందరినీ తన వారిగానే భావించాలి. మంచి చేయాలి, మంచితనాన్ని కోరాలి.

బాబూజీ భూమిపై అవతరిస్తూనే ప్రేమ దృక్పథంతో వచ్చారు. తమ ప్రేమను ప్రాణిమాత్రులందరికీ పంచటమే వారి

పరమావధి. 'వారి' ప్రేమకొక ఉదాహరణ: మొదట్లో జనమంతా వారి దగ్గరగా వెళ్తూ ఉండేవారు. శుభ్రత పాటించేవారు కాదు. బాత్‌రూమ్ నుంచి వచ్చి కూడా చేతులు శుభ్రం చేసుకొనే వారు కాదు. వారికది అసభ్యతగా తోచేది. ఒకసారి వారు "బిటియా! ఈ రోజు నాకొక దృశ్యం కనిపించింది. నేను బాత్‌రూమ్‌కు వెళ్ళేసరికి ఒకతను ఒక చేతిలో మట్టి, మరో చేతితో నీళ్ళు తీసుకొని వెళ్ళాడు. కాని బయటకు వస్తూ చేతిలో మట్టి అలాగే ఉంచుకొన్నాడు" అని చెప్తూ అపుడు అతన్ని పిలిచి "మట్టితో చేయి శుభ్రం చేసుకో" అన్నారు. అది చూసి అందరూ దానిని పాటించటం అలవాటు చేసుకున్నారు. (ఉత్తర భారతదేశంలో టాయ్‌లెట్‌కు వెళ్ళి వచ్చినవారికి మట్టితో చేయి రుద్దుకొని శుభ్రం చేసుకునే అలవాటు ఉండేది) 'వారు' దేనిని నేర్పాలనుకున్నా స్వయంగా చేసి చూపేవారు. మాటల్లో కూడా చాలా మృదుత్వం ఉండేది. పల్లె ప్రజలు వచ్చినా సౌమ్యంగా మాట్లాడేవారు కాని, కటువుగా మాట్లాడేవారు కాదు.

మనం సహజమార్గం యొుక్క మంచిని ప్రస్తుతి చేస్తున్నామంటే, గొప్పతనం చెబుతున్నామంటే దాని మహత్తుతో పాటు, మన ప్రతి చర్యలోనూ ఆ మంచితనాన్ని ఆచరణాత్మకంగా చూపాలి. మన జీవన విధానంలో అది ప్రతిబింబించాలి.

నీటి నుంచి నీరు వేరై ఘనీభవించి, మళ్ళీ ఉష్ణోగ్రత మారగానే ద్రవించి మళ్ళీ నీరుగా మారినట్లే మానవుడు కూడా దైవం నుంచి వేరుపడినప్పటికీ అతనిలోనూ దైవమున్నాడు. మళ్ళీ

దైవస్పృహ కలిగి ఆవరించిన మాలిన్యాలు తొలగించుకుంటే, దైవం ఎలా తయారుచేశాడో అలాంటి అసలు రూపుదిద్దు కుంటాడు. ఆయన మనల్ని వదలిపెట్టలేదు. మనల్ని తనలో చేర్చుకుంటాడు. లయం కావటం మన సహజతత్వం.

బాబూజీ యొక్క దివ్య ఆశీస్సులతో ఈ చిన్న పుస్తకాన్ని కానుకగా సమర్పిస్తున్నాను. దీనిలో బాబూజీ సందేశాలు రెండు ఉన్నాయి. ఈ పుస్తకం బాబూజీ ఆశీస్సులతో పూరించబడి ఉంది. ఇది దివ్యమైన తరగని, చెరగని శాశ్వత ఆశీః కానుక. దీనిని మీరు ఎన్నిసార్లు చదివితే అంతగా ప్రయోజనం ఉంటుంది. దీనితోపాటు బాబూజీ దివ్యాశీస్సులు నూరు రెట్లుగా ప్రసాదించ బడుతున్నాయి. దివ్యధార, దివ్యశక్తి నూరురెట్లుగా ప్రసారము అవుతున్నాయి. దీనిని పొందగలిగిన వారు వారి శక్తి మేరకు పొందుతారు (జీర్ణించుకుంటారు). మిగిలినది వాతావరణంలో వలయాకారంలో (అవ్‌రా) వ్యాపించి ఉంటుంది. తర్వాత వీనుల ద్వారా, వాక్కు ద్వారా, శ్వాస ద్వారా గ్రహించ బడుతూ ఉంటుంది.

సహజ మార్గావలంబనలో ప్రేమ, భక్తి, శ్రద్ధ అన్నీ అవసరం. శ్రద్ధ అందరిలోనూ ఉంటుంది. పలువురిలో పలు రకాలుగా ఉంటుంది. ఈ శ్రద్ధ, వివిధ మార్గాల్లో విస్తరించ బడకుండా ఒకే మార్గంలో కేంద్రీకరించితే మన లక్ష్యం నెరవేరుతుంది. గమ్యం సులభమవుతుంది. అందుచేత మన లక్ష్యం ఒకే ఒక్కటిగా ఉండాలి.

ఈ జన్మ శతాబ్ది ఉత్సవ సందర్భంలో ఇక్కడ (హాజరైన) సమావేశమైన అభ్యాసులందరికీ నూరింతలుగా దివ్యశక్తి ప్రసారమవుతోంది. ఇది ఇక్కడ భౌతికంగా ఉన్న వారికి మాత్రమే కాదు, ఏ కారణం చేతనైనా ఇక్కడ సమావేశం కాలేకపోయిన అభ్యాసులు, బాబూజీ మహరాజ్‌కు అంకితమైన వారందరూ కూడా ఈ (డివైన్ ట్రాన్స్‌మిషన్) దివ్యశక్తి ప్రసారంతో నూరురెట్లుగా లబ్ధి పొందుతారు. మీరందరూ తమ తమ ప్రాంతాలకు వెళుతున్నారు. బాబూజీ మహరాజ్ యొక్క ఈ దివ్యశక్తి ప్రసాదాన్ని అందరికీ పంచిపెట్టండి.

మానవాళికే కాదు. సమస్తమును ఉద్ధరించటానికి, భూమాశక్తి సంపన్నుడు, శ్రీ బాబూజీ మహరాజ్‌ను అవతరింపజేసిన సద్గురు శ్రీలాలాజీ సాహెబ్‌కి మనందరమూ కృతజ్ఞత తెలుపుతూ, మనందరినీ మన లక్ష్య ప్రాప్తి పొందునట్లుగా ఆశీర్వదించమని, అనుగ్రహించమని కోరుకుందాము. మనం బాబూజీపట్ల కృతజ్ఞత వెల్లడించుకుంటూ వారి దివ్య చరణాలపై సాగిలపడి మనందరినీ మన లక్ష్యం సాధించగలుగునట్లుగా ఆశీర్వదించమని వేడుకుందాము.

ఈ రోజు అందరికీ కానుకలో ప్రేమపెట్టి ప్రేమకానుక అనగా ఒక చిన్న పుస్తకం బహూకరించాను. దానిలో బాబూజీ యొక్క సందేశాత్మక వ్యాసాలు కూడా రెండు ఉన్నాయి. కనుక ఈ బహుమతిలో ప్రేమ నిండి ఉండటమేకాక బాబూజీ యొక్క శుభాశీస్సులు కూడా మీకు అందించబడుతున్నాయి. ఆ పుస్తకం

చదివినప్పుడల్లా మీకు ఏదో ఒకటి లభిస్తూనే ఉంటుంది. ఇది నిరంతరం, శాశ్వతం.

బాబూజీ జన్మ శతాబ్ది మహోత్సవ సందర్భంగా మనమంతా ఇక్కడ సమావేశమై ఉన్నాం. బాబూజీ యొక్క దివ్య ప్రసాదాన్ని నూరు రెట్లుగా మనం ఆస్వాదిస్తున్న ఈ శుభవేళ ఇక్కడ హాజరైన అభ్యాసులందరికీ నేను పునర్జన్మ రాహిత్యం (పునర్జన్మ నుండి విముక్తి) ప్రసాదిస్తున్నాను. బాబూజీ మహరాజ్ అనుగ్రహంతో ఇటువంటి సాధికారం (అథారిటి) నాకు ఉంది. ధన్యవాదాలు.

# శ్రీ బాబూజీ మహరాజ్ జన్మశతాబ్ది సంవత్సరం

## ప్రేమకానుక పుస్తకంలో కస్తూరిగారి వ్యాసం

శతాబ్ది అను శబ్దమే నిజంగా చాలా ప్రియాతి ప్రియంగా ఉంటుంది. కాని ఈనాడు నేను దీనిని ఏ దివ్య విభూతి శ్రీ బాబూజీ విషయంలో ప్రస్తావిస్తున్నానో, వారు తమ దివ్యావతారంతో ఈ యుగాన్నే ధన్యంగావించారు. ఆధ్యాత్మిక క్షేత్రంలో వారు నెలకొల్పిన శ్రీ రామచంద్ర మిషన్‌లో ప్రతిపాదించబడిన సహజమార్గ విధానం (సిస్టమ్) అభ్యాసీల యొక్క అనుభూతి ద్వారా సహజమైన రీతిలో దాని విశిష్టతను చాటిచెప్పుతోంది. సహజమార్గ సాధనలో అభ్యాసీకి ఈశ్వరప్రాప్తి అనే లక్ష్యాన్ని నిర్దేశించి, మానవ మూర్తిమత్వంలో ఈశ్వరీయ సౌందర్య ముద్భవించగల పరమానందభరిత అనుభవాన్ని

అనుగ్రహించి 'సహజమార్గం' అన్న దానిని యదార్థం గావించారు. సహజ-మార్గ-సాధన బహు శక్తిసంపన్నమైన చమత్కారంవలె మనల్ని సమ్మోహింపచేస్తుంది. శ్రీ బాబూజీ మహరాజ్ యొక్క సంకల్పశక్తితో దివ్య ప్రాణాహుతి యొక్క నిరంతర ప్రవాహం పొందటం ద్వారా, మానవుల మనసే కాదు, 'వారి' ఈ శతాబ్ది సంవత్సరం కూడా తమ దివ్యశక్తి సంభరితంలోనే లీనమైపోయినట్లుగా ఉంది. సహజమార్గ సిస్టమ్ మానవమాత్రులకు 'వారు' ప్రసాదించిన దివ్యప్రసాదం. ఈ దివ్య ప్రసాదాన్ని అనుభవపూర్వకంగా గ్రహించటం ద్వారా, వారి ప్రేమామృతం నిత్య సంపదగా సంతరించుకొనబడి మన జీవనశక్తి (ప్రాణశక్తి)గా విలసిల్లుతోంది. భూమా నుండి ప్రవహింపజేసిన దివ్యత్వపు ధారలో ప్రక్షాళనం చేసి, సహజమార్గ సాధనను 'వారు' సరళమైనదిగాను, ఆధ్యాత్మిక శక్తి సంపన్నమైనదిగాను తీర్చిదిద్దారు. "ప్రాణిమాత్రులందరూ ఈశ్వరుని చేరాలి" అను **వారి** దివ్య సంకల్పం, అందరిపట్ల **వారి** ప్రేమకు నిదర్శనమేగాక ఈ యుగపు ప్రాణంలో వ్యాపించి ఉన్న ఆ దివ్య విభూతిని కూడా సశక్తితో సదా నిలిపి ఉంచుతుంది. అంతేగాక, సాక్షాత్కారం పొందాలనుకుంటున్న ఈ యుగపు ఆవేదన, ప్రాణిమాత్రుల అంతరంగం, సమస్తమైన ప్రకృతి (వాతావరణం) **వారి** దివ్యప్రేమతో లాలించబడి, పులకితమయ్యేట్లుగా పరిచర్య చేస్తూ ఉంటుంది. మన అభ్యాసీల అంతరంగం (అంతర మనస్సు)ను బాబూజీ ప్రేమతో లాలానచేస్తూ, మైమరపింపచేసే సన్నివేశం

మనల్ని 'వారి' విశ్వ ప్రేమలో (యూనివర్సల్ లవ్) లీనమై ఉండునట్లు లాలాపాట పల్లవిస్తూ ఉంటుంది.

శ్రీ బాబూజీ మహరాజ్ మహత్తర శతాబ్దివత్సరం యొక్క మహిమను గురించి ఎవరు ఏమని వర్ణించగలరు? ఈ పవిత్ర పర్వం యొక్క దివ్య వర్ణనను 'వారి' ఆదరణీయ అండ లేకుండా ఏ కలం మాత్రం వ్రాయటానికి సాహసించగలదు! అపరిమితంగా వ్యాప్తినందుతున్న అభ్యాసీ గణం యొక్క సంఖ్యయే ఇందుకు నిదర్శనం. దివ్య విభూతి శ్రీ బాబూజీ మహరాజ్‌పై ధ్యానంలో ధ్యానావస్థితమై ఉన్న సందర్భంలో మానవ మనస్సును ధ్యానావస్థస్థితిలో నిలిచి ఉండగలుగునట్లు శిక్షణ ఇచ్చారు. దివ్య సౌందర్యాన్ని ప్రత్యక్షపర్చగల శ్రీ బాబూజీ మహరాజ్ దృష్టి, మన ఆలోచనా మాలిన్యాలను రూపుమాపి వాటి స్థానంలో పవిత్రతను పూరిస్తూ ఉంటుంది. **వారి** పావన చరణాలపై వ్రాలిన యగం యొక్క శిరస్సు, మానవుని అహంభావాన్ని ఎల్లప్పుడూ **వారి** పాదాలమీద సాష్టాంగపడేటట్లు చేస్తూ ఉంటుంది. **వారి** శతాబ్ది సంవత్సరం, వారికి మన వినయ పత్రికను మోసుకొనిపోయే వార్తావాహిని వంటిది. ఎందుకంటే, **వారి** దృష్టి మనపై సారించబడటానికి మనం **వారి** దివ్యముఖారవిందమునే వీక్షిస్తున్నాం.

శ్రీ లాలాజీ సాహెబ్ ప్రీతిపాత్రుడైన బాబూజీ శతాబ్ది వత్సర పర్వదిన సందర్భంగా భూమాయొక్క పరమశక్తి, తన బిడ్డలపై తన కృపను ప్రసరింపజేస్తున్నట్లుగా అనిపిస్తోంది.

అనుదినం అభివృద్ధి చెందుతున్న ఆధ్యాత్మిక ప్రగతి, దివ్యానందం, అభ్యాసులమైన మన ఆధ్యాత్మిక పథంలో (మార్గంలో) పూలజల్లు కురిపిస్తూ, లయావస్థను అనుగ్రహించి మనల్ని అంతిమ సత్యధారలో దివ్య పురుషులు (డివైన్ పర్సనాలిటీ) ప్రవహింప జేస్తున్నట్లుగా తలపిస్తోంది. భూమా యొక్క దివ్య వైభవంతో నిండిన సెంట్రల్ రీజియన్‌ను అన్వేషించి, అభ్యాసీలను దానిలో ఈదులాడునట్లుగా చేసిన మన బాబూజీ భూమా యొక్క ఆదిశక్తి సమన్వితుడైన అత్యంత శోభనమూర్తి అని, అల్టిమేట్ అనగా అంతిమమే స్వయంగా ప్రకటించినట్లుగా ఉంది. 'వారు' తమ పరమశక్తితో అభ్యాసీ ఉనికిని దివత్వంలోకి దించి తాను వచించిన "Identity cannot identify itself (అనగా తన ఉనికి కూడా తనను తాను గుర్తింపలేని) దివ్యస్థితిని అందరికీ ప్రత్యక్షం చేశారు.

నేడు ఈ శతాబ్ది వత్సరం తన అర్థాన్ని (భావాన్ని) విడమర్చి తన విశిష్టతను ఇనుమడించుకుంటోంది. "శతాబ్ది" అను పదాన్ని "శత్ + అబ్ + ది" గా విభజించితే, 'శత్' అనగా వందరెట్లు, 'అబ్' అనగా దివ్య సౌందర్యం, 'ది' అనగా అనుగ్రహించేవారు – అనగా నూరింతలుగా దివ్య సౌందర్యమును వితరణ చేసేవారు అని అర్థమౌతుంది. సమర్థ సద్గురు శ్రీ లాలాజీ సాహెబ్ శ్రీ బాబూజీని, ఆదిశక్తియొక్క దివ్య ప్రేమ రూపునిగా భాసింపజేసి, వారి శత సంవత్సరాన్ని (నిత్యం, నిఖిలముగా) నిత్యనూతనం గాను, దివ్యమైనదిగాను అలరించారు. సహజమార్గ సాధనా పరులమైన మన అభ్యాసులందరికీ కూడా ఈ దిగువ అంతర్దశానుభూతి కలుగుతోంది:

"భక్తి భరిత అలౌకిక ప్రేమానందాన్ని చవిచూసిన వారికి చావెన్నటికీ లేదని,

జీవితం కూడా 'వారి' కనుసన్నలలో 'వారి' దర్శనంతోనే సజీవమైన మాటగా వెల్లడైన రహస్యమని,

ఆధ్యాత్మిక జ్యోతి వెలిగింది. నూరింతల దివ్య సౌందర్య శుభాకాంక్షలు

అందరికీ అందజేయటానికిదో కల్పన మాత్రమనీ, తెలియును మనందరికీ"

మన జీవన సర్వస్వమైన శ్రీ బాబూజీ మహరాజ్ శతసంవత్సరం, శ్రీ రామచంద్రుని మిషన్‌యొక్క ఆధ్యాత్మిక గౌరవ పతాకంగా యుగయుగాలలోనూ రెపరెపలాడుతూ ఉంటుంది. 'వారి' దివ్య ప్రాణాహుతి ప్రవాహం, మానవ హృదయాలను నిత్యశాంతి, శాశ్వత పరమానందాలతో అభిషేకం చేస్తూ ఉంటుంది.

## ప్రేమకానుక పుస్తకంలో అభ్యాసుల ప్రశ్నలకు శ్రీ బాబూజీ మహరాజ్ జవాబులు:

**1. ఈశ్వరానుభూతి అంటే ఏమిటి?**

**జ.** మీరెవ్వరో మీరెరుగుదురు. కాని 'అది' ఏమిటో మీకు తెలియదు. అదేమిటో మీరు తెలుసుకున్నప్పుడు లేదా మీలో అనుభూతి 'అది' ఏదో పొందగలిగినపుడు, దానినే ఈశ్వరానుభూతి అంటారు.

**2. పరిపూర్ణత అంటే ఏమిటి?**

**జ.** శక్తులన్నీ వికాసం చెందినపుడు ఏర్పడే సమతుల్యమే పరిపూర్ణత్వం.

**3. నిరంతర స్మరణ అనునది స్వయంగా వికాసం చెందుతుందా లేకుంటే ఏ వ్యక్తియైనా దీని కొరకు సాధన చేయవలసి ఉంటుందా?**

**జ.** వ్యక్తిలో ప్రేమ విస్తృతంగా ఉన్నపుడు, దాని వికాసం దానంతట అదే కలుగుతుంది.

**4. నిరంతర స్మరణ యొక్క అభ్యున్నతిని ఎలా అలవరచుకోవాలి? అందుకు ఏదైనా మార్గం ఉన్నదా?**

**జ.** మనం ఒకే ఆలోచనపైన మగ్నమై ఉండాలి. కేవలం ఒకే ఆలోచనపై హృదయంలో మరల మరల ధ్యాస కలిగి ఉండటం తప్పనిసరి అవుతుంది. దీనిని మంత్రంలాగా పలుమార్లు ఉ చ్చరించరాదు.

**5. ప్రేమను గురించి మీ అభిప్రాయం ఏమిటి? అది అత్యవసరమా?**

**జ.** ప్రేమ అత్యంతావశ్యకమని నేను ధృవపరుస్తున్నాను. గురువు యందుగాని, దేవుని (ఈశ్వర్) యందుకాని ప్రేమ కలిగి ఉండటం తప్పనిసరి. కాని ఆధ్యాత్మిక ప్రగతిలో ప్రేమ కూడా విలీనమైపోయే ఒక దశ ఏర్పడుతుంది.

**6. "సమర్పణ" అంటే ఏమిటి?**

**జ.** 'నేను' అనేది చోటుచేసుకోకపోవటమే "సమర్పణ" అవుతుంది. ఈశ్వరునిపట్ల భక్తి మొదటిది కాగా, ఎల్లప్పుడూ అతనిపై

ఆధారపడి ఉన్నట్లుగా భావన కలిగి ఉండటం రెండవది. మీరు ఈశ్వరునికే సమర్పితమైపోయారనుకుందాం. అటువంటి సమర్పణ యదార్థమైనదైతే సంపూర్ణమానవత్వానికే సమర్పితమైనట్లు అవుతుంది.

**7. "ప్రాణాహుతి" అంటే ఏమిటి?**

**జ.** మానవుని రూపాంతరం చెందించటంలో ఉపయోగించే దైవశక్తినే "ప్రాణాహుతి" అంటారు.

**8. మీ ఆలోచనలో లేదా దృష్టిలో మతిభ్రమ అనేది మాయ అవుతుందా?**

**జ.** కాదు. సాధారణంగా మాయ అనేది ఒక మోసగింపుగా భావించటం జరుగుతుంది. మాయ అనేది ఈశ్వరశక్తి. ఈ శక్తి ఏ విధంగా పనిచేస్తూ ఉందో తెలియనపుడు మనం భయపడి దానినే మాయ అని పిలుస్తాము. కాని మనకు ఈశ్వరీయ శక్తి ఏ విధంగా కార్యరూపం దాల్చుతుందో అవగతమైనపుడు మనకు యదార్థం పరీక్షించబడుతుంది. బుద్ధి జీవులు జ్ఞానాన్ని అరువు తెచ్చుకుంటారు. దివ్య పురుషులు జ్ఞానాన్ని సమకూర్చుతారు.

**9. కొందరు గురువు లోపల ఉన్నారంటారేమిటి?**

**జ.** ఈశ్వరుడు మాత్రమే గురువు. అన్యులందరూ ఈశ్వరుని మార్గదర్శకత్వంలోనూ, నియంత్రణలోనూ పనిచేస్తున్నారు. నిజం చెప్పాలంటే, ఎవరైనా ఒకరు తనను గురువు అని చాటుకుంటున్నారంటే, అటువంటి వాడు ఆధ్యాత్మిక విషయంలో ఇతరులకు

ప్రశిక్షణ ఇవ్వటానికి అర్హుడు కాడు. అటువంటివాడు ఈశ్వర పదవిని హరించేవాడవుతాడు.

**10. జీవించటమంటే ఏమిటి?**

**జ.** దీనికి అనేక అభిప్రాయాలు (పరిభాషలు) ఉన్నాయి. కాని నా పరిభాషలో జీవితంలో జీవించటమే నిజమైన జీవితం అంటాను.

**11. జీవిత ఉద్దేశ్యమేమిటి? మనం ఎక్కడి నుంచి వస్తున్నాం. ఎక్కడికి పోతున్నాం?**

**జ.** మానవుడి ఆది - కారణము (అనగా మూలం) నుండి వస్తున్నాడు. అతని పోకడ కూడా ఆది - కారణమే (మూలమే) అవుతుంది. అతని ఉనికి యొక్క ఉద్దేశ్యం కూడా ఆది-కారణానికి మరలిపోవటమే.

**12. సాధన అంటే ఏమిటి?**

**జ.** సాధన అనేది స్వతస్సిద్ధంగా జరుగుతుందేకాని జరుపబడేది కాదు. ఒకవేళ దానిని మనం చేసినా, చేయించబడినా, అది క్రియ మాత్రమే.

**13. ముక్తికి, ఆత్మానుభూతికి భేదం ఏమిటి?**

**జ.** తలకు, కాళ్ళకు ఉన్నంత తేడా ఉంది. 'మాలిక్' అనగా 'ఈశ్వరుని' కృపతో ముక్తి యొక్క స్థితి మనలో దానంతట అదే వస్తుంది. దాని ఆత్మానుభూతి మనలో ఉత్పన్నమవుతుంది. మన స్థితినిబట్టి ముక్తి యొక్క జ్ఞానం మన గ్రహింపుకు వస్తుంది. కాని ఆత్మానుభూతి మనకు ఎరుక లేకుండానే మనలో

కలుగుతుంది. దానికి మనం సాక్షీభూతులమేగాని, వాటిలో ఈదులాడుతూ ఉండగా మున్ముందు కలుగబోయే స్థితులు మన అనుభవానికి రావు.

**సోదరి కస్తూరి బాబూజీ జన్మ శతాబ్ది వత్సర పర్వదినాన్ని పురస్కరించుకొని వ్రాసిన గీతం**

జరుపుకుంటాం శతాబ్ది వర్ష పర్వదినం నీది
జగతిలో ఎక్కడా అంధకారం దాగరాదని

1. పర్వదినాన నేడు పరవశించిన పరమానందంతో
ప్రతిఫలించిన నీ కాంతి అణువణువున గాంచి
పొంగిపోయి క్షణకాలం మైమరచింది అంతిమ సత్యం.
2. ప్రతి హృదయం నీదు ప్రేమ సోకి పులకించింది
ప్రకృతి పారవశ్యంతో నర్తనహేల చేసింది
ప్రతి శబ్దం నీ పవిత్ర రాకను పునః స్మరణ చేసింది.
3. నీ ముఖారవిందం తిలకించి ధరణి
నివ్వెరపోయింది తన కేంద్రం భూమానే కాంచినట్టు
నీదివ్య ప్రేమనే నా నేత్రాలు ఆకర్షిస్తున్నాయి
4. నీ దివ్యతేజంపై నా దృష్టి నిలువలేకున్నది
ఎందుకో వెర్రి ప్రేమతో వివశమవుతున్నది
దివ్యతలమే నేడు నీ పాదాక్రాంతమైనట్లున్నది
5. ఆదిశక్తి నీ నుదుట తిలకం దిద్దింది
లాలాజీ నీకు దివ్య శృంగారం సమకూర్చగా
నీ నూరు వసంతాల సంబరం సర్వులకు శుభమగుగాక!

6. మన్మోహన దరహాసం తారాడుతోంది అధరాలపై నేడు
దివ్యము తన వైభవం చూపి ఆశీస్సులందిస్తున్నట్లు
స్వేచ్ఛగా అందరికీ అందించాలన్నట్లు.
7. అయ్యయ్యో! పోగొట్టుకున్నాయి శతాబ్దాలు
ఈ ఆనందహేలను
అంతిమం నుంచి ప్రవహించే నీ ప్రేమ తరంగాలలో
పులకితమవుతున్నాయి మా హృదయాంతరాలు
8. నిను వర్ణింప నా నోరు ఎలా మెదపగలను బాబూజీ
మహాపార్షద్ స్వయంగా నీ ద్వారాలు తెరచి
మర్మమూ మాయలేని నీ నివాసం వెల్లడి చేయగా
9. మేమందరం హృదయ పూర్వకంగా ప్రేమ పంచుకుంటామని
అందరికీ అందిస్తాం మీ ఆశీస్సులని విన్నవిస్తోంది 'సంధ్య'
అందరి మదిలో శత సంవత్సర శుభశుభోదయం
యుగపరివర్తన శుభారంభానికే శుభోదయం.

సృష్టి కర్తకు తన సృష్టి నుండియే ప్రేమ లభించక పోవుటంవలన భూమాయే మనోహర రూపం దాల్చి దివ్య పురుషుడు శ్రీ బాబూజీ మహరాజ్‌గా అవతరించినది.

ఈ పని చెయ్యి, ఈ విధంగా తయారుకావాలి అని గురువు కేవలం శిక్షణ మాత్రమే ఇవ్వగలడు, కాని సద్గురువు రూపంలో ఉన్న మాతృమూర్తి యొక్క కార్యములన్నియు కూడా దివ్యమైనవి. పరమస్థితులన్నింటినీ సద్గురువులే స్వయంగా మనకు ప్రదానం చేసి, తమ ద్వారా ప్రసాదింపబడిన ఆ పరమస్థితుల సంరక్షణా భారమును కూడా తమ మీదనే వేసుకుంటారు. ఇటువంటి దివ్యప్రేమ మన బాబూజీ మహరాజ్ గారిది.

వారు తమ దైవిక సంకల్పం పూర్తిచేయటానికి ఎంతగానో సంసిద్ధులవుతూ అప్రమత్తతో అభ్యాసీ ఉన్నతిలో ఒక్క క్షణం కూడా ఆలస్యం కలుగనివ్వరు. తత్పరత, అభ్యాసీల పట్ల ప్రేమకు వారికి వారే సాటి.

సద్గురు లాలాజీ సాహెబ్ ఆ దివ్యపురుషుని భూమి మీదకు అవతరింపజేసిన తర్వాత వారి దర్శనం పొంది, వేరుగా ఉండలేక వారిలోనే తనను సంపూర్ణముగా విలీనం గావించుకొన్నారు. దీని ఫలితంగా నేడు శ్రీ బాబూజీ

మహరాజ్‌గారి సామీప్యముతో పాటుగా శ్రీ లాలాజీ మహరాజ్‌గారి యొక్క సామీప్యత కూడా మనకు సదా లభిస్తున్నది.

లయావస్థ యొక్క విశిష్టత మరియు గొప్పతనమును ఎంతవరకని వర్ణించగలము? ఇంకొక విధంగా చెప్పాలంటే లయావస్థ అనేది ఆధ్యాత్మిక యాత్ర యందు మనలను తీసికొని వెళ్ళే ఓడ లాంటిది. ఆధ్యాత్మిక ఉన్నతికి ప్రాణం వంటిది. మరియు ప్రియతమ సద్గురు శ్రీ బాబూజీ మహరాజ్‌చేత మాత్రమే మన అభ్యాసులందరికీ ఇవ్వబడిన వరదానం. ఇంతేకాదు. లయావస్థ అనేది మనం దివ్యస్థితి యందు ప్రవేశమును పొందటంకోసం అమర్చిన సోపానం వంటిది.

లయావస్థను పొందనిదే ఆధ్యాత్మికత పుష్పించదు మరియు సువాసలను వెదజల్లదు. ప్రేమ అనేది చిగురించదు. మన జీవన విధానంలో మార్పు అనేది రాదు.



